


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX

RNI-APTEL/2023/88162

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 263 | గురువారం 01 - 10 -2026 | పేజీలు : 12 | వెల-3


## తిరుపతి నుంచి వారణాసికి 25 బైక్‌లు.. టీడీపీ నేతల సేవా సంకల్ప యాత్ర!





2లో

## మహిళలకు ఏసీ బస్సుల్లోనూ

# ఉచిత ప్రయాణం

## క్వాంటమ్ నుంచి ఉద్యోగాల వరకు.. ఏపీ భవిష్యత్‌పై లోకేశ్ కీలక వ్యాఖ్యలు

- 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యమన్న మంత్రి లోకేశ్
- యువత మార్పు కోరుకుంటోందన్న మంత్రి
- డీఎస్సీపై ఆరోపణలను కొట్టివేసిన లోకేశ్
- అమరావతిలో 156 బిట్ క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు ప్రస్తావన
- పెట్టుబడులకు 3ఎస్ విధానం అనుసరిస్తున్నామని వివరణ

2లో



## రైతులకు కేంద్రం గుడ్‌న్యూస్..

రబీ పంటల మద్దతు ధర పెంపు

రబీ పంటల ఎంఎస్‌పీ పెంపునకు కేంద్రం ఆమోదం

కుసుమకు అత్యధికంగా రూ.675 పెంపు

ఆవాలకు రూ.413, గోధుమకు రూ.25 చొప్పున పెంపు

3,715 లక్షల టన్నులకు పెరిగిన గోధుమ సేకరణ

ఆరు రబీ పంటలకు రూ.8.36 లక్షల కోట్ల మద్దతు ధర

2లో



## ‘బాబాయ్ హత్యతో అబ్బాయికే లాభం’.. జగన్ మౌనంపై మంత్రి నిమ్మల ప్రశ్నలు

- వివేకా హత్యపై మంత్రి నిమ్మల తీవ్ర ఆరోపణలు
- కేసులో కీలక వ్యక్తుల మరణాలపై ప్రశ్నలు
- రూ.40 కోట్ల సుపారీ అంశాన్ని ప్రస్తావించిన మంత్రి
- ఈడీ అటాచ్‌మెంట్‌ను ప్రస్తావించిన నిమ్మల
- అజయ్ కల్లాం వాంగ్మూలాన్ని గుర్తుచేసిన మంత్రి

2లో



వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడు సునీల్ యాదవ్ ఇచ్చిన వాంగ్మూలంపై మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రశ్నించారు.

- విజయవాడలో ‘పేదలకు పట్టాభిషేకం‘ కార్యక్రమం
- 120 ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారం చూపినట్లు తెలిపిన సీఎం
- రాష్ట్రవ్యాప్తంగా 26,401 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ



తమ ప్రభుత్వం 120 ఏళ్ల నాటి ఇళ్ల స్థలాల పట్టాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విజయవాడలోని మకినేని బసవపున్నయ్య స్టేడియంలో నిర్వహించిన ‘పేదలకు పట్టాభిషేకం‘ కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సొంత ఇల్లు అనేది పేదల జీవితకాల స్వప్నమని, దీని కోసం 40 నుంచి 50 ఏళ్లుగా ఎదురుచూస్తున్న వారు ఎందరో ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 26,401 మంది అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. ఎన్టీఆర్ జిల్లాలో లబ్ధిదారులకు సగటున 130 గజాల స్థలానికి పట్టాలు అందించినట్లు చెప్పారు. ఇది పేదల ఆత్మగౌరవానికి కట్టబెట్టిన పట్టాభిషేకమని, వారి చిరకాల వాంఛను నెరవేర్చామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో డబుల్ ఇంజన్ సర్కార్ ఇప్పుడు జెట్ స్పీడ్‌తో అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తోందని చంద్రబాబు అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తున్నామని, కూటమి ప్రభుత్వం ప్రతీ పేదవాడికి న్యాయం చేసేందుకు అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఇప్పటివరకు విశాఖ, మంగళగిరి,

## ‘సర్’పై వివాదం వేళ..

### ఎన్నికల సంఘం సంచలన నిర్ణయం

- కొత్త ఓటర్లకు తల్లిదండ్రుల వివరాలు అక్కర్లేదు
- తాతలు, నానమ్మల వివరాలూ అవసరం లేదు
- సర్ పూర్తయిన చోట అదనపు డిక్లరేషన్ అవసరం లేదన్న ఈసీ
- సర్ కొనసాగుతున్న చోట పాత నిబంధనే
- ఫారం-6 ద్వారా కొనసాగనున్న నిరంతర నమోదు

2లో



కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునే వారికి ఎన్నికల సంఘం (ఈసీ) కీలక మార్పు చేసింది. ‘ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ’ (సర్) పూర్తయిన 20 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కొత్త ఓటర్లు ఇక తల్లిదండ్రులు, తాతలు, నానమ్మల ఓటరు జాబితా వివరాలు సమర్పించాల్సిన అవసరం లేదు. ఈ మేరకు ఫారం-6లో మార్పులు చేసింది.

## ఇంద్రకీలాద్రి దసరా ఉత్సవాలు.. సీఎం చంద్రబాబుకు ఆహ్వానం

- అక్టోబర్ 11 నుంచి 20 వరకు ఉత్సవాలు
- క్యాంపు కార్యాలయంలో ఆహ్వానపత్రిక అందజేత
- సీఎంకు అమ్మవారి ప్రసాదం, వేదాశీర్వచనం
- ఉత్సవాల ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకున్న సీఎం
- భక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని ఆదేశం

2లో



విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఈ నెల 11 నుంచి 20 వరకు జరగనున్న దసరా మహోత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు ఆహ్వానించారు. ఈ మేరకు క్యాంపు కార్యాలయంలో సీఎంను కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారి ప్రసాదాన్ని అందించి, వేదాశీర్వచనం పలికారు. దసరా ఉత్సవాల ఏర్పాట్లపై చంద్రబాబు ఆరా తీశారు. ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దుర్గగుడి ధర్మకర్తల మండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, ఆలయ ఈవో శీనా నాయక్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

# మోదీ-ట్రంప్ ఫోన్ కాల్..

## వాణిజ్యం, రక్షణ, ఇంధనంపై కీలక చర్చలు



- వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చ
- ప్రాంతీయ పరిణామాలపై అభిప్రాయాల మార్పిడి
- ప్రపంచ శాంతి, భద్రతపై చర్చ
- సన్నిహిత సంబంధాలు కొనసాగించేందుకు అంగీకారం

2లో

ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా భారత్–అమెరికా ద్వైపాక్షిక సంబంధాల్లో కీలకమైన అంశాలపై చర్చించారు. వాణిజ్యం, రక్షణ, ఇంధనం, కీలక సాంకేతికతల రంగాల్లో ఇరు దేశాల సహకారాన్ని సమీక్షించినట్లు మోదీ తెలిపారు. ట్రంప్‌తో జరిగిన చర్చలు ఫలప్రదంగా సాగాయని మోదీ ‘ఎక్స్’లో వెల్లడించారు. భారత్–అమెరికా సమగ్ర గ్లోబల్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సన్నిహితంగా కొనసాగాలని ఇరు దేశాల నేతలు అంగీకరించినట్లు తెలిపారు. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపైనా ఇద్దరూ అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రపంచ శాంతి, భద్రతను ముందుకు తీసుకెళ్లేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై చర్చించారు. ఇరు దేశాల ప్రజల ప్రయోజనాల కోసం ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నేతలు పునరుద్ఘాటించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం తెలిపింది. అలాగే భవిష్యత్తులోనూ పరస్పరం సంప్రదింపులు కొనసాగించాలని నిర్ణయించినట్లు పేర్కొంది. భారత్–అమెరికా సంబంధాల్లో వాణిజ్యం, రక్షణ, ఇంధనం, కీలక సాంకేతికతల వంటి రంగాలు ముఖ్యమైనవిగా కొనసాగుతున్నాయి.

## అక్టోబర్ 2న యూపీఐ సేవలు పనిచేస్తాయ్!

‘నో యూపీఐ డే’ నిరసనను విరమణ

నిర్మలా సీతారామన్‌తో వ్యాపారవేత్తల భేటీ

యూపీఐ లావాదేవీలపై ప్రతిపాదించిన ఎండీఆర్ ఛార్జీకి వ్యతిరేకంగా అక్టోబర్ 2న చేపట్టాలనుకున్న ‘నో యూపీఐ డే’ నిరసనను వ్యాపార సంఘాలు విరమించుకున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో బుధవారం జరిగిన సమావేశం తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నాయి. 2లో

## కేసీఆర్ కట్టినవాటికి రేవంత్ రిబ్బన్లు కట్

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విమర్శలు



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈరోజు ఆయన మీడియాతో 2లో

## శంషాబాద్‌లో విమానానికి తప్పిన పెను ప్రమాదం..

శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో బుధవారం త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. విజయవాడకు బయలుదేరిన ఓ విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో, టేకాఫ్ అయిన కొద్దిసేపటికే పైలట్ దానిని అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ఈ హఠాత్పరిణామంతో విమానంలోని ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. 2లో

# క్వాంటమ్ నుంచి ఉద్యోగాల వరకు.. ఏపీ భవిష్యత్‌పై లోకేశ్ కీలక వ్యాఖ్యలు

యువతకు ఉద్యోగాల కల్పనే తమ ప్రభుత్వ ప్రధాన ఎజెండా అని ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాంక్లేవ్ సౌత్2026లో సీనియర్ జర్నలిస్టు, ఇండియా టుడే కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్‌తో జరిగిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు.

**యువతకు ఉద్యోగాలే తొలి లక్ష్యం**యువత తమను అడుగుతున్నది ఒక్కటేనని.. మరిన్ని ఉద్యోగాలు కల్పించాలని కోరుకుంటున్నారని లోకేశ్ చెప్పారు. అందుకే ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. విద్యా పాఠ్యాంశాలను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మారుస్తున్నామని, వివిధ రంగాల్లో పెట్టుబడులు తీసుకొచ్చి ఉద్యోగ అవకాశాలు పెంచుతున్నామని చెప్పారు.

**జెన్-జీ మార్పు కోరుకుంటోంది** కులం, మతం, ప్రాంతంతో సంబంధం లేకుండా యువతలో కొత్త మార్పు కనిపిస్తోందని లోకేశ్ అన్నారు. వ్యవస్థలో మార్పులు రావాలని కోరుకుంటున్న యువత ఒక వర్గంగా ముందుకు వస్తోందని చెప్పారు. యువతతో కలిసి సమస్యలకు పరిష్కారాలు వెతకడం తనకు ఉత్సాహాన్నిస్తోందన్నారు.

**డీఎస్సీపై ఆరోపణలు.. సర్టిఫికెట్లపై క్లారిటీ** ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ పరీక్షను పారదర్శకంగా నిర్వహించామని లోకేశ్ తెలిపారు. క్రీడా కోటాలో ఎంపికైన విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్లు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలే జారీ చేశారని చెప్పారు. ఈ అంశంపై కోర్టు, సీబీఐ దర్యాప్తు కోరినా.. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు.

**అమరావతిలో 156 బిట్ క్వాంటమ్ కంప్యూటర్** క్వాంటమ్ టెక్నాలజీ ఊహ కాదని.. ఇది నెక్స్ట్ జనరేషన్ టెక్నాలజీ అని లోకేశ్ అన్నారు. తొలి 156 బిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతిలో ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. పరిశోధనలు, మెటీరియల్ సైన్స్, క్రయోజెనిక్ టెక్నాలజీ వంటి రంగాల్లో పని చేస్తూ క్వాంటమ్ ఎకోసిస్టమ్‌ను నిర్మించాలనుకుంటున్నామని చెప్పారు.

**విద్యా వ్యవస్థలో సమూల మార్పులు** విద్యా వ్యవస్థ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మారాలని లోకేశ్ అన్నారు. గత రెండేళ్లలో 16 వేల మంది ఉపాధ్యాయులను నియమించామని తెలిపారు. ఏఐ నుంచి క్వాంటమ్ వరకు భవిష్యత్ టెక్నాలజీలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. విద్యా వ్యవస్థలో సంస్కరణలకు కనీసం దశాబ్ద కాలం పడుతుందని పేర్కొన్నారు.

**పెట్టుబడులకు '3ఎస్' మంత్రం** ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు తీసుకొచ్చేందుకు స్పీడ్, సర్వీస్, స్టెబిలిటీ అనే 3ఎస్ విధానాన్ని

అనుసరిస్తున్నామని లోకేశ్ చెప్పారు. ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇవ్వడం, వాటి పురోగతిని ఎప్పటికప్పుడు పెట్టుబడిదారులకు తెలియ జేయడం, ప్రభుత్వాలు మారినా విధానాల్లో స్థిరత్వం ఉండేలా చూడటం తమ విధానమన్నారు. వ్యవసాయం నుంచి క్వాంటమ్ వరకు 23 క్లస్టర్లలో పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.

## అక్టోబర్ 2న యూపీఐ సేవలు పనిచేస్తాయ్!

వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 20 మంది వ్యాపార ప్రతినిధులు నిర్మలా సీతారామన్‌ను కలిశారు. రూ. 2,000కు మించిన మర్చంట్ యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం ఫీజు విధించే ప్రతిపాదనపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఛార్జీతో చిన్న, మధ్య తరహా వ్యాపారాలపై భారం పెరుగుతుందని తెలిపారు. డిజిటల్ చెల్లింపుల వినియోగం కూడా ప్రభావితమయ్యే అవకాశం ఉందని చెప్పారు. చాందినీ చౌక్ ఎంపీ, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్‌వాల్ నేతృత్వంలో ఈ ప్రతినిధి బృందం సమావేశమైంది. ప్రతిపాదిత ఛార్జీపై స్పష్టత ఇవ్వాలని కోరింది. వ్యాపారుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. సమావేశం తర్వాత ఖండేల్‌వాల్ మాట్లాడుతూ.. కేంద్రంతో చర్చలు సానుకూలంగా జరిగాయని తెలిపారు. వ్యాపారులు లేవనెత్తిన అంశాలను ప్రభుత్వం పరిశీలిస్తుందన్న భరోసా లభించిందన్నారు. దీంతో అక్టోబర్ 2న తలపెట్టిన నిరసనను ఉపసంహరించుకున్నట్లు చెప్పారు. ఆల్ ఇండియా కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ ఫెడరేషన్, ఆల్ ఇండియా మొబైల్ రిటైలర్స్ అసోసియేషన్ తొలుత 'నో యూపీఐ డే'కు పిలుపునిచ్చాయి. అయితే కేంద్రంతో చర్చల తర్వాత ఆ పిలుపును వెనక్కి తీసుకున్నాయి. ఇదిలా ఉండగా.. రూ. 2,000కు మించిన అర్హత ఉన్న మర్చంట్ యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం ఫీజు అక్టోబర్ 15 నుంచి అమల్లోకి రావాల్సి ఉంది. మరోవైపు యూపీఐపై జీఎస్టీ భారం పెరుగుతుందన్న వార్తలను ఎన్‌పీసీఐ గతంలో ఖండించింది. రూ. 2,000 వరకు జరిగే లావాదేవీలకు జీరో ఎండీఆర్ కొనసాగుతుందని స్పష్టం చేసింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం యూపీఐ వ్యాపార లావాదేవీల్లో 96 శాతానికి పైగా రూ. 2,000లోపే ఉన్నాయి.

## కేసీఆర్ కట్టినవాటికి రేవంత్ రిబ్బన్లు కట్

మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి ఒక 'రిబ్బన్ కటింగ్ సీఎం' అంటూ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్మించిన కట్టడాలకే రేవంత్ రెడ్డి రిబ్బన్లు కత్తిరిస్తున్నారని ఆరోపించారు. "కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని చెప్పిన రేవంత్, ఇప్పుడు ఆయన కట్టిన వాటినే ప్రారంభిస్తున్నారు. కరీంనగర్ కలెక్టరేట్ కేసీఆర్ ఆనవాళ్లు కాదా?" అని కౌశిక్ రెడ్డి ప్రశ్నించారు. సిరిసిల్లలో కాంగ్రెస్ ఏర్పాటు చేసిన సభకు ప్రజల నుంచి స్పందన లేదని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ఆయన ఓ సవాల్ విసిరారు. సిరిసిల్లలో ఎమ్మెల్యే కేటీఆర్ చేసిన అభివృద్ధిలో కనీసం 10 శాతం అయినా తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో చేసి చూపించాలని అన్నారు. ముఖ్యమంత్రి సొంత గ్రామంలోనే కరెంట్ సరఫరా సరిగా లేదని ఎద్దేవా చేశారు. "తెలంగాణలో కాంగ్రెస్ తల్లిని నిలబెట్టారు. రెండేళ్లలో మళ్లీ కేసీఆర్ సీఎం అవుతారు. అప్పుడు కాంగ్రెస్ తల్లిని ప్యాక్ చేసి గాంధీ భవన్‌కు పంపుతాం" అని కౌశిక్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## శంషాబాద్‌లో విమానానికి తప్పిన పెను ప్రమాదం..

వివరాల్లోకి వెళితే.. 591 ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం 45 మంది ప్రయాణికులతో శంషాబాద్ నుంచి విజయవాడకు బయలుదేరింది. విమానం గగనతలానికి ఎగిరిన కొద్దిసేపటికే సాంకేతిక సమస్య తలెత్తినట్లు పైలట్ గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన ఆయన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) అధికారులకు సమాచారం అందించారు. వారి అనుమతితో విమానాన్ని తిరిగి శంషాబాద్ విమానాశ్రయానికి మళ్లించి సురక్షితంగా ల్యాండ్ చేశారు. విమానం క్షేమంగా ల్యాండ్ అవ్వడంతో అటు ప్రయాణికులు, ఇటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రయాణికులందరూ సురక్షితంగా ఉన్నారని, ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదని విమానాశ్రయ వర్గాలు ధ్రువీకరించాయి. అనంతరం సాంకేతిక బృందం విమానాన్ని తనిఖీ చేసి మరమ్మతులు ప్రారంభించింది. ప్రయాణికులను ప్రత్యామ్నాయ విమానంలో విజయవాడకు పంపేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎయిర్‌లైన్స్ యాజమాన్యం వెల్లడించింది.

## తిరుపతి నుంచి వారణాసికి 25 బైక్‌లు.. టీడీపీ నేతల సేవా సంకల్ప యాత్ర!

**తిరుపతి నుంచి వారణాసి వరకు బైక్ యాత్ర**

**యాత్రలో పాల్గొంటున్న 25 మంది రైడర్లు**

**టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో యాత్ర నిర్వహణ**

**నాలుగు రాష్ట్రాల మీదుగా ఎనిమిది రోజుల ప్రయాణం**

ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతి నుంచి వారణాసి వరకు చేపట్టిన 'సేవా సంకల్ప యాత్ర'ను ఆయన ప్రారంభించారు. 25 మంది బైక్ రైడర్లు ఈ యాత్రలో పాల్గొంటున్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు ఆదేశాలు, మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు టీడీపీ విద్యార్థి విభాగం (టీఎన్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఈ యాత్ర నిర్వహిస్తున్నారు. తిరుపతిలోని అలిపిరి నుంచి శ్రీవారి ఆశీస్సులతో ప్రారంభమైన ఈ యాత్ర.. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్ మీదుగా సాగనుంది. సుమారు ఎనిమిది రోజుల పాటు కొనసాగి అక్టోబర్ 8న వారణాసికి చేరుకోనుంది. ఆయా రాష్ట్రాల్లో భాజపా నాయకులు యాత్రకు స్వాగతం పలకనున్నారు. టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు, యువ నేతలు కూడా ఇందులో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో నిబద్ధతతో పనిచేసే నాయకత్వానికి నరేంద్ర మోదీ, చంద్రబాబు నాయుడు నిదర్శనమని అన్నారు. సమాజ నిర్మాణం, ప్రజా సేవ కోసం నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. అదే స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి, సంక్షేమం, పెట్టుబడుల ఆకర్షణకు కృషి చేస్తున్నామని పల్లా తెలిపారు. ప్రజలకు మెరుగైన పాలన అందించడమే లక్ష్యమని చెప్పారు. మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను గుర్తిస్తూ నిర్వహిస్తున్న ఈ యాత్రలో భాగస్వామి కావడం ఆనందంగా ఉందన్నారు. యాత్రలో పాల్గొంటున్న బైక్ రైడర్లకు శుభాకాంక్షలు తెలిపారు.



## డీఎస్పీ భీమ్‌రెడ్డి కేసులో కీలక మలుపు..

**8 మందిపై బినామీ చట్టం కింద కేసులు**

**దేశంలోనే ఇదే తొలిసారి కేసు నమోదు**

అక్రమాస్తుల కేసులో సస్పెండ్ అయిన తెలంగాణ మాజీ డీఎస్పీ సంకిరెడ్డి భీమ్‌రెడ్డి కేసులో సంచలన పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే భారీగా ఆస్తులను గుర్తించిన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ).. ఆ తర్వాత చేపట్టిన దర్యాప్తు ఆధారంగా ఇప్పుడు ఆదాయపు పన్ను శాఖ (ఐటీ) కూడా రంగంలోకి దిగింది. దీంతో ఈ కేసులో దర్యాప్తు సంస్థలు ఏసీబీ, ఐటీ మరింత దూకుడు పెంచాయి. భీమ్‌రెడ్డికి బినామీలుగా వ్యవహరించినట్లు అనుమానిస్తున్న 8 మందిపై బినామీ ఆస్తుల చట్టం కింద కేసులు నమోదు చేశాయి. ఇది దేశంలోనే తొలిసారిగా బినామీ లావాదేవీల చట్టం కింద ఇలాంటి కేసుల నమోదు జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. డీజీపీ కార్యాలయంలోని పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ విభాగంలో డీఎస్పీగా పనిచేస్తున్న సమయంలో భీమ్‌రెడ్డిపై ఏసీబీ కేసు నమోదు చేసింది. జూన్ 27వ తేదీన నమోదైన ఈ కేసులో భాగంగా తెలంగాణ, కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో అధికారులు సోదాలు నిర్వహించారు. భూములు, ఇళ్లు, ప్లాట్లు, బ్యాంకు డిపాజిట్లు వంటి ఆస్తులకు సంబంధించిన వివరాలను అధికారులు గుర్తించినట్లు సమాచారం. మొత్తం 16 ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం రూ. 200 కోట్లకు పైగా విలువైన ఆస్తులు గుర్తించినట్లు ఏసీబీ వర్గాల ద్వారా వెల్లడైంది. ఈ దర్యాప్తులో కొన్ని ఆస్తులు ఇతర వ్యక్తుల పేర్లపై ఉన్నప్పటికీ వాటి వెనుక భీమ్‌రెడ్డి పెట్టుబడులు ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమైనట్లు తెలుస్తోంది. దీంతో బినామీ ఆస్తుల కోణంలోనూ దర్యాప్తును అధికారులు చేపట్టారు. బినామీ ఆస్తులకు సంబంధించిన ఆధారాలను సేకరించేందుకు ఏసీబీ అధికారులు కోర్టు నుంచి సెర్చ్ వారెంట్లు పొందారు. చార్టర్డ్ అకౌంటెంట్ వెంకటేష్ సహా మొత్తం 8 మంది ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని పుప్పాలగూడతో పాటు ఇతర ప్రాంతాల్లో జరిగిన ఈ సోదాల్లో ఆస్తులకు సంబంధించిన పత్రాలు, నగదు, బంగారం, ఇతర కీలక ఆధారాలను అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆస్తుల కొనుగోలుకు డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది.. ఆ ఆస్తులకు అసలు యజమాని ఎవరు అనే అంశాలను దర్యాప్తు సంస్థలు పరిశీలిస్తున్నాయి. ఏసీబీ దర్యాప్తులో లభించిన సమాచారాన్ని పరిశీలించిన ఐటీ శాఖ.. భీమ్‌రెడ్డికి బినామీలుగా అనుమానిస్తున్న 8 మందిపై బినామీ ప్రాపర్టీ ట్రాన్సాక్షన్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. బినామీ పేర్లపై ఉన్న ఆస్తులకు అసలు పెట్టుబడులు ఎవరివి.. ఆస్తుల కొనుగోలుకు ఉపయోగించిన నిధుల మూలం ఏంటి.. ఆస్తులను ఎవరు కంట్రోల్ చేస్తున్నారు వంటి అంశాలపై ఐటీ అధికారులు దృష్టి సారించారు. బినామీ చట్టం కింద నమోదైన కేసుల నేపథ్యంలో సంబంధిత ఆస్తులపై తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. దర్యాప్తులో బినామీ లావాదేవీలు నిర్ధారణ అయితే ఆయా ఆస్తులపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. భీమ్‌రెడ్డి వ్యవహారంలో ఏసీబీ ఇప్పటివరకు గుర్తించిన ఆస్తుల విలువ రూ. 200 కోట్లకు పైగా ఉన్నట్లు దర్యాప్తు వర్గాలు చెబుతున్నాయి. ఇందులో భూములు, ఇళ్లు, ఇతర స్థిరాస్తులతో పాటు బ్యాంకు ఖాతాలు, పెట్టుబడులకు సంబంధించిన వివరాలు కూడా ఉన్నట్లు సమాచారం. బినామీల పేరిట ఉన్న ఆస్తులు కూడా దర్యాప్తులో భాగం కావడంతో మొత్తం ఆస్తుల విలువ మరింత పెరిగే అవకాశం ఉందా అనే కోణంలో అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ఈ కేసులో సుమారు 57 రోజుల పాటు భీమ్‌రెడ్డి చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్నారు. ఆ తర్వాత సెప్టెంబర్ 1వ తేదీన బెయిల్‌పై విడుదల అయ్యారు. అయితే ఆయనపై నమోదైన కేసులో దర్యాప్తు మాత్రం కొనసాగుతోంది. ప్రస్తుతం ఏసీబీతో పాటు ఐటీ అధికారులు కూడా బినామీ ఆస్తులపై దృష్టి పెట్టడంతో కేసు మరింత కీలకంగా మారింది. మరోవైపు ఈ వ్యవహారంలో ఈడీ కూడా మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

## చాక్లెట్ డబ్బాల్లో డ్రగ్స్ సరఫరా

**శంషాబాద్?లో**

**రూ.24.5 కోట్ల కొకైన్ పట్టివేత**

శంషాబాద్ విమానాశ్రయంలో భారీ మొత్తంలో కొకైన్ పట్టుబడింది. దోహా నుంచి హైదరాబాద్?కు వస్తున్న ఓ ప్రయాణికుడిని తనిఖీ చేసిన డీఆర్ఐ అధికారులు రూ. 24.5కోట్ల విలువైన కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. దోహా నుంచి హైదరాబాద్?కు వస్తున్న ఓ ప్రయాణికుడి బ్యాగేజీలో కొకైన్ ఉందన్న సమాచారం మేరకు అతడిని డీఆర్?ఐ అధికారులు తనిఖీ చేశారు. ఈ క్రమంలో 387 గ్రాముల బరువుగా పేర్కొన్న 7 డార్క్ చాక్లెట్ ట్యూబులను అతడి బ్యాగ్?లో గుర్తించారు. ఐతే ట్యూబులపై పేర్కొన్న బరువుకంటే ఎక్కువగా ఉండటంతో అధికారులు తెరిచి పరిశీలించగా చాక్లెట్లతోపాటు దాచిన 207 క్యాప్సూల్స్ బయటపడ్డాయి. ఒక్కో క్యాప్సూల్‌లో తెల్లటి పొడి పదార్థం ఉండటంతో నార్కోటిక్ డ్రగ్ డిటెక్షన్ కిట్‌తో పరీక్షించగా కొకైన్‌గా నిర్ధారణ అయింది. 4 కిలోల 9 గ్రాముల కొకైన్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన కొకైన్ విలువ సుమారు రూ. 24.5 కోట్లు ఉంటుందని డీఆర్ఐ అధికారులు తెలిపారు. అనంతరం ప్రయాణికుడిని అదుపులోకి తీసుకున్నారు.రాష్ట్రంలో మాదకద్రవ్యాల కట్టడికి పోలీసులు ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ డ్రగ్స్? ముఠాల ఆగడాలకు మాత్రం అడ్డుకట్ట పడటం లేదు. యాప్‌లు, సోషల్ మీడియాలో, వాట్సాప్ తదితర గ్రూపులు మాదకద్రవ్యాల వ్యాపారానికి అడ్డాలుగా పనిచేస్తున్నాయి. ఇటీవల డ్రగ్స్ పట్టుబడిన కేసుల్లో పోలీసులు జరిపిన దర్యాప్తులో బ్రో, ఎంజాయ్, దురంధర్, కాకా, ఫీడ్, మిర్జాపూర్ లాంటి కోడ్? భాష ఉపయోగిస్తున్నట్టు వెల్లడైంది. దేశవ్యాప్తంగా ప్రధాన నగరాలకు మాదకద్రవ్యాలను రవాణా చేసే ముఠాలు డెడ్?డ్రాప్ పద్ధతిని ఉపయోగిస్తున్నాయి. కొనుగోలుదారులు పోలీసులకు పట్టుబడినప్పటికీ సరఫరాదారుల గుర్తింపు మాత్రం గోప్యంగా ఉండేలా చూస్తున్నాయని తేలింది. యాప్‌లు లేదా సామాజిక మాధ్యమాల ద్వారా ఆర్డర్ అందిన వెంటనే, ముందుగానే నగదును తీసుకుంటారు. ఆ తర్వాత కొనుగోలుదారు హైదరాబాద్?లోని తమ ఏజెంట్లను అప్రమత్తం చేస్తారు.

## మహిళలకు ఏసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం

విజయవాడ కార్యక్రమాలతో కలిపి సుమారు 60,000 పట్టాలు పంపిణీ చేశామని, వాటి విలువ సుమారు రూ. 52,000 కోట్లు ఉంటుందని వివరించారు. లబ్ధిదారులు ఈ ఆస్తిని అమ్ముకోవద్దని, భవిష్యత్ కోసం కాపాడుకోవాలని సూచించారు. మహిళల కోసం 'స్త్రీ శక్తి' పథకం కింద ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేస్తున్నామని, భవిష్యత్తులో ఏసీ బస్సులను కూడా కొనుగోలు చేసి వాటిలోనూ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు.

## 'బాబాయ్ హత్యతో అబ్బాయికే లాభం'.. జగన్ మౌనంపై మంత్రి నిమ్మల ప్రశ్నలు

వివేకా హత్యతో అంతిమంగా లబ్ధి పొందింది జగన్, ఆయన కుటుంబ సభ్యులు, అవినాష్‌రెడ్డి అని సునీల్ యాదవ్ చెప్పినట్లు మంత్రి పేర్కొన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిమ్మల మాట్లాడారు. సునీల్ యాదవ్ కోర్టులో తనకు ప్రాణహాని ఉందని చెప్పినా తాడేపల్లి ప్యాలెస్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. తనను కాకుండా అంతిమ లబ్ధిదారులైన జగన్, అవినాష్‌రెడ్డి కుటుంబ సభ్యులను విచారిస్తే అసలు విషయాలు బయటకు వస్తాయని సునీల్ చెప్పినట్లు తెలిపారు. వివేకా హత్య కేసుతో సంబంధం ఉన్న పలువురు కీలక వ్యక్తులు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడంపైనా మంత్రి ప్రశ్నలు లేవనెత్తారు. కసనూరు శ్రీనివాస్‌రెడ్డి, ఈసీ గంగిరెడ్డి, కువైట్ గంగాధర్‌రెడ్డి, డ్రైవర్ నారాయణ, వైఎస్ అభిషేక్‌రెడ్డి, వాచ్‌మెన్ రంగయ్య తదితరుల మరణాలపై సమాధానాలు రావాల్సి ఉందన్నారు. హత్యకు రూ. 40 కోట్ల సుపారీ ఇచ్చినట్లు వచ్చిన అంశాన్ని కూడా నిమ్మల ప్రస్తావించారు. అంత పెద్ద మొత్తాన్ని ఇచ్చే ఆర్థిక సామర్థ్యం ఎర్ర గంగిరెడ్డి, శివశంకర్‌రెడ్డికి లేదని.. రాజకీయంగా లబ్ధి పొందిన జగన్ కుటుంబానికే ఆ సామర్థ్యం ఉందని ఆరోపించారు. సుపారీకి సంబంధించిన నగదులో రూ. 40 లక్షలను ఈడీ అటాచ్ చేసిందని చెప్పారు.హత్య జరిగిన రోజు తెల్లవారుజామునే వివేకానందరెడ్డి చనిపోయిన విషయం జగన్‌కు తెలిసినా.. సాయంత్రం వరకు పులివెందుల వెళ్లకుండా హైదరాబాద్‌లో ఎందుకు ఉన్నారని మంత్రి ప్రశ్నించారు. నాటి ముఖ్య సలహాదారు అజయ్ కల్లాం సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఘటనాస్థలంలో రక్తపు మరకలను తొలగించి, గుండెపోటుగా ప్రచారం చేయడం ద్వారా ఆధారాలను మార్చేందుకు ప్రయత్నించారని నిమ్మల ఆరోపించారు. గతంలో సీబీఐ దర్యాప్తు కోరిన జగన్.. ముఖ్యమంత్రి అయ్యాక విచారణను అడ్డుకునే ప్రయత్నం చేశారని విమర్శించారు. దస్తగిరి, సునీల్ యాదవ్ వాంగ్మూలాలు, దర్యాప్తు సంస్థల నివేదికలు, గూగుల్ టేక్అవుట్ ఆధారాలు, ఈడీ అటాచ్‌మెంట్లు కేసులో కీలకంగా ఉన్నాయని మంత్రి అన్నారు. నిందితులు తనపై ఆరోపణలు చేస్తున్నా జగన్ స్పందించకపోవడం ప్రజల్లో అనుమానాలు పెంచుతోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా వివేకా హత్యపై జగన్ ప్రజలకు సమాధానం చెప్పాలని నిమ్మల డిమాండ్ చేశారు.

## 'సర్'పై వివాదం వేళ.. ఎన్నికల సంఘం సంచలన నిర్ణయం

ఇప్పటివరకు కొత్త ఓటరు పేరు ఓటర్ల జాబితాలో చేర్చేందుకు సాధారణ ఫారం-6 సరిపోయేది. అయితే 'సర్' ప్రక్రియ సమయంలో ఫారం-6తో పాటు అదనపు డిక్లరేషన్ తీసుకున్నారు. గతంలో ఉన్న ఓటర్ల జాబితాతో తమ కుటుంబానికి ఉన్న సంబంధాన్ని నిర్ధారించేందుకు తల్లిదండ్రులు లేదా తాతల వివరాలు ఇవ్వాలని అందులో కోరారు. 'సర్' పూర్తయిన రాష్ట్రాల్లో ఇప్పుడు ఈ అదనపు డిక్లరేషన్ అవసరం ఉండదు. బిహార్, పశ్చిమ బెంగాల్ సహా 20 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సర్ పూర్తయిందని ఈసీ తెలిపింది. సర్ సమయంలో పేరు జాబితాలో లేని వారు, అలాగే కొత్తగా ఓటు హక్కు పొందిన యువత, తొలిసారి ఓటు వేయబోయే వారు నిరంతర అప్‌డేషన్ ప్రక్రియలో పేర్లు నమోదు చేసుకోవచ్చు.అయితే 'సర్' ఇంకా కొనసాగుతున్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మాత్రం ఈ నిబంధన కొనసాగుతుంది. అక్కడ కొత్త ఓటర్లు ఫారం-6తో పాటు 'సర్'కు సంబంధించిన డిక్లరేషన్ సమర్పించాల్సి ఉంటుంది. గత ఓటర్ల జాబితాతో తమ సంబంధాన్ని చూపించే వివరాలను కూడా ఇవ్వాలి.ఫారం-6లో మార్పులపై ఈసీలో విభేదాలు ఉన్నట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అదనపు డిక్లరేషన్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఫారం-6, 'సర్'కు సంబంధించిన నిర్ణయాలు ముగ్గురు కమిషనర్ల ఏకగ్రీవ నిర్ణయాలేనని ఈసీ స్పష్టం చేసింది. సెప్టెంబర్ 26న విడుదల చేసిన వివరణలో సర్ డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు సమర్థించిందని ఈసీ పేర్కొంది. సర్ పూర్తయిన ప్రాంతాల్లో, అలాగే ఇంకా ప్రారంభం కాని ప్రాంతాల్లో అదనపు డిక్లరేషన్ అవసరం లేదని తెలిపింది. తాజా మార్పుతో సర్ పూర్తయిన రాష్ట్రాల్లో కొత్త ఓటర్లు ఇక సాధారణ ఫారం-6 ద్వారానే నమోదు చేసుకోవచ్చు. అదనంగా కుటుంబానికి సంబంధించిన పాత ఓటర్ల జాబితా వివరాలు ఇవ్వాల్సిన అవసరం ఉండదు.

## రైతులకు కేంద్రం గుడ్‌న్యూస్.. రబీ పంటల మద్దతు ధర పెంపు

రైతుల ఆదాయం పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2027-28 మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి అన్ని రబీ పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) పెంచేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ) సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.రబీ పంటల్లో కుసుమ మద్దతు ధరను అత్యధికంగా క్వింటాల్‌పై రూ. 675 పెంచారు. ఆ తర్వాత ఆవాలకు రూ. 413 పెంపు ప్రకటించారు. మసూర్ పప్పుకు రూ. 390, బార్లీకి రూ. 136, శనగకు రూ. 83, గోధుమకు రూ. 25 చొప్పున ఎంఎస్‌పీ పెంచారు.రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించేలా ఈ పెంపు చేసినట్లు కేంద్రం తెలిపింది. ఉత్పత్తి వ్యయంపై కనీసం 1.5 రెట్ల స్థాయిలో ఎంఎస్‌పీ ఉండేలా చూడాలన్న 2018-19 కేంద్ర బడ్జెట్ ప్రకటనకు అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.ఇటీవలి కాలంలో తృణధాన్యాలతో పాటు పప్పులు, నూనెగింజల సాగును ప్రోత్సహించేందుకు కేంద్రం ఎక్కువ మద్దతు ధర అందిస్తోంది. 2014-15 నుంచి 2025-26 మధ్య గోధుమల సేకరణ 3,715 లక్షల టన్నులకు పెరిగింది. 2004-05 నుంచి 2013-14 మధ్య ఇది 2,254 లక్షల టన్నులుగా ఉంది. ఆరు రబీ పంటల సేకరణ కూడా ఇదే కాలంలో 3,921 లక్షల టన్నులకు చేరింది. గతంలో ఇది 2,302 లక్షల టన్నులుగా ఉండేది. గోధుమ రైతులకు 2014-15 నుంచి 2025-26 మధ్య మద్దతు ధర రూపంలో రూ. 7.31 లక్షల కోట్లు చెల్లించారు. 2004-05 నుంచి 2013-14 మధ్య చెల్లించిన రూ. 2.56 లక్షల కోట్లతో పోలిస్తే ఇది ఎక్కువ. ఆరు రబీ పంటలు పండించే రైతులకు ఇదే కాలంలో రూ. 8.36 లక్షల కోట్లు ఎంఎస్‌పీగా చెల్లించగా.. అంతకుముందు కాలంలో రూ. 2.65 లక్షల కోట్లు చెల్లించారు.

## మోదీ-ట్రంప్ ఫోన్ కాల్.. వాణిజ్యం, రక్షణ, ఇంధనంపై కీలక చర్చలు

ఇరు దేశాల మధ్య వాణిజ్య సహకారం కొనసాగుతున్నప్పటికీ, ప్రస్తుతం సమగ్ర ద్వైపాక్షిక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లో లేదని విదేశాంగ మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియా-యూఎస్ ట్రేడ్ ఫెసిలిటేషన్ పోర్టల్ పేర్కొంటోంది. గతంలోనూ మోదీ, ట్రంప్ పలుమార్లు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ ఏడాది జూన్‌లో జీ7 సదస్సు సందర్భంగా ఇద్దరూ భేటీ అయి భారత్-అమెరికా సంబంధాలపై చర్చించినట్లు విదేశాంగ శాఖకు సంబంధించిన వివరాలను ఉటంకిస్తూ తాజా నివేదికలు తెలిపాయి.

## ఫ్లైదుబాయ్‌లో ఘర్షణ...

దుబాయ్ నుంచి టెల్ అవీవ్ బయల్దేరిన 'ఫ్లైదుబాయ్' విమానంలో అత్యంత నాటకీయ, ఉద్రిక్త పరిణామాలు చోటుచేసుకున్నాయి. విమానం గాలిలో ఉండగానే కాక్‌పిట్‌లో ఇద్దరు పైలట్ల మధ్య తీవ్ర ఘర్షణ తలెత్తింది. ఈ ఘటన హైజాక్ భయాలను రేకెత్తించడంతో, విమానాన్ని సౌదీ అరేబియాలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. వివరాల్లోకి వెళితే, బుధవారం ఫ్లై1073 బోయింగ్ 737 విమానం 180 మంది ప్రయాణికులతో దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు బయలుదేరింది. ప్రయాణం ప్రారంభమైన రెండు గంటల తర్వాత, సౌదీ-జోర్డాన్ సరిహద్దు సమీపంలో ఉండగా పైలట్ల మధ్య భౌతిక దాడి జరిగింది.

# దుకాణాలలో సౌభాగ్యపౌడర్ విక్రయిస్తే కఠిన చర్యలు ఎస్సై మధుసూదన





**కిరాణా షాపులపై పోలీసుల ఆకస్మిక తనిఖీలు**

**సౌభాగ్య పౌడర్ విక్రయిస్తే చర్యలు తప్పవు**

**షాపు యజమానులకు పోలీసుల ఘాటు హెచ్చరిక**

సిరివెళ్ల (నంది పత్రిక) సిరివెళ్ల మండల పరిధిలోని పలు గ్రామాల్లో కిరాణా దుకాణాలపై పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షేరన్ ఆదేశాల మేరకు పోలీసు సిబ్బంది సిరివెళ్ల మండల కేంద్రంలో మరియు ఆయా గ్రామాల్లోని కిరాణా షాపులను తనిఖీ చేసి,నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న పదార్థాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సౌభాగ్య పౌడర్‌ను కిరాణా షాపుల్లో విక్రయిస్తే ఉపేక్షించేది లేదని,విక్రయించినట్లు గుర్తిస్తే సంబంధిత షాపు యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు ఘాటుగా హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి పదార్థాలను విక్రయించవద్దని స్పష్టం చేశారు.పోలీసుల హెచ్చరికలను లెక్కచేయకుండా సౌభాగ్య పౌడర్ విక్రయాలు కొనసాగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు దుకాణదారులకు తేల్చి చెప్పారు. అనుమతులు లేని,నిషేధిత పదార్థాల విక్రయాలకు దూరంగా ఉండాలని సూచించారు.ప్రజల ఆరోగ్యం,భద్రతకు భంగం కలిగించే పదార్థాల విక్రయాలపై పోలీసు శాఖ నిఘా కొనసాగిస్తుందని అధికారులు తెలిపారు. మండలంలోని కిరాణా వ్యాపారులు నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి విక్రయాలు జరిపే దుకాణాలపై ఇకపై కూడా ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని పోలీసులు హెచ్చరించారు.

# నూనెపల్లె రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణం పై ఎంపీ బైరెడ్డి శబరి ఇచ్చిన హామీతో నిరవధిక రిలే నిరాహార దీక్షల విరమణ.





నంద్యాల సిటీ బ్యూరో సెప్టెంబర్ 30 ( నంది పత్రిక )

నూనెపల్లె రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణము, శ్యామ కాలువపై ఆర్ అండ్ బ్రిడ్జి విస్తరణ, ఆసుపత్రి ఎన్జీవోస్ కాలనీ కూడలి దగ్గర సిగ్నల్ లైట్స్ ఏర్పాటు, నూనెపల్లెలో పోలీస్ పికెట్ ఏర్పాటు సాధనకై నిరవధిక నిరాహార దీక్షలు మూడవ రోజు చేరుకున్నాయి. నంద్యాల పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి ఈ ప్రజా సమస్యలపై స్పందించి మూడవరోజు ఉదయం 9 గంటలకు నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వేలాదిమంది ప్రజలు, మేధావులు, పెద్దలు, వ్యవసాయదారులు, పశుపోషణపై ఆధారపడ్డ మహిళలు, వ్యాపార వర్గాలు ఈ సందర్భంగా పాల్గొనడం జరిగినది. వారందరూ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి కి స్వచ్ఛందంగా వారు పడే అష్ట కష్టాలను విన్నవించుకున్నారు. మొదటగా భగత్ సింగ్ చిత్రపటానికి విజయభాస్కర్ రెడ్డి, రామస్వామి, తోట ధనుంజయుడు ఆధ్వర్యంలో బైరెడ్డి శబరి పూలమాలను అందివ్వగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేయటంతో కార్యక్రమం మొదలైంది. ఈ సందర్భంగా వందేమాతరం నినాదాలతో వేలమంది గొంతులతో ఈ ప్రాంతం అంతా మారుమ్రోగింది. నిరాహార శిబిర ఉద్దేశాన్ని ఏ పరిస్థితులలో ఉద్యమాన్ని ప్రారంభించవలసి వచ్చిందో అభివృద్ధి కమిటీ కన్వీనర్ శంకరయ్య గారు వివరిస్తూ ఈ ప్రాంతం 100 సంవత్సరాల చరిత్ర ఉందని, పరిశ్రమలు, ప్రభుత్వ సంస్థలు, వ్యాపార కేంద్రంగా ఉండి కలకలలాడుతూ ఉండేదని, రైల్వే ఓవర్ బ్రిడ్జి పడటం వల్ల గత వైభవం మసకబారిపోయిందని, రైల్వే ట్రాక్ ను ప్రతిరోజు దాటుతూ ప్రమాదాలకు గురవుతున్నారని, ఈ సమస్య పరిష్కారానికై గత ఏడు సంవత్సరాల నుండి రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణం కొరకై ప్రయత్నాలు జరుగుతున్నాయని, వందేమాతరం స్ఫూర్తితో భగత్ సింగ్ జయంతి రోజు ఉద్యమాన్ని ప్రారంభించడం జరిగిందని అన్నారు. పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి కి అభివృద్ధి కమిటీ వినతిపత్రం ఇవ్వగా వారు స్పందించి ముఖ్యమంత్రితో, రైల్వే డివిజనల్ మేనేజర్ తో, రైల్వే కేంద్ర మంత్రితో సంప్రదించడం జరిగింది. రైల్వే డిపార్ట్మెంట్ వారు రాష్ట్ర ప్రభుత్వము స్థల సేకరణ చేసి ఇచ్చిన ఎడల, బ్రిడ్జి నిర్మాణము చేస్తామని కలెక్టర్ కి లేఖ పంపడం జరిగినది. మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ అభివృద్ధి కమిటీ కలువగా వారు కూడా స్పందించి అన్ని డిపార్ట్మెంట్స్ తో జాయింట్ మీటింగ్ వేసి నష్టపరిహార అంచనాలు తయారు చేయమని ఆదేశాలు ఇవ్వడం జరిగినది. అయినను 10 మాసాలుగా పురోగతి లేనందున ఈ ఉద్యమాన్ని ప్రారంభించవలసి వచ్చిందని, పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి అలాగే ఫరూక్ ఈ విషయంలో స్పందించి ప్రజల ఆకాంక్షను తీర్చాలని కోరారు. పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి మాట్లాడుతూ అభివృద్ధి కమిటీ వారు వినతిపత్రం ఇచ్చిన వెంటనే తాను స్పందించానని కేంద్ర రైల్వే మంత్రితో , ముఖ్యమంత్రితో ఈ విషయంల చర్చించానని మరియు రైల్వే డివిజనల్ మేనేజర్ కు లేఖను పంపించామని, అధికారులు నష్టపరిహారం అంచనాను వేస్తున్నారన, ఈరోజే కలెక్టర్ దగ్గర సమావేశం ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి కి ఈ విషయంపై సంబంధిత ఫైలు పంపడం జరుగుతుందని, వెంటనే నేను ఫరూక్ తో కలిసి ముఖ్యమంత్రి తో త్వరలో రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణానికి కావలసిన నిధులు రాబట్టి సమస్యలు పరిష్కరిస్తామని వారు భావోద్వేగంతో ప్రజల హర్షధ్వానాల, వందేమాతరం నినాదాల మధ్య హామీ ఇవ్వడం జరిగినది. ఇంతమంది ప్రజల కష్టాన్ని తీర్చవలసిన బాధ్యత నాపై ఉన్నదని ఈ విషయములో ఎలాంటి అపోహలు వద్దని, ఇది నా బాధ్యత అని కావున మీరు నిరాహార దీక్షను విరమించుకోవలసినదిగా కోరుతున్నానని ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి ఇచ్చిన హామీపై కమిటీ వారు నిరాహార దీక్షను విరమిస్తున్నామని నిర్ణయం ప్రకటించగా, నిరాహార దీక్ష చేస్తున్న అందరికి స్వహస్తలతో నిమ్మ రసం ఇచ్చి దీక్షను విరమింప చేసారు.

ఈ కార్యక్రమంలో నూనెపల్లె అభివృద్ధి కమిటీ సభ్యులు, పెద్దలు, మేధావులు, వ్యాపారస్తులు, వ్యవసాయదారులు, పశు పోషణపై ఆధారపడ్డ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగినది.





# ఎద్దుపెంటలో అభివృద్ధి పనులకు భూమిపూజ

## వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరిన మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి

డోన్ : నందిపత్రిక సెప్టెంబర్ 30: డోన్ మండలం ఎద్దుపెంట గ్రామంలో పల్లెపండుగ3.0 కార్యక్రమంలో భాగంగా రూ.20 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రెయిన్ల నిర్మాణ పనులకు డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి భూమిపూజ చేశారు. అనంతరం గ్రామంలో నిర్మించిన తాగునీటి ట్యాంక్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు అవసరమైన రహదారులు, డ్రెయిన్లు, తాగునీటి సౌకర్యాలను ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఎద్దుపెంట గ్రామ మాజీ సర్పంచ్ సిద్ధార్థ స్కూల్ కృష్ణారెడ్డి ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, గ్రామాల్లో జరుగుతున్న పనులతో ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు కృష్ణారెడ్డి తెలిపారు. గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు తాగునీటి ట్యాంక్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యేకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## షూటింగ్ స్పాట్‌కు ఆటోలో వచ్చిన రజనీకాంత్

సూపర్ స్టార్ రజనీకాంత్ మరోసారి తన నిరాడంబరతను చాటుకుని అందరినీ ఆశ్చర్యపరిచాడు. ప్రస్తుతం తాను నటిస్తున్న 'ధర్మన్' చిత్ర షూటింగ్ నిమిత్తం మైసూర్‌లో ఉన్న ఆయన, సెట్‌కు ఏకంగా ఆటో రిక్షాలో చేరుకున్నాడు. ఈ అనూహ్య దృశ్యాన్ని చూసి అక్కడున్న అభిమానులు, చిత్ర బృందం ఒక్కసారిగా ఆశ్చర్యానికి లోనయ్యారు. దీనికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

మైసూర్‌లో జరుగుతున్న 'ధర్మన్' సినిమా షూటింగ్ లొకేషన్‌కు రజనీకాంత్ ఆటోలో రావడం విశేషం. మెరూన్ రంగు చొక్కా, పంచె కట్టుకుని ఆటో దిగిన ఆయన, తన కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు వినమ్రంగా చేతులు జోడించి నమస్కరించాడు. అందరికీ అభివాదం చేస్తూ సెట్‌లోకి వెళ్లాడు. గేటు మూసివేస్తున్న సమయంలోనూ, బయట 'తలైవా' అంటూ నినాదాలు చేస్తున్న అభిమానుల కోసం ఆయన మరోసారి బయటకు వచ్చి వారిని పలకరించడం అందరినీ ఆకట్టుకుంది. అశ్వత్ మరిముత్తు దర్శకత్వంలో 'ధర్మన్' చిత్రం రూపొందుతోంది. కమల్ హాసన్‌కు చెందిన రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, టర్మరిక్ మీడియా సంస్థలు సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ఇందులో రజనీకాంత్ వైద్యుడి పాత్రలో నటిస్తుండగా, సిమ్రాన్, రాశీ ఖన్నా, యోగి బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# పాతపేటలో రూ.23 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం

**సీసీ రోడ్డు, డ్రెయిన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే కోట్ల భూమిపూజ**



డోన్ : నందిపత్రిక సెప్టెంబర్ 30: డోన్ పట్టణంలోని పాతపేట ప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. రూ.23 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రెయిన్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా డోన్ పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయిన్లు, పారిశుధ్యం తదితర సమస్యలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.పాతపేటలో సీసీ రోడ్డు నిర్మాణంతో స్థానికులకు రాకపోకలు సులభతరం అవుతాయని, డ్రెయిన్ల నిర్మాణంతో మురుగునీటి సమస్యకు పరిష్కారం లభించి పారిశుధ్య పరిస్థితులు మెరుగుపడతాయని అన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అభివృద్ధి పనులు పూర్తయితే పాతపేట ప్రజలకు రవాణా, పారిశుధ్య పరంగా మరింత సౌకర్యం కలగనుంది.ఈ కార్యక్రమంలో కేశన్న గౌడ్, ఫణిరాజ్, లక్కసాగరం లక్ష్మి రెడ్డి, హరికిషన్, రాఘవేంద్ర గౌడ్,స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# కోట్ల సుజాతమ్మను మర్యాదపూర్వకంగా కలిసిన ఐటీడీపీ నేతలు



డోన్ : నంది పత్రిక సెప్టెంబర్ 30: నంద్యాల జిల్లా ఐటీడీపీ అధ్యక్షుడు డి.ఎన్. బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు బాబా ఫక్రుద్దీన్ బుధవారం డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డిని, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పలు అంశాలపై చర్చించారు. మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో తెలుగుదేశం పార్టీ సోషల్ మీడియా విభాగమైన ఐటీడీపీ కీలకంగా పనిచేస్తోందని ప్రశంసించారు. ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేయడంలో సోషల్ మీడియా కార్యకర్తల పాత్ర ముఖ్యమన్నారు. పార్టీ కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కాదిర్, డోన్ నియోజకవర్గ అధ్యక్షుడు భాష, డోన్ మండల అధ్యక్షుడు మిద్దెపల్లె రవి, ఉపాధ్యక్షుడు బొంతిరాళ్ల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు

# స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయానికి కలిసికట్టుగా శ్రమిద్దాం

**వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పిలుపు**



డోన్ : నందిపత్రిక సెప్టెంబర్ 30: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని మాజీ మంత్రి, డోన్ మాజీ ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం డోన్ పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 3, 4, 7, 10వ వార్డుల ఇన్‌చార్జుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బుగ్గన మాట్లాడుతూ పార్టీ శ్రేణులు ఐక్యంగా ఉండి క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి వార్డులో పార్టీ కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యకర్తలకు గుర్తింపు కార్డుల పంపిణీ అనంతరం వార్డుల వారీగా పార్టీ పరిస్థితి, స్థానిక సమస్యలు, ఎన్నికల సన్నద్ధతపై నాయకులతో చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలకు టీడీపీ శ్రేణులు సమాయత్తం

**డోన్‌లో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఏపీ సీడ్స్ చైర్మన్ సుబ్బారెడ్డి సమావేశం**

డోన్ : నంది పత్రిక సెప్టెంబర్ 30 స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో డోన్ పట్టణంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి సమావేశమయ్యారు. బుధవారం ఆయన కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పార్టీ శ్రేణుల సన్నద్ధత, క్షేత్రస్థాయిలో సమన్వయం, నాయకులుకార్యకర్తల భాగస్వామ్యం తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ గ్రామ, మండల స్థాయిలో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరంపై సమావేశంలో చర్చించారు. స్థానికంగా పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, నాయకులు కార్యకర్తల మధ్య సమన్వయం వంటి అంశాలపై సుబ్బారెడ్డి నాయకులకు సూచనలు చేసినట్లు తెలిసింది. ఈ సమావేశంలో సీనియర్ టీడీపీ నాయకులు చాటకొండ శ్రీనివాసులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బెస్తా కార్పొరేషన్ డైరెక్టర్ ప్రజావైద్యశాల బెస్తా మల్లికార్జున, అడ్వకేట్ ఆలా మల్లికార్జునరెడ్డి, అడ్వకేట్ మధుసూదన్ గౌడ్, యాపదిన్నె రామిరెడ్డి, సర్దార్ పాషా, చక్రపాణి గౌడ్, సిటీ కేబుల్ కిరణ్, హనుమంతరెడ్డి, చిన్నకాంత్, నీలం ప్రభాకర్, హరిప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌లో కడప రైతులు పెద్దఎత్తున భాగస్వాములు కావాలి..!





## రాయలసీమ రైజింగ్‌కు రైతులే కీలకం.. మంత్రి సవిత పిలుపు

## పులివెందులలో ట్రాక్టర్ ర్యాలీ ప్రారంభించిన మంత్రి సవిత, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

**పులివెందుల, బ్యూరో చీఫ్ సెప్టెంబరు 30నంది పత్రిక** రాయలసీమను ప్రపంచస్థాయి ఉద్యాన పంటల కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న "రాయలసీమ రైజింగ్‌గ్లోబల్ హార్టికల్చర్ హబ్" కార్యక్రమంలో వైఎస్ఆర్ కడప జిల్లా రైతులు పెద్దఎత్తున భాగస్వాములు కావాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్. సవిత పిలుపునిచ్చారు. ఉద్యాన పంటల ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్టోబర్ 2న అన్నమయ్య జిల్లా మదనపల్లెలో రాయలసీమ రైజింగ్‌గ్లోబల్ హార్టికల్చర్ హబ్" కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో ముందస్తు ప్రచార కార్యక్రమాల్లో భాగంగా.. బుధవారం పులివెందులలో నిర్వహించిన భారీ ట్రాక్టర్ ర్యాలీని మంత్రి సవిత, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోకలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ.. రాయలసీమలో ఉద్యాన పంటలకు ఉన్న అపార అవకాశాలను సద్వినియోగం చేసుకుని రైతులు అధిక ఆదాయం పొందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఆధునిక సాగు పద్ధతులు, మెరుగైన మార్కెటింగ్, పంట అనంతర నిర్వహణ, శీతల గిడ్డంగులు, విలువ ఆధారిత ఉత్పత్తులు, ఎగుమతులకు అవకాశాలను పెంచడం ద్వారా ఉద్యాన రంగాన్ని మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో రైతుల భాగస్వామ్యం అత్యంత కీలకమని తెలిపారు. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.. గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కార్యక్రమంలో వైఎస్ఆర్ కడప జిల్లా నుంచి విస్తృత భాగస్వామ్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 30 ఉద్యానవన క్లస్టర్ల నుంచి సుమారు 3,000 మంది రైతులు అక్టోబర్ 2న మదనపల్లెలో జరిగే కార్యక్రమానికి హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి క్లస్టర్‌కు రెండు బస్సుల చొప్పున ఏర్పాటు చేసి రైతులను సురక్షితంగా మదనపల్లెకు తీసుకెళ్లి తిరిగి స్వస్థలాలకు చేర్చేలా అధికారులు సమన్వయంతో చర్యలు చేపడుతున్నారని తెలిపారు. రైతులకు తాగునీరు, ఆహారం, ఇతర మౌలిక సదుపాయాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 2న మదనపల్లెలో ముఖ్యమంత్రి పాల్గొనే గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రారంభ కార్యక్రమానికి జిల్లా నుంచి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని ఉద్యానవన క్లస్టర్ల రైతులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు.

రైతుల్లో అవగాహన, ఉత్సాహం పెంచేందుకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పెద్ద సంఖ్యలో ట్రాక్టర్లతో ర్యాలీలు నిర్వహించాలని, స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కార్యక్రమం ప్రాధాన్యతను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సామాజిక మాధ్యమాలు, పత్రికలు, ఎలక్ట్రానిక్ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని.. రాయలసీమను ప్రపంచ ఉద్యాన పంటల కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యానికి మద్దతు తెలిపారు. ఉద్యాన పంటల సాగు, మార్కెట్ అవకాశాలు, ఆధునిక సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పులివెందుల ఆర్డీవో చిన్నయ్య, ఉద్యానవన, వ్యవసాయ, ఏపీఎంఐపీ, గ్రామీణాభివృద్ధి తదితర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# చెన్నై నుండి తిరుపతికి క్యాన్సర్ బాధితుడు కార్తీక్

### రక్తం కావాలంటున్న వైద్యులు






**బండి ఆత్మకూరు నంది పత్రిక సెప్టెంబర్ 30**: బ్లడ్ క్యాన్సర్ వ్యాధితో చెన్నై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బండి ఆత్మకూరు మండలం చిన్నదేవలాపురం గ్రామానికి చెందిన అడ్డాకుల కార్తీక్ తిరుపతి ఆసుపత్రిలో చేరాడు. గత ఐదు రోజులుగా చెన్నై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్తీక్ కు రక్త కణాల సంఖ్య తగ్గిపోవడం జరుగుతూ ఉంది. చెన్నై ప్రాంతంలో కార్తీక్ అవసరమయ్యే రక్తం అందుబాటులో లేకపోవడంతో అక్కడి వైద్యులు తిరుపతికి వెళ్ళమని సూచించారు. మంగళవారం రాత్రి చెన్నై నుండి డిశ్చార్జి అయిన కార్తీక్ ను తీసుకొని తండ్రి రామయ్య రాత్రి శ్రీ వెంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ ఆసుపత్రిలో చేరాడు. కార్తీక్ ను పరీక్షించిన వైద్యులు, రక్త కణాలు పెరగాలంటే రక్తం బాగా అవసరం ఉంటుందని, బయట వ్యక్తులను ఎవరినైనా తీసుకొని వచ్చి రక్తం ఎక్కించుకోవాల్సి ఉంటుందని సూచించినట్లుగా తెలుస్తోంది. దీంతో దాతల నుండి రక్తం సేకరించేందుకు కార్తీక్ తండ్రి రామయ్య తిరుపతిలో బుధవారం సాయంత్రం రోడ్లు పట్టుకొని తిరుగుతున్నాడు. కార్తీక్ ఆరోగ్య విషయంలో మానవతా దృక్పథంతో ఆదుకుంటున్న బండి ఆత్మకూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కామర్స్ లెక్చరర్ ప్రసాద్ ఈ విషయంపై కూడా స్పందించారు. తిరుపతిలో తనకు పరిచయం ఉన్న సన్నిహితులతో చ రవాణిలో సంప్రదించారు. కార్తీక్ ఆరోగ్య పరిస్థితి వారికి వివరించి దాతలు ఎవరైనా రక్తదానం చేసేందుకు సహాయం చేయాలని అర్థించారు. ఈ విషయంపై కొందరు దాతలు రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చినట్లుగా తెలుస్తోంది. మానవతా విలువలు నశిస్తున్న ఈ సమయాల్లో కార్తీక్ ఆరోగ్య పరిస్థితి విషయంలో వారి కుటుంబానికి సహకరిస్తున్న లెక్చరర్ ప్రసాదును అభినందించి తీరాల్సిందే. కార్తీక్ అనారోగ్య పరిస్థితి నుండి కో లుకునేందుకు దాతలు ఆర్థిక సహాయాన్ని అందజేస్తూనే ఉన్నారు. బండి ఆత్మకూర్ ప్రభుత్వ కళాశాలలో పనిచేస్తున్న మరో లెక్చరర్ శివరామకృష్ణ చారి తిరుపతిలో తమ సంబంధీకులతో మాట్లాడి కార్తీక్ కు బి పాజిటివ్ రక్తాన్ని అందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

# ఘనంగా సేవ సేతు అభియాన్ కార్యక్రమం



**నంద్యాల ప్రతినిధి. సెప్టెంబర్ 30. (నంది పత్రిక )**:నంద్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని మాత శిశు సంరక్షణ వార్డులోని కాన్ఫరెన్స్ హాల్ నందు ప్రధానమంత్రి జన్మదిన పురస్కరించుకొని చేస్తున్న సేవా కార్యక్రమాలలో భాగంగా బుధవారం నంద్యాల రెడ్ క్రాస్ జన ఔషధీ ఆధ్వర్యంలో సేవా సేతు అభియాన్‌లి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ హాస్పిటల్ ఇన్చార్జి సూపరిండెంట్ డాక్టర్ చిట్టిబాబు ముఖ్య అతిథులుగా హాజరవ్వగా రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల, జిల్లా కమిటీ సభ్యులు ఉస్మాన్ భాష ఫార్మసిస్టు ఇంద్రజ హాస్పిటల్స్ సిబ్బంది, పేషంట్ అటెండెన్స్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూపర్డెంట్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేద ప్రజలకు తక్కువ ధరలకు మందులు అందించాలని లక్ష్యంతో జన ఔషధీ మెడికల్ షాపులను ప్రారంభించారని దీని ద్వారా మార్కెట్ ధర కంటే దాదాపు 50 నుంచి 70% తక్కువకి మందులు అత్యంత క్వాలిటీతో లభించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా నిరుపేద రోగులకు దాదాపు 3 వేల రూపాయల విలువైన జన ఔషధి మందులను ఉచితంగా పంపిణీ చేయడంతో పాటుగా ప్రతి ఒక్కరికి పండ్లు బిస్కెట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ డిఎఫ్ఓ అబ్దుల్లా, ఆసుపత్రి పాల్గొన్నారు.



# జంప్ రోప్ పోటీల్లో శ్రీ శాంతినికేతన్ విద్యార్థుల సత్తా

### బంగారు, వెండి పతకాలతో మెరిసిన విద్యార్థులు

### జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



**నంద్యాల సిటీ బ్యూరో సెప్టెంబర్ 30 ( నంది పత్రిక )** శ్రీ శాంతినికేతన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్, క్రాంతినగర్, నంద్యాల విద్యార్థులు జంప్ రోప్ క్రీడలో అద్భుత ప్రతిభ కనబరిచి పలు బంగారు, వెండి పతకాలు సాధించారు. ఇటీవల జరిగిన 8వ సబ్-జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జంప్ రోప్ ఛాంపియన్‌షిప్ ఏపీ 2026 పోటీల్లో శ్రీ శాంతినికేతన్ స్టేట్ బోర్డ్ మరియు శ్రీ శాంతినికేతన్ సి.బి.ఎస్. పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని విశేష ప్రతిభను ప్రదర్శించారు.ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జాతీయ స్థాయి జంప్ రోప్ పోటీలకు ఎంపికయ్యారు. జాతీయ స్థాయి పోటీలు నాందేడ్, మహారాష్ట్రలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దీంతో విద్యార్థులు తదుపరి స్థాయిలో తమ ప్రతిభను చాటుకునే అవకాశం దక్కించుకున్నారు.పతకాలు సాధించిన విద్యార్థులు

శ్రీ శాంతినికేతన్ స్టేట్ బోర్డ్:
హేమ వరుణ్ 9వ తరగతి: ఖ-12 సైక్లింగ్ + బంగారు పతకం
ఈ. చరణ్ 8వ తరగతి: ఖ-12 ౽౼ + బంగారు పతకం
వెంకట చరణ్ 7వ తరగతి: ఖ-12 డబుల్ అండర్ ఎ వెండి పతకం
అక్ష 9వ తరగతి: ఖ-12 ౽౼ + బంగారు పతకం
సందీప్ 8వ తరగతి: ఖ-12 ౽౼ + బంగారు పతకం
జస్వంత్ 7వ తరగతి: ఖ-12 ౽౼ + బంగారు పతకం
సంతోష్ 7వ తరగతి: ఖ-12 డబుల్ అండర్ + బంగారు పతకం

శ్రీ శాంతినికేతన్ జదీూజు స్కూల్:
గురు తరుణ్ 9వ తరగతి: ఖ-12 సైక్లింగ్ + బంగారు, ఎ వెండి పతకాలు
సంతోష్ 9వ తరగతి: ఖ-12 సైక్లింగ్ + బంగారు పతకం
విష్ణు 9వ తరగతి: ఖ-12 సైక్లింగ్ మరియు ౽౼ + బంగారు, ఎ వెండి పతకాలు

విద్యార్థులు సాధించిన ఈ విజయాల పట్ల శ్రీ శాంతినికేతన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ సుధాకర్ హర్షం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందిస్తూ, ఇదే స్ఫూర్తితో మరింత కష్టపడి జాతీయ స్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.అలాగే విద్యార్థులకు శిక్షణ అందించి, పోటీలకు సిద్ధం చేసిన పి.ఈ.టి.ల సేవలను చైర్మన్ సుధాకర్ అభినందించారు. విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీయడంలో పి.ఈ.టి.లు చేస్తున్న కృషిని ప్రశంసించారు. విద్యార్థుల ఈ విజయంతో పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు తీర్చిదిద్దుతున్న శ్రీ శాంతినికేతన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌కు ఈ విజయం మరో మైలురాయిగా నిలిచింది.

## బేతంచెర్ల నగర పంచాయతీ సాధారణ కౌన్సిల్ సమావేశం.



**బేతంచెర్ల,సెప్టెంబర్30(నందిపత్రిక).** బేతంచెర్ల నగర పంచాయతీ కార్యాల యంలో,నగర పంచాయితీ కమీషనర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో చైర్ పర్సన్ శ్రీ సి.హెచ్.(శేషా)చలం రెడ్డి అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశంలిబుధవారం నిర్వహించారు.ఈ సమమా వేశంలో నగర పంచాయతీ పరిధిలోని పలు అభివృద్ధి పనులు, ప్రజలకు సంబంధించిన సమస్యలు, పరిపాలనా అంశాలు తదితర విషయాలపై కౌన్సిల్ సభ్యులుతో, అధికారులతో చర్చించారు. పట్టణ అభివృద్ధి,ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం,పారిశుధ్యం తదితర అంశాలపై సమావేశంలో చర్చించి అవసరమైన చర్యలు చేపట్టేందుకు నిర్ణయాలు తీసుకున్నారు.సమావేశంలో నగర పంచాయతీ వైస్ చైర్ పర్సన్ లు కౌన్సిల్ సభ్యులు కో ఆప్షన్ సభ్యులు నగర పంచాయతీ అధికారులు తదితరులు హాజరయ్యారు.

# దంపతుల ఆత్మహత్యలకు కారణం అనారోగ్య కారణాలే!

**బండి ఆత్మకూరు నంది పత్రిక సెప్టెంబర్ 30:** అనారోగ్య కారణాల కారణంగానే ఇరువురు భార్యాభర్తలు ఆత్మహత్యలు చేసుకునేందుకు పరిస్థితులు దారి తీశాయని తెలుస్తోంది. బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఈర్ణ పాడు గ్రామంలో భార్యాభర్తల అయిన ఉప్పరి గోపాల్,రమణమ్మ మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్యలకు పాల్పడిన ఉదంతం గ్రామస్తులను కలచివేస్తుంది. గోపాల్ భార్య రమణమ్మ చాలా కాలం నుండి అనారోగ్యంతో బాధపడుతూ ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇంట్లో ఎవరు దిక్కు లేకపోవడంతో భర్త గోపాల్ ఆమెకు అన్ని తానే సేవలు చేస్తూ వస్తున్నాడు. భార్య ఆరోగ్యం విషయంలో ఎలాంటి ఎదుగుదల లేకపోవడంతో గోపాల్ మానసికంగా కృంగిపోతూ ఉండేవాడని తెలుస్తోంది. ఈ విషయంపై గోపాల్ జీవితంపై విరక్తి చెంది మానసికంగా కృంగిపోయి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకొని ఉంటాడని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. అయితే తాను చనిపోతే తన భార్యకు ఎవరు దిక్కు లేకుండా పోతారని గోపాల్ గ్రహించినట్లుగా తెలుస్తోంది. తనతో పాటు తన భార్యను కూడా తీసుకొని వెళ్లాలని గోపాల్ నిర్ణయించుకున్నట్లుగా భావించి ఉంటాడని ప్రజలు అనుకుంటున్నారు. ముందుగా తన భార్యకు ఉరివేసి, తాను కూడా ఆత్మహత్య చేసుకుని ఉంటాడని గ్రామంలో చర్చ జరుగుతూ ఉంది. ఈ సంఘటన మంగళవారం ఉదయమే జరిగి ఉంటుందని, సన్నిహితులు కొందరు దంపతుల ఇల్లు వాకిలి వేసి ఉండటంతో సాయంత్రం వాకిలి తెరవడంతో ఇరువురు ఉరివేసుకొని మరణించారు అన్న దృశ్యం కంటబడింది. మంగళవారం రాత్రి ఈ సంఘటన వెలుగులోకి రావడంతో పోలీసులు హుటా హుటిన ఈర్ణ పాడు గ్రామానికి చేరుకున్నారు. శవాలను పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బుధవారం పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం భార్యాభర్తల మృతదేహాలను ఈర్నపాడు గ్రామానికి తరలించారు. దంపతులకు శివకుమార్ ఒకడే కొడుకు కాగా, ఢిల్లీలో మిలిటరీ లో పనిచేస్తున్నాడని తెలుస్తోంది. భార్యాభర్తలు అనారోగ్యాల కారణంగానే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొని ఉంటారని కొడుకు శివకుమార్ ఫిర్యాదు చేశాడని ఎస్సై జగన్మోహన్ పేర్కొన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి




**నంద్యాల ప్రతినిధి. సెప్టెంబర్ 30. (నంది పత్రిక )**:ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని,ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నిర్లక్ష్యం చేస్తే సీఎం క్యాంప్ కార్యాలయం ముట్టడిస్తాం మని అన్నారు.ఈ సందర్భంగా టియూసిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి టి తిరుపాలు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆటో కార్మికులకు ఇచ్చిన హామీ ఆటో కార్మికులకు పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యంతో కూడిన సమగ్ర సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని అలాగే ఆటో కార్మికులకు గుదిబండగా మారిన జీవో నెంబర్ 21,31ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు, 60 సంవత్సరాలు దాటిన ప్రతి ఆటో కార్మికునికి పదివేల రూపాయల పెన్షన్ ఏర్పాటు చేయాలి, శ్రీ శక్తి పథకం వల్ల ఆదాయం కోల్పోయిన డ్రైవర్లకు నెలకు పదివేల రూపాయలు భృతి ఇవ్వాలి,డ్రైవర్ల సహజ మరణానికి ఐదు లక్షలు ప్రమాదంలో చనిపోతే 10 లక్షలు ఉచిత ఇన్సూరెన్స్ పాలసీ వెంటనే అమలు చేయాలి, హెవీ వెహికల్ డ్రైవర్లకు నెలకు 36000 కనీస వేతనం అమలు చేయాలి,కార్లు జీపులు పై భారీగా పెంచిన రోడ్ టాక్స్,టోల్ ప్లాజా ఫీజు, గ్రీన్ టాక్స్,లేబర్ టాక్స్ 30% తగ్గించి రవాణా రంగాన్ని కాపాడాలి, ఓలా,ఉబర్ రాఫీడో,ప్రైవేటు సంస్థలకు ఇచ్చినా అనుమతులను రద్దు చేసి ప్రభుత్వ యాప్ అమలు చేయాలి, అన్ని జిల్లాలలో బస్టాండు రైల్వేస్టేషన్లో ముఖ్యమైన జంక్షన్ లలో ఆటోలు ఇతర వాహనాలకు స్టాండ్ లు పార్కింగ్ స్థలాలు ఇవ్వాలి,2023 నూతన మోటార్ చట్టంలో ఉన్న సంవత్సరాల తరబడి జైలు శిక్షలు,లక్షల రూపాయలు జరిమానాలు వేసే సెక్షన్లు రద్దు చేయాలి,డ్రైవర్ కుటుంబ సభ్యులకు ప్రభుత్వమే ఉచితంగా వైద్యం విద్య అందించాలి, ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీలకు ఎస్సీ బీసీ మైనారిటీ కార్పొరేషన్ లో ఇచ్చిన లోన్లు కట్టాలని నోటీసులు ఇచ్చిన వాటిని వెనక్కి తీసుకోవాలి, ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు వెంటనే విడుదల చేయాలి డ్రైవర్లకు గుర్తింపు గౌరవం సామాజిక భద్రత కల్పించాలి దేశం రాష్ట్రం అభివృద్ధి కోసం నిరంతరం ప్రజలకు సేవలు అందిస్తూ ప్రభుత్వానికి ఆదాయం ఇస్తున్న డ్రైవర్లకు న్యాయం చేయాలి వాహనాలకు ఫిట్నెస్ సర్టిఫికెట్ ప్రైవేటు సంస్థలను రద్దుచేసి యధావిధిగా ప్రభుత్వమే కొనసాగించాలి అని చంద్రబాబు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమస్యలన్నీ పరిష్కారం చేయకపోతే అవసరమైతే భవిష్యత్తులో సీఎం క్యాంప్ క్యారాల్యాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

# కలెక్టర్ దినేష్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ కె. చక్రవర్తి



**పోలవరం, సెప్టెంబర్ 29:** పోలవరం జిల్లా నూతన ఎస్పీ కె. చక్రవర్తి, ఐపీఎస్, జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఐఏఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, పోలీస్ శాఖ మౌలిక వసతుల అభివృద్ధి, సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం తదితర అంశాలపై ఇరువురు చర్చించారు. **ప్రసాద్ నాయుడు రియల్ హీరో మ్యాగ్జైన్ ఏపీ కరస్పాండెంట్**

# గంగవరం పోలీస్ స్టేషన్ పరిధిలో పోలింగ్ బూత్‌ను పరిశీలించిన ఎస్పీ చక్రవర్తి



పోలవరం జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన కే. చక్రవర్తి, ఐపీఎస్., ఈరోజు గంగవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలింగ్ బూత్‌ను పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులతో ముచ్చటించి, వారికి ఆటల సామగ్రిని అందజేశారు. ప్రసాద్ నాయుడు రియల్ హీరో మ్యాగ్జైన్ ఏపీ కరస్పాండెంట్

# అంగనవాడి కేంద్రాలే చిన్నారుల బంగారు భవిష్యత్తుకు పునాదులు

**జూపాడు బంగ్లా సెప్టెంబర్ 30: (నంది పత్రిక )** అంగన్వాడి కేంద్రాలే చిన్నారుల బంగారు భవిష్యత్తుకు పునాదులని అంగన్వాడి టీచర్ లక్ష్మీ ప్రసన్న, రామ తులసమ్మ తెలిపారు. తరిగొపుల గ్రామంలోని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకొని, ప్రజాసేవలో ఆయన 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం తరిగోపుల గ్రామంలో అంగన్వాడీ సెంటర్-2,3 లో ఐ సి డి ఎస్ ఆధ్వర్యంలో సేవా సంకల్ప అభియాన్ - అంగన్వాడి ఉత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 7 వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ సందర్భంగా గ్రామ ఏఎన్ఎం మహేశ్వరి,ఎం ఎల్ హెచ్ పి ప్రభావతి, మహిళా పోలీస్ పుష్పలత మాట్లాడుతూ గర్భంలో బిడ్డ పడిన నాటి నుంచి ఐదేళ్లు వయసు వచ్చేవరకు తల్లులు చిన్నారుల గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఆకుకూరలు, కూరగాయలు, గింజ ధాన్యాలు, మిల్లెట్స్, పాలకూర, గోంగూర వంటి ఐరన్ ఎక్కువగా ఉన్న ఆకుకూరలు, సజ్జలు, జొన్నలు, పెసలు ప్రతి ఒక్కరూ తీసుకోవాలని... వీటిని వాడడం ద్వారా షుగర్, బీపీ రాదని తెలిపారు.అంగన్వాడీ టీచర్లు లక్ష్మీ ప్రసన్న, రామ తులసమ్మ మాట్లాడుతూగర్భవతులు, బాలింతలు క్రమం తప్పకుండా అంగన్వాడీ సెంటర్లో ఇచ్చే పౌష్టికాహారం తీసుకోవాలని, ఆరు నెలల తర్వాత చిన్నారులకు తల్లిపాలతో పాటు సంపూర్ణ పౌష్టికాహారం కచ్చితంగా తీసుకోవాలని సూచించారు. మన అంగన్వాడి.. మన బాధ్యత.. మన పిల్లల ఆరోగ్యం... మన అందరి బాధ్యత అనే సందేశం ప్రతి కుటుంబం అంగన్వాడి కేంద్రాల సేవలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు గర్భవతుల అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



## ఎన్జీఓల బద్వేల్ తాలూకా నూతన అధ్యక్షుడిగా ఆర్. అమరనాథ్ రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక





**బద్వేల్, సెప్టెంబర్ 30 ( నంది పత్రిక):**కడప జిల్లా అమరావతి ఉద్యోగుల ఐక్యవేదిక, ఏపీ ఎన్జీఓల సంఘం జిల్లా అధ్యక్షులు, జేఏసీ చైర్మన్ బలపనూరు శ్రీనివాసులు అధ్యక్షతన బద్వేల్‌లో బుధవారం సంఘ కార్యవర్గ సమావేశం, పదవీ విరమణ సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బద్వేల్ తాలూకా అధ్యక్షులు, జేఏసీ చైర్మన్ టి. నరసింహారెడ్డి సెప్టెంబర్ 30న పదవీ విరమణ పొందిన సందర్భంగా, సంఘ నాయకులు ఆయనను దుశ్శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన సంఘానికి అందించిన విశేష సేవలను, ఉద్యోగుల సంక్షేమానికి, సంఘ అభివృద్ధికి పడిన శ్రమను నాయకులు కొనియాడారు.

**నూతన కార్యవర్గ నియామకాలు:** టి. నరసింహారెడ్డి పదవీ విరమణ అనంతరం, ఎన్నికల సలహాదారుగా వ్యవహరించిన జిల్లా కోశాధికారి టి. శ్రీనివాసులు నేతృత్వంలో బద్వేల్ తాలూకా నూతన అధ్యక్షుడిగా, జేఏసీ చైర్మన్‌గా ఆర్. అమరనాథ్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

**అలాగే ఇతర నూతన బాధ్యతల నియామకాలు ఇలా ఉన్నాయి:**ఉపాధ్యక్షులు (వైస్ ప్రెసిడెంట్లు): పి. మధుసూధన రెడ్డి, టి.ఎన్.ఎస్. కృష్ణ శర్మ, మహిళా విభాగం నుంచి లక్ష్మీనరసమ్మసహ కార్యదర్శులు (జాయింట్ సెక్రటరీలు): కే. వెంకటేశ్వర్లు, ఓ. శారదమ్మ, చంద్రకళ

**కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు:** ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు రాజేష్ కుమార్, మురళీకృష్ణ, శ్రీనివాసులు, శరత్ చంద్ర, యుటీఎఫ్ నాయకులు మాదన విజయకుమార్, ఓబుల్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుల సంఘ అధ్యక్షులు జీ. వి. సుబ్బారెడ్డి, హెడ్ మాస్టర్ శేషాద్రి, జిల్లా సహ కార్యదర్శి డి. పద్మనాభం, పి. శైలేశ్వర రెడ్డి, గౌరవ అధ్యక్షులు సాధు వెంకటేశ్వర్లు, కార్యదర్శి వి. శివరామి రెడ్డి, కోశాధికారి కే. రమణ, ఎమ్. శ్రీనివాసరెడ్డిలతో పాటు మహిళా ఉద్యోగులు, మిత్రులు మరియు బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## పదవీ విరమణ సందర్భంగా ఏపీఎన్జీవోస్ అధ్యక్షుడు టి. నరసింహారెడ్డికి ఘన సన్మానం



**బద్వేల్, సెప్టెంబర్ 30: (నంది పత్రిక):**బద్వేల్ తాలూకా ఏపీఎన్జీవోస్ అధ్యక్షులు, జేఏసీ చైర్మన్ టి. నరసింహారెడ్డి పదవీ విరమణ సందర్భంగా బుధవారం ఘనంగా సన్మానించారు. కడప జిల్లా ఏపీఎన్జీవోస్ అధ్యక్షులు, జేఏసీ చైర్మన్ బలపనూరు శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో టి. నరసింహారెడ్డిని దుశ్శాలువాతో సత్కరించి, పూలమాలతో అభినందించారు.టి. నరసింహారెడ్డి పదవీ విరమణ అనంతరం బద్వేల్ తాలూకా ఏపీఎన్జీవోస్ సంఘం నూతన బాధ్యతల్లో భాగంగా ఎన్నికల అడ్వైజర్‌గా జిల్లా ట్రెజరర్ టి. శ్రీనివాసులు వ్యవహరించగా, ఆర్. అమరనాథరెడ్డిని బద్వేల్ తాలూకా అధ్యక్షులు, జేఏసీ చైర్మన్‌గా నియమించారు.అదేవిధంగా జాయింట్ సెక్రటరీలుగా ఉన్న పి. మధుసూదన్‌రెడ్డి, టి.ఎన్.ఎస్. కృష్ణశర్మలను వైస్ ప్రెసిడెంట్లుగా, మహిళా విభాగం నుంచి లక్ష్మి నరసమ్మను ఎంపిక చేశారు. ఖాళీ అయిన జాయింట్ సెక్రటరీ పదవులకు కె. వెంకటేశ్వర్లు, శ్రీమతి ఓ. శారదమ్మ, చంద్రకళలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ టి. నరసింహారెడ్డి ఏపీఎన్జీవోస్ సంఘానికి అందించిన సేవలను కొనియాడారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, సంఘ అభివృద్ధికి ఆయన చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు రాజేష్ కుమార్, మురళీకృష్ణ, శ్రీనివాసులు, చరత్ చంద్ర, యూటీఎఫ్ నాయకులు మాధన విజయకుమార్, ఓబుల్ రెడ్డి, హెడ్‌మాస్టర్స్ సంఘ అధ్యక్షులు జి.వి. సుబ్బారెడ్డి, హెడ్‌మాస్టర్ శేషాద్రి, జిల్లా జాయింట్ సెక్రటరీ డి. పద్మనాభం, పి. శైలేశ్వరరెడ్డి, మహిళా ఉద్యోగుల అధ్యక్షులు సాధు వెంకటేశ్వర్లు, సెక్రటరీ వి. శివరామిరెడ్డి, ట్రెజరర్ కె. రమణ, ఎం. శ్రీనివాసరెడ్డితో పాటు బంధువులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



## ఇనిస్ట్యూట్ ఫర్ ఇనిస్ట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్మెంట్ ,,,

### ఆశిర్వాద్ స్మార్ట్ ఇండియా ప్రాజెక్ట్ భాగంగా ఐటిసి వారి




**ఎమ్మిగనూరు నంది పత్రిక సెప్టెంబర్ 30** ఎమ్మిగనూర్ నియోజ వర్గంలో గవర్నమెంట్ జూనియర్ గర్ల్స్ కాలేజ్ నందు అయోడిన్ లోపాల వల్ల కలిగే ఆరోగ్య సమస్యల థైరాయిడ్ పైన సూక్ష్మ పోషక ఆహారం పైన అవగాహన కార్యక్రమం నాటక రూపంలో నిర్వహించడం జరిగింది ఇనిస్ట్యూట్ ఫర్ గూగుల్ డెవలప్మెంట్ వారి సహకారంతో కర్నూల్ జిల్లా డిస్టిక్ కోఆర్డినేటర్ వేణుగోపాల్ సూచనల మేరకు అయోడిన్ లోపిస్తేలోపం ఎక్కువకాలం ఉంటే థైరాయిడ్ హార్మోన్లు తగ్గడం హైపోథైరాయిడిజం, మెడలో థైరాయిడ్ వాపు (గాయిటర్) వంటి సమస్యలు రావచ్చు. గర్భధారణ సమయంలో తీవ్రమైన లోపం శిశువు మెదడు అభివృద్ధిపై ప్రభావం చూపవచ్చు.

**ఎక్కువ అయోడిన్ తీసుకుంటే?** ఎక్కువైతే మంచిదే అనుకోవడం సరికాదు. అధిక అయోడిన్ కూడా కొంతమందిలో థైరాయిడ్ పనితీరును దెబ్బతీయవచ్చు. అందువల్ల డాక్టర్ సలహా లేకుండా అయోడిన్ సప్లిమెంట్లు తీసుకోవడం మంచిది కాదు.మనం తినే రోజువారి ఆహారంలో ప్రతిరోజు ఆకుకూరలు కూరగాయలు ఎక్కువగా ఉండేలా అదే రకంగా పండ్లు ప్రతిరోజు తినేలా చూసుకోవాలి తెలిపారు. ఈ ప్రోగ్రాం ని ఎమ్మిగనూరు నియోజకవర్గ వార్ డబ్ల్యూ హనుమంతు ఆరోగ్యం పట్ల జాగ్రత్త చూసుకోవాలని తెలిపారు

## ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ ల సమస్యలు పరిష్కరించాలి.



**రుద్రవరం ప్రతినిధి సెప్టెంబర్ 30 (నంది పత్రిక):** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీఓ భాగ్యలక్ష్మి కి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 19 ఏళ్లుగా పనిచేస్తున్న తమకు నెలకు కేవలం రూ. 5745 వేతనం మాత్రమే ఇస్తున్నారని, కుటుంబ పోషణ కష్టంగా మారినందున కనీస వేతనం రూ. 26,000 చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. అక్రమ తొలగింపులను అరికట్టి ఉద్యోగ భద్రత కల్పించాలని, 7500 మ్యాన్ డేస్ విధానాన్ని రద్దు చేసి 3 ఏళ్లు పూర్తి చేసుకున్న వారికి ఎఫ్.టి.ఇ వర్తింపజేయాలని కోరారు. అలాగే పెండింగ్ లో ఉన్న జూన్ నెల జీతం ఇవ్వాలని, విధి నిర్వహణలో మరణించిన లేదా అంగవైకల్యం పొందిన వారి కుటుంబాలకు రూ. 25 లక్షల ఎక్స్ గ్రేషియాతో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వీటన్నింటితో పాటు యాప్ ల వినియోగానికి కొత్త మొబైల్స్, 5జిబి సిమ్ కార్డ్స్, క్యాష్ లెస్ హెల్త్ కార్డులు, పదోన్నతులు, మండల స్థాయి బదిలీ సౌకర్యం కల్పించాలని కోరుతూ, తమ న్యాయమైన డిమాండ్లను అక్టోబర్ 5వ తేదీ లోపు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు దిగుతామని వివిధ గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రభుత్వాన్ని కోరారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలతోనే సుపోషిత భారత్





### వరికుంట్లలో ఘనంగా అంగన్‌వాడీ ఉత్సవాలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడమే బిజెపి లక్ష్యం బిజెపి మండలాధ్యక్షుడు బిజీవేముల నారాయణరెడ్డి మండల ప్రధాన కార్యదర్శి బుసిరెడ్డి ప్రశాంతి

**కాశినాయన, సెప్టెంబర్ 30:( నంది పత్రిక)**కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతోనే దేశంలో 'సుపోషిత భారత్' నిర్మాణంసాధ్యమవుతుందని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశం అన్ని రంగాల్లో ప్రగతి పథంలో దూసుకుపోతోందని వారు కొనియాడారు. ప్రధాని మోదీ సుదీర్ఘ ప్రజా ప్రస్థానం, పరిపాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్', 'పోషణ్ మాసం' వేడుకల్లో భాగంగా బుధవారం కాశినాయన మండలం వరికుంట్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రత్యేక కార్యక్రమాలు, క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహించారు. బీజేపీ కాశినాయన మండల అధ్యక్షుడు బిజీవేముల నారాయణరెడ్డి, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి బుసిరెడ్డి ప్రశాంతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వరికుంట్ల అంగన్‌వాడీ మెయిన్ కేంద్రంలో ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. తల్లీబిడ్డల సంరక్షణ, ఆరోగ్య సమాజ నిర్మాణమే ధ్యేయంగా జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శారదమ్మ, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బద్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ బుసిరెడ్డి మనోహర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉట్టి శ్రీనివాసులు, ఐసీడీఎస్ ( ఐసిడిఎస్ ) సీడీపీఓ లక్ష్మీ ముఖ్య అతిథులుగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు అందిస్తున్న గుడ్లు, పాలు, బాలామృతం కిట్లు, ఆకుకూరలు, చిరుధాన్యాల విశిష్టతను వివరించారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక పోషకాహార ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. గర్భిణులు, బాలింతలు రక్తహీనత (ఎనీమియా) బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, పిల్లలకు సకాలంలో వ్యాక్సినేషన్ వేయించాల్సిన ఆవశ్యకతపై ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'పోషణ్ అభియాన్', 'మాతృ వందన యోజన' పథకాలు గ్రామీణ పేదలకు ఎంతో మేలు చేస్తున్నాయని నేతలు పేర్కొన్నారు.అనంతరం గ్రామంలో నిస్వార్థ సేవలందిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, ఆశా కార్యకర్తలను నాయకులు, అధికారులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో (ఎ ఎం సీ) చైర్మన్ నారిశెట్టి సుప్రజ, బిజెపి జిల్లా అధ్యక్షుడు రామ సుబ్బారెడ్డి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు మునీంద్ర యాదవ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ఎదురు నాగార్జున రెడ్డి, బిజెపి మండల ఉపాధ్యక్షులు సురేష్ నాయుడు, బసిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి, పోరుమామిళ్ల మండల అధ్యక్షుడు నాగేంద్ర, ప్రతాప్ రెడ్డి, పూర్వ ఎబివిపి నాయకులు ప్రసాద్, రవిచంద్ర, గురయ్య తో పాటు గ్రామ మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పరిశుభ్రత ఆరోగ్యానికి భద్రత



**బద్వేల్, సెప్టెంబర్ 30 (నంది పత్రిక ):**పరిశుభ్రత ఆరోగ్యానికి భద్రత అని సురేంద్ర నగర్ వైద్యాధికారి శ్రీనివాసులు అన్నారు. పట్టణములోని గుంతపల్లిలో ఫీవర్, లార్వా ఇంటింటి సర్వే మరియు కాలేజీ బాయ్స్ హాస్టల్ ను వైద్య సిబ్బంది పరిశీలించడం జరిగింది. పరిసరాలను శుభ్రంగా పెట్టుకోవాలి నిల్వ ఉన్న నీటిని తొలగించాలి. దోమ పుట్టకూడదు కుట్టకూడదు దోమతెర శ్రేయస్కరమని వారికి చెప్పడం జరిగింది అనంతరం హాస్టల్లో పరిశీలించడం జరిగింది. కిచెన్ రూములు శుభ్రంగా పెట్టుకోవాలని వంట సిబ్బందికి తెలియజేయడం జరిగింది. బాత్రూం హాస్టల్ రూమ్స్ ను పరిశీలించడం జరిగింది. టిఫిన్ పులగాన్ని పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ విద్యార్థుల శుభ్రత పాటించాలన్నారు. ప్రభుత్వం ప్రజల వద్దకే వైద్యం అందుతుందన్నారు . ప్రభుత్వ ఆసుపత్రులలో మందులు సమృద్ధిగా ఉన్నాయన్నారు 108, 104 అవసరమైన చోట్ల మెడికల్ క్యాంపులను నిర్వహిస్తూ నామన్నారు. నిరంతరం వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటున్నారన్నారు . ప్రైవేట్ ఆస్పత్రులకు పోయి వేల రూపాయల ఖర్చు చేసుకోవద్దన్నారు ప్రభుత్వ ఆసుపత్రులలో కాన్పులు కావాలన్నారు ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు,వీరి జనార్దన్ రావు, క్రిస్టఫర్, వైద్య సిబ్బంది శివకుమారి, తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్ల రద్దు చేయాలి.



### -ఢిల్లీ రాజధాని ముట్టడికి కదలిరండి.

### -సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ నాగరాజు.

**బేతంచెర్ల సెప్టెంబర్ 30 (నంది పత్రిక )** కార్మిక హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్ల రద్దుకై సిఐటియు ఆధ్వర్యంలో తలపెట్టిన డిసెంబర్ 1, 2, 3 తేదీలలో దేశ రాజధాని ఢిల్లీ ముట్టడి కార్యక్రమం లో కార్మికులందరూ సంఘటితమై కదలి రావాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు వై.ఎల్లయ్య పిలుపునిచ్చారు.స్థానిక సిఐటియు ఆఫీసు నందు సిఐటియు ఆధ్వర్యంలో కార్మిక సంఘాల జనరల్ బాడీ సమావేశం నాగేంద్రమ్మ అధ్యక్షతన బుధవారం నాడు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ, దేశంలో మూడోసారి అధి కారంలోకి వచ్చిన బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్టుబడి దారులను, భూస్వాములను అభివృద్ధి చేయడానికి,కార్మికుల హక్కులను కాలరాసి కార్మికులను కట్టు బానిసలుగా మార్చడానికి, దశాబ్దాల కాలంగా కార్మికులు రక్తం ధారబోసి, ప్రాణాలు అర్పించి సాధించుకున్న, 44 కార్మిక చట్టాలను,కేవలం నాలుగు లేబర్ కోడ్లు గా మార్చడం చాలా దుర్మార్గమని అన్నారు. భారతదేశంలో పెట్టుబడిదారుల ఆస్తులను పెంచడానికి వారి కోసం నరేంద్ర మోడీ ప్రభుత్వం నిరంకుశ పరిపాలన కొనసాగిస్తుందని వారు ధ్వజమెత్తారు.సర్ పేరుతో దేశంలో దాదాపు 13 కోట్ల ఓట్లను తొలగించడం చాలా అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపికి మద్దతిస్తూ ఓట్లు వేసే వారి ప్రాంతాలలో ఓటు భద్రపరచుకొని, బిజెపికి వ్యతిరేకంగా ఏ రాష్ట్రంలో అయితే ఉన్నాయో అక్కడ ఓట్లను తొలగించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా సర్ ప్రక్రియపై దేశం ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్వర్ కుమార్ ను తొలగించాలని, దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అవుతున్నకూడా దున్నపోతు పై వర్షం పడినట్లు, నరేంద్ర మోడీ ప్రభుత్వం వ్యవహరించడం సిగ్గుచేటని వారు విమర్శించారు. రైతాంగ హక్కులను కాల రాయడానికి మూడు నల్ల చట్టాలను అమలు చేసినందుకు, జాతీయ, ప్రాంతీయ అన్ని రైతు సంఘాల ఐక్య పోరాటాల వల్ల వెనక్కి తగ్గిన నరేంద్ర మోదీ, చట్టాలను రద్దు చేసుకున్న సంగతి బిజెపి ప్రభుత్వం మరిచినట్లుందని ఆయన ఎద్దేవా చేశారు. రైతాంగ ఉద్యమ పోరాటం స్ఫూర్తితో డిసెంబర్ లో జరిగే ఢిల్లీ రాజధాని ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేసి, బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం మెడలు వంచి, కార్మిక హక్కులను కాలరాసే లేబర్ కోడ్ల చట్టాలను రద్దు చేసేంతవరకు సిద్ధ పడి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు మండల అధ్యక్షులు ఎస్. రహమతుల్లా సిఐటియు ఉపాధ్యక్షులు బి. రామాంజ నేయులు, జి. వేణుగోపాల్, రామళ్ల కోట మద్దయ్య, టి.శ్రీనివాసులు,రాజబాబు, వెంకటరమణ,టింగు, రామకృష్ణ,యూసుఫ్, నాగేంద్రమ్మ,పుష్పావతి, రమణమ్మ, సరోజమ్మ,సంధ్య, లావణ్య,మున్ని,రాధమ్మ,చిట్టి, రామలక్ష్మి, మహేశ్వరి,రాజేశ్వరి, సుజాత,వెంకటేష్ నాయక్, మద్దిలేటి స్వామి, శ్రీను తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## లింగ నిర్ధారణ చేస్తే జైలుకే

**నంద్యాల సిటీ బ్యూరో సెప్టెంబర్ 30 ( నంది పత్రిక ).** నంద్యాల జిల్లా వైద్య శాఖ పరిధిలో ప్రవేటు ఆసుపత్రులు,స్కానింగ్ కేంద్రాల్లో లింగ ధారణ పరీక్షలు నిర్వహిస్తే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలతో పాటు లైసెన్సులు రద్దు చేసి జైలుకు పంపిస్తామని జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ సరదాబాయి హెచ్చరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పీసీపీఎన్‌డీటీ డీఎల్ఎస్‌సీ కమిటీ సమావేశం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శారదాబాయి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్సులు రద్దు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ఆడబిడ్డలను రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. స్కానింగ్ కేంద్రాల్లో ధరల పట్టికలను తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. సమావేశంలో కమిటీ సభ్యులు డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ శ్రవణ్‌కుమార్, జిల్లా విస్తరణ, మాస్ మీడియా అధికారి మల్లేపల్లి పామన్న, డాక్టర్ సలీమున్నీసా బేగం, బర్డ్ ఎన్జీవో ప్రతినిధులు వినయ్‌బాబు, వంశీ పాల్గొన్నారు.



## సామాజిక వనాలను పెంచాలి.. ప్రతి ఇంటి ముందు మొక్కలు నాటాలి

**పుల్లివీడు పాఠశాలలో వనమహోత్సవం ముందస్తు వేడుకలు**



**పోరుమామిళ్ల, సెప్టెంబర్ 30 ( నంది పత్రిక):** పోరుమామిళ్ల మండలం పుల్లివీడు ప్రాథమికోన్నత పాఠశాలలో వనమహోత్సవం ముందస్తు వేడుకలను పాఠశాల హెచ్‌ఎం వి. నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా వేప చెట్టును అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హెచ్‌ఎం వి. నాగరాజు మాట్లాడుతూ చెట్లు లేనిదే మానవ జీవనం లేదని, పచ్చని చెట్లు ప్రగతికి మెట్లని అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. గ్రామాల్లో సామాజిక వనాలను పెంచేందుకు ప్రజలు, విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని కోరారు.

## చిన్నారుల భవిష్యత్తుకు పునాది అంగన్వాడి కేంద్రాలు.

**- డోన్ ఐసిడిఎస్ సిడిపిఓ శంషాద్ బేగం.**



**బేతంచెర్ల సెప్టెంబర్ 30( నందిపత్రిక ).** -మూడు సంవత్సరాల నుండి ఐదు సంవత్సరాల లోపు చిన్నారుల భవిష్యత్తుకు పునాది, అంగన్వాడి కేంద్రాలేనని డోన్ ఐసిడిఎస్ సి డి పి ఓ ఎస్ శంషాద్ బేగం అన్నారు. 9 వ జాతీయ పోషణ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా, బుధవారం మండలంలోని కొలుములపల్లె గ్రామంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రాధమ్మ, అరుణ ఆధ్వర్యంలో అంగన్వాడి ఉత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో ప్రభుత్వ ఉపాధ్యా యులు మరియు ఆర్ పి లు వెంకటేశ్వర నాయక్, నాగరాజులు మండలంలో అంగన్వాడీ కేంద్రాలలో విధులు నిర్వహిస్తున్న ఉత్తమ అంగన్వాడి టీచర్లను పూల మాలలు, శాలువాలతో సన్మానించారు.ఈ సందర్భంగా సిడిపిఓ శంషాద్ బేగం మాట్లాడుతూ మూడు సంవత్సరాల నుండి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు మరియు గర్భవతులు, బాలింతలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టిక మైన ఆహారం ను అందిస్తూ,పిల్లలకు ఆట పాటలతో విద్యను నేర్పించడమే కాకుండా, బాలింతలకు, గర్భవతులకు ఆరోగ్య విషయాలు సూచనలు సలహాలు ఇవ్వడం జరుగు తున్నదని ఆమె అన్నారు. అంగన్వాడి కేంద్రాలను ఉపయోగించుకునే వారు,వారి సేవలను గుర్తిస్తూ వారిని సన్మానించడం గర్వించదగ్గ విషయమని ఆమె కొని యాడారు.అంతేకాకుండా పట్టణం మరియు గ్రామాలలోని ప్రజలు అంగన్వాడి కేంద్రాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తూ తోడ్పాటు ఇవ్వాలని ఆమె కోరారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్స్ పోలియో,బి ఎల్ ఓ వంటి కార్యక్రమాలలో అంగన్వాడీ టీచర్లు ఎన్నో సేవలు అందిస్తున్నారని, అందుకు ప్రతి ఒక్కరు వారి సేవలను కొనియాడాలని అని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లుజెశేబారాణి,అనూష,,రమణమ్మ,మేరీ, రాధాదేవి,రామ తులసి, రాజేశ్వరి,ఆదిలక్ష్మి, శోభ సుమతి లను సన్మానించారు.మరియు గుల్జార్బి, రాధాదేవి, సంతోష మ్మ, సరస్వతి, రాజేశ్వరి,నాగరత్నమ్మ,శ్రీలత,అంజలి, సుబ్బలక్ష్మి,వరలక్ష్మి,చందన, శివలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కొక్కెరంచ పాఠశాల ముందు విద్యార్థులతో తల్లిదండ్రుల నిరసన

**- ఎన్నికలు జరిపేవరకు పిల్లలను బడికి పంపం**

**- హెచ్‌ఎం ఎంఈఓలపై చర్యలు తీసుకోవాలి.**

**- బడిలోని పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లిన తల్లిదండ్రులు**

**కొత్తపల్లి - నంది పత్రిక :** మండలంలోని కొక్కెరంచ ప్రాథమికోన్నత పాఠశాల ముందు విద్యార్థులతో తల్లిదండ్రులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు హెచ్‌ఎం పుష్పలత, మండల విద్యాధికారి కె.నాగరాజులపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీకోవాలన్నారు పాఠశాలకు వెల్లిన విద్యార్థులను తల్లిదండ్రులు వెనక్కి తీసుకొని ఇళ్ళకు వెల్లిన ఘటన చోటుచేసుకుంది. మంగళవారం మండలంలో అన్ని పాఠశాలలో ఎస్‌ఎంసీ ఎన్నికలు జరిగాయి. అందులో భాగంగానే కొక్కెరంచలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 86 మంది విద్యార్థుల తల్లిదండ్రులకు ఎన్నికలు ఏర్పాటు చేశారు. అయితే ఓ వైపు 67 మంది విద్యార్థుల. తల్లిదండ్రులు ఉన్నారు. మరోవైపు 19 మంది తల్లిదండ్రులు ఉన్నారు. వారిలో 3 ఓటింగ్ ప్రక్రియకు రాలేదు. అయితే ఓ వర్గం తక్కువగా ఉండడంతో ఎన్నిక జరపకూడదని టీడీపీ నాయకులతో ఒత్తిడితో పాఠశాల హెచ్‌ఎం పుష్పలత, ఎంఈఓ నాగరాజులు గొడవలు జరుగుతాయంటూ, ఇంటలీ జెన్సీ రిపోర్టు ఉందంటూ, గొడవలు పడితే పోలీసు బందోబస్తు లేదంటూ ఎన్నికలు వాయిదా వేయించారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నడు లేని విధంగా టీడీపీ నాయకులు పాఠశాలలోకి రాజకీయాన్ని తెచ్చి విద్యార్థుల భవిష్యత్తుతో అడుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. వీరికి తోడుగా పాఠశాల హెచ్‌ఎం, ఎంఈఓలు కూడా నిలవడం సిగ్గుచేటన్నారు. ఎన్నికలు పెట్టడడం ఇష్టంలేక. టీడీపీ నాయకులు చెప్పినట్లు వింటూ. హెచ్ ఎం పుష్పలత ఉద్దేశ్య పూర్వకంగానే విదులకు సెలవుపెట్టి ఇంటిదగ్గర ఉందని ఆరోపించారు. అయిన పాఠశాల హెచ్‌ఎంకు రాజకీయాలతో ఎంపని అని ప్రశ్నించారు. ఎన్నికలు వాయిదా పడడంతో ముఖ్యపాత్ర పాఠశాల హెచ్‌ఎం పుష్పలత, ఎంఈఓ నాగరాజుల హస్తం ఉందని ఆరోపించారు. పాఠశాలలో ఎస్‌ఎంసీ ఎన్నికలు జరపకపోతే మాపిల్లలను బడికి పంపేది లేదంటూ తల్లిదండ్రులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.




## మహానంది వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఘన విజయం:

**జాతీయ స్థాయిలో ర్యాంకులు, ఐఐటీల్లో పీహెచ్‌డీ ప్రవేశాలు**



**మహానంది,సెప్టెంబర్ 30 (నంది పత్రిక):-** మహానంది వ్యవసాయ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయి వ్యవసాయ ఉన్నత విద్యా ప్రవేశ పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరిచి కళాశాల కీర్తిని చాటారు. భారత వ్యవసాయ పరిశోధనా మండలి ఆధ్వర్యంలో జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థ నిర్వహించిన పోస్ట్ గ్రాడ్యుయేషన్ ప్రవేశ పరీక్షల్లో వివిధ కేటగిరీల్లో ఇక్కడి విద్యార్థులు మేటి ర్యాంకులు సాధించినట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ చవన్ శ్యామ్‌రాజ్ నాయక్ తెలిపారు. కీటక శాస్త్ర విభాగంలో కె. భవిత 6వ ర్యాంకు,సోషల్ సైన్స్ విభాగం: ఆర్. అమృత 8వ ర్యాంకు,

**అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం: సి. స్మిత 19వ ర్యాంకు,** మొక్కల జీవసాంకేతిక విజ్ఞాన విభాగంలో జి. భార్గవి 22వ ర్యాంకు, కె. మనోహర్ కేటగిరీలో 23వ ర్యాంకులు సాధించారు. వీరిలో కొంతమందికి జూనియర్ పరిశోధనా ఉపకార వేతనం పొందే అవకాశాలు కూడా ఉన్నాయని డీన్ పేర్కొన్నారు.మరియు విశ్వవిద్యాలయ స్థాయిలోనూ అగ్రస్థానం సాధించారన్నారు.కళాశాలకు చెందిన వి. నిఖిల 9.3 గ్రేడ్ పాయింట్ల సగటుతో విశ్వవిద్యాలయ పరిధిలోని 13 ప్రభుత్వ, అనుబంధ కళాశాలల విద్యార్థుల్లో మొదటి స్థానం సాధించింది.ఈ ఘనతకు గాను ఆమెకు బంగారు పతకంతో పాటు రూ. 5,000 బహుమతిని అందజేశారు.ప్రతిష్టాత్మక ఐఐటీ, ఐఐఎస్సీ లలో పీహెచ్‌డీ ప్రవేశాలు పొందినట్లు తెలిపారు.కళాశాల విద్యార్థులు తమ నాలుగేళ్ల డిగ్రీ విద్య అనంతరం నేరుగా డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పీహెచ్డీ ప్రవేశాలు సాధించి సరికొత్త రికార్డు సృష్టించారన్నారు.కళాశాలకు చెందిన హరికృష్ణ, ఐజయ్య, మోహన్ మురళి,శ్రేయ అనే నలుగురు విద్యార్థులు 2026-27 విద్యా సంవత్సరానికి గాను దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఐఐటి జోధ్‌పూర్, ఐఐటి గువహటి లలో పీహెచ్‌డీ ప్రవేశాలు పొంది విద్యను అభ్యసిస్తున్నారన్నారు.వీరికి నెలకు రూ. 38,000 ఉపకార వేతనం అందనుందన్నారు. అయేషా మున్నీ అను విద్యార్థిని దేశంలోనే అత్యున్నత పరిశోధనా సంస్థ అయిన బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ లో పీహెచ్‌డీ ప్రవేశం సాధించిందన్నారు.ఈమెకు నెలకు రూ.42,000 స్కాలర్‌షిప్ లభించనుందని తెలిపారు జాతీయ మరియు విశ్వవిద్యాలయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను,వారికి మార్గదర్శకత్వం వహించిన అధ్యాపక బృందాన్ని కళాశాల యాజమాన్యం మరియు విద్యార్థులు అభినందించారు.

## కర్నూలు జిల్లాలో విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్

**నేర నియంత్రణ, ప్రజల భద్రతే లక్ష్యం.**



**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం రాత్రి వేళల్లో విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని విస్తృతంగా కొనసాగిస్తున్నారు.కర్నూలు, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆదోని సబ్ డివిజన్ల పరిధిలో పోలీసు బృందాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ, అనుమానాస్పద వాహనాలు, వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు “స్టాప్, వాష్ అండ్ గో” కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తూ వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలు సహకరించాలని, ఎక్కడైనా అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 లేదా డయల్ 100కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా అంగన్వాడి ఉత్సవాలు.



**రుద్రవరం ప్రతినిధి సెప్టెంబర్ 30 (నంది పత్రిక):** మండలంలోని కోటకొండ, ఢీకొట్టాల, ఎల్లా వత్తుల, శ్రీరంగాపురం, కె కొత్తూరు చెన్నయ్య స్వామి చెంచుగూడెం గ్రామాలలో బుధవారం ఘనంగా అంగనవాడి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగనవాడి టీచర్లు మనోజ, రవణమ్మ, రాజ్యలక్ష్మి,రాణి, లలితమ్మ, జి రాణి లు, భూలక్ష్మి, రాజేశ్వరి మాట్లాడుతూఅంగన్వాడి కేంద్రాలలో తల్లులకు ఇచ్చే ఆహారంలో పోషక పదార్థాలు ఉంటాయని అన్నారు. సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 7 వ తేదీ వరకు నిర్వహించే అంగన్ వాడి ఉత్సవాల భాగంగా అంగన్వాడీలో చేసే సేవల గురించి తల్లులు పిల్లలు తినే పోషక ఆహారం గురించి అందులో ప్రోటీన్స్ ఐరన్ ఉండే ఆహార పదార్థాల గురించి తల్లులకు వివరించారు. అంగన్వాడీ కేంద్రాలలో ఇస్తున్న ఆహార పదార్థాల గురించి కిట్ల గురించి తల్లులు అంగన్వాడి సెంటర్లో పొందుతున్న సేవలు గురించి తల్లులు వారి అభిప్రాయాలను వివరించారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడి ఆయాలు మరియూ తల్లులు చిన్నారులు పాల్గొన్నారు.

## క్యాంపస్ హైరింగ్‌కు ఢోకా లేదు.. జీతాలు 7 శాతం వరకు పెరిగే ఛాన్స్!

దేశంలో క్యాంపస్ నియామకాల మార్కెట్ స్థిరంగా కొనసాగుతోంది. నైపుణ్యాలు, కీలక ఉద్యోగాలు, ఉద్యోగానికి సిద్ధంగా ఉన్న అభ్యర్థులకు కంపెనీలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఈ క్రమంలో క్యాంపస్ నియామకాల్లో మధ్యస్థ జీతాలు ఏడాదికి 2 శాతం నుంచి 7 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని ప్రొఫెషనల్ సర్వీసెస్ సంస్థ ‘ఎయాన్’ నివేదిక తెలిపింది.

## దసరా ధమాకాపై అవగాహన



**బండి ఆత్మకూరు నంది పత్రిక సెప్టెంబర్ 30:** స్వచ్ఛ రథం కార్యక్రమంలో భాగంగా దసరా ధమాకా కింద 10 కేజీల కంటే పైన పొడిచెత్త ఇవ్వబడిన కుటుంబాలకు ప్రత్యేకంగా కూపన్లు ఇవ్వడం జరుగుతుందని బండి ఆత్మకూరు డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి పేర్కొన్నారు. బుధవారం పార్నపల్లె గ్రామంలో హరిత రాయబారులకు ఈ విషయంపై అవగాహన కల్పించారు. అక్టోబర్ ఆఖరు నాటికి ఎస్ డబ్ల్యూ పిసి షెడ్లు ఉన్న ప్రాంతాలలో 1000 కేజీల వర్మి కంపోస్టు ఉత్పత్తి చేయాలని డిప్యూటీ ఎంపీడీవో ఆదేశించారు. పార్లపల్లి గ్రామంలో ఇంటింటా తిరిగి పొడి చెత్త సేకరణ విషయంలో మహిళలకు అవగాహన కల్పించారు. 10 కేజీల కంటే ఎక్కువగా చెత్త ఇవ్వబడిన కుటుంబాలకు ప్రత్యేకంగా కూపన్ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. అక్టోబర్ నెల ఆఖరిలోగా కూపన్లన్నింటిని లక్కీ డ్రా తీసి ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులను ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. పార్నపల్లి గ్రామానికి అక్టోబర్ 6న స్వచ్ఛరతము వస్తుందని, గ్రామస్తులు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని పొడి చెత్తను అందజేయడంలో సహకరించాలని డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి అభ్యర్థి చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి పంచాయతీ కార్యదర్శి జ్యోతి తో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పల్లెపండుగ -3.0 లో భాగంగా సిసి రోడ్లు డ్రైనేజీ కి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి భూమి పూజ



**నంది పత్రిక ఆత్మకూరు** నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరు మండలం కరివేన గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో రూ.62 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించతలపెట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి భూమిపూజ చేసిన శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అలాగే కొట్టాల చెరువు గ్రామంలో ఒక కోటి డిఎంఎఫ్ నిధులతో కొత్త సోముల చెరువు పునరుద్ధరణ పనులకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అలాగే బిజెపి నాయకురాలు షబానా జనసేన నాయకుడు శ్రీరాములు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## పోరుమామిళ్ల మెయిన్ రోడ్డులో డివైడర్ పనులపై అయోమయం.. ప్రజల భద్రతపై ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ ఆందోళన

**బస్టాండ్ నుంచి వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు డివైడర్ పనులు ఎందుకు నిలిపివేశారంటూ ప్రశ్నలు**



**పోరుమామిళ్ల, సెప్టెంబర్ 30 (నంది పత్రిక ):** వైయస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల మేజర్ పంచాయతీ పరిధిలోని మెయిన్ రోడ్డులో జరుగుతున్న రోడ్డు, డివైడర్ పనులపై ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బస్టాండ్ సమీపం నుంచి వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు డివైడర్ పనులు మధ్యలోనే నిలిచిపోవడంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మార్గానికి ఇరువైపులా పాఠశాలలు, కళాశాలలు ఉండటంతో విద్యార్థులు, ప్రజల రాకపోకలను దృష్టిలో పెట్టుకుని డివైడర్ అభివృద్ధి పనులు చేపట్టాలని వారు కోరుతున్నారు.డివైడర్ మధ్యభాగంలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోందని స్థానికులు చెబుతున్నారు. అలాగే సాయిబాబా ఆలయం సమీపంలో డివైడర్‌కు తగిన క్రింది భాగం సపోర్ట్ లేకుండా నిర్మించారు. చిన్నపాటి వాహనం ఢీకొన్నా డివైడర్ కిందపడే ప్రమాదం ఉంది.అధికారులు నాణ్యతను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రాజధాని వైపు వెళ్లే ప్రధాన రహదారిగా ఉన్న ఈ మార్గంలో అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలతో, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చేపట్టాలని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ సభ్యులు గంగన్న, ఫణి రావు, ప్రవీణ్, సాగర్ కోరారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, పెండింగ్ పనులను పూర్తి చేసి ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రహదారి కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## బుడ్డా ఆశీస్సులతో 5వ వార్డు ఎంపీపీ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌గా శీలం నాగరాజు ఎన్నిక

**నంది పత్రిక ఆత్మకూరు** ఆత్మకూరు పట్టణంలోని 5వ వార్డులో గల ఎంపీపీ పాఠశాలలో నూతన విద్యా కమిటీ ఎన్నికలు ప్రధానోపాధ్యాయురాలు సీ.బీ. మల్లేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ఆశీస్సులతో విద్యా కమిటీ చైర్మన్‌గా శీలం నాగరాజు ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా బి. షేకున్ ఎన్నికయ్యారు.ఈ ఎన్నికలకు టీడీపీ నంద్యాల జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి తిమోతి, టీడీపీ రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి నాగూర్ ఖాన్, ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా, టీడీపీ ఆత్మకూరు పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా, టీడీపీ నాయకులు కోయ మున్నా, వార్డు ఇన్‌చార్జి యూసుఫ్, మంగయ్య, పుల్లయ్య తదితరులు సహకరించారు.విద్యా కమిటీ సభ్యులుగా నజీరున్ బీ, హర్షియా, కృష్ణవేణి, రషీదా బీ, వరలక్ష్మి, పవని, ఆశా ప్రవల్లిక, లక్ష్మీ ప్రసన్న, కీర్తిబాయి, నసీమ, సంజీవ తదితరులు ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్ శీలం నాగరాజు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు పాఠశాలలో అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి కమిటీ సభ్యులతో కలిసి కృషి చేస్తానన్నారు.అనంతరం నూతనంగా ఎన్నికైన విద్యా కమిటీ చైర్మన్ శీలం నాగరాజును టీడీపీ నాయకులు శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. వైస్ చైర్మన్ బి. షేకున్‌తో పాటు నూతన కమిటీ సభ్యులను కూడా నాయకులు అభినందించారు. పాఠశాల అభివృద్ధికి నూతన కమిటీ సమష్టిగా కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు రామాదేవి పాల్గొన్నారు.



# సోషల్ మీడియా ఇన్ఫ్లులెన్సర్ల ఎంపానెల్మెంట్ పాలసీ ని ప్రభుత్వం రద్దు చేయాలి

### విలేకరుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి. సోషల్ మీడియా ఇన్ఫ్లులెన్సర్ల ఎంపానెల్మెంట్ పాలసీ ని కొనసాగిస్తే వాలంటీర్ వ్యవస్తను వెంటనే విధులోకి తీసుకోవాలి

**కర్నూలు సిటీ నందిపత్రిక** సోషల్ మీడియా ఇన్ఫ్ లెన్సర్లు ను ప్రోత్సహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సోషల్ మీడియా ఇన్ఫ్లులెన్సర్ల ఎంపానెల్మెంట్ పాలసీ ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని జీరో బడ్జెట్ పాలిటిక్స్ నాయకులు నౌషాద్ డిమాండ్ చేశారు. కర్నూలు నరసింహారెడ్డి నగర్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్షరాన్ని నమ్ముకుని జీవిస్తున్న విలేకరులను రోడ్డున పడవేసి, అక్షరాన్ని అమ్ముకునే ఇన్ఫ్యులెన్స్ లకు ప్రాధాన్యత ఇవ్వడం తగదని అన్నారు. సోషల్ మీడియా ఇన్ఫ్లెన్సర్లకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్య ఇస్తూ తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు వంటిదని అన్నారు. గతంలో రాజుల పాలనలో బట్రాజుల విధానం ఉండేదని వారి చేత రాజులను కీర్తిస్తూ కవితలు వ్యాఖ్యలు చేసే వారిని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఇన్ఫ్లెన్సర్ల విధానం కూడా బటరాజుల విధానంతో పోలి ఉందని పేర్కొన్నారు. ఈ జీవోను తక్షణ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ జీవోను రద్దు చేయకపోతే న్యాయ స్థానాలను ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వానికి భజన చేసే వారిని గౌరవ వేతనం ఇచ్చి ప్రోత్సహిస్తుందని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఫోర్త్ ఎస్టేట్ అయిన జర్నలిజాన్ని కూల్చేందుకు కుట్ర జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులను అగౌరవపరుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సమంజసం కాదని అన్నారు. అక్రమ సోషల్ మీడియా ఇన్ఫ్లెన్సర్ల వల్ల జర్నలిస్టుల ఉనికి ప్రమాదంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులపై సర్వే చేసి జర్నలిస్టుల సంక్షేమానికి కేంద్రం నిధులతో, రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వాలు జర్నలిస్టుల పై అక్రమ కేసులు పెట్టడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. నిజమైన జర్నలిస్టుల కుటుంబాలు బ్రతకడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ఇన్ఫ్లులెన్సర్ల ఎంపానెల్మెంట్ పాలసీ ని కొనసాగిస్తే వాలంటీర్ వ్యవస్తను కూడా వెంటనే విధులోకి తీసుకోవాలిఅనీ కోరారు ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పని చేస్తూన వాలెంటీర్ను ప్రభుత్వం పథకాలకు ప్రతి ఇంటికి చేర్చి చదువు రాని , వృద్దులకు పథకాలు పొందిన అర్హులకు వారి ఇంటి వద్దకు చేర్చి ఒక్క సేవ దృపాదంతో ప్రతి ఇంటికి తిరిగి కేవలం గౌరవ వేతనానికి సేవచేసే వారికీ ప్రభుత్వం అండగా ఉండాలి అన్ని కోరారు .ఈ కార్యక్రమంలొ కే. ప్రశాంత్ 120 సచివాలయం వాలంటీర్, పి. పరుశురాముడు 119 సచివాలయం వాలంటీర్, వై. వెంకటేష్ 117 సచివాలయం వాలంటీర్ పాల్గొన్నారు.



## పదవీ విరమణ పొందిన ఎస్సై ఎస్. సోమ్లు నాయక్ ని సన్మానించిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్



**కర్నూలు సిటీ నందిపత్రిక** 44 సంవత్సరాల పాటు పోలీసుశాఖలో సేవలందించి పదవి వీరమణ పొందడం అభినందనీయమని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ తెలిపారు. కర్నూలు ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్( అటాచ్ మెంట్ కర్నూలు పిసిఆర్ ) లో విధులు నిర్వహిస్తూ ఎస్సై ఎస్. సోమ్లు నాయక్ పదవి వీరమణ పొందారు. ఈ సంధర్భంగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్సై ఎస్. సోమ్లు నాయక్ ని శాలువ, పూలమాలతో జిల్లా ఎస్పీ సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 44 సంవత్సరాల పాటు పోలీసుశాఖలో సేవలందించిన ఎస్సై సోమ్లు నాయక్ ని అభినందించారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ తర్వాత ఏవైనా సమస్యలు ఎదురైతే నేరుగా జిల్లా ఎస్పీని సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సిఐ మధుసూదన్ రావు, ఆర్ ఐ నారాయణ, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు నాగరాజు పాల్గొన్నారు.

# ఐఎఫ్టీయూ 9వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి: షేక్ చాంద్ బాషా

### కార్మిక హక్కుల పరిరక్షణకు ఐక్య ఉద్యమాలను బలోపేతం చేయాలి

**వెలుగోడు సెప్టెంబర్ 30 (నంది పత్రిక):**రాబోయే అక్టోబర్ 3, 4 తేదీల్లో రాజమహేంద్రవరంలో నిర్వహించనున్న ఐఎఫ్టీయూ 9వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఐఎఫ్టీయూ జిల్లా నాయకులు షేక్ చాంద్ బాషా కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. బుధవారం వెలుగోడు పట్టణంలో ఐఎఫ్టీయూ 9వ రాష్ట్ర మహాసభల ప్రచార పోస్టర్లను ఆయన నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షేక్ చాంద్ బాషా మాట్లాడుతూ.. రాజమహేంద్రవరంలోని సంహిత కన్వెన్షన్ హాల్లో ఈ మహాసభలు అత్యంత వైభవంగా జరగనున్నాయని తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న తీవ్ర సవాళ్లు, సమస్యలపై ఈ సభల్లో విస్తృతంగా చర్చించి, భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు పేర్కొన్నారు.

**కార్మికుల ప్రధాన డిమాండ్లు & చర్చనీయాంశాలు:**ఉద్యోగ భద్రత & వేతనాలు: కార్మికులందరికీ ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, సామాజిక భద్రత మరియు పని ప్రదేశాల్లో భద్రత కల్పించాలి.సమాన పనికి సమాన వేతనం: ఒకే రకమైన పని చేస్తున్న కార్మికుల మధ్య వేతనాలు, సౌకర్యాలు, ఉద్యోగ భద్రతలో వ్యత్యాసాలను నివారించాలి.వివిధ రంగాల సమస్యలు: కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ మరియు అసంఘటిత రంగ కార్మికుల సమస్యలతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలు, నిర్మాణ, మున్సిపల్, ఆటోమొబైల్ రంగాలు ఎదుర్కొంటున్న సవాళ్లపై ప్రత్యేకంగా చర్చించనున్నారు.విశాఖ ఉక్కు పరిరక్షణ: విశాఖపట్నం ఉక్కు పరిశ్రమతో పాటు రాష్ట్రంలోని పారిశ్రామిక రంగాన్ని, కార్మికుల ఉపాధిని కాపాడుకోవడమే లక్ష్యంగా మహాసభలు సాగుతాయని నాయకులు రఫీ, లాజరస్ వెల్లడించారు.



**హాజరుకానున్న ముఖ్య వక్తలు:** ఈ మహాసభలకు పలువురు జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రజాసంఘాల నాయకులు ముఖ్య వక్తలుగా హాజరుకానున్నారు:

పి. టాన్యా సీపీఐ-ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు

అశోక్ గయల్, డి. రమేష్ పట్నాయక్ ఐఎఫ్టీయూ జాతీయ నాయకులు

ఎం. రామకృష్ణ ఐఎఫ్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎన్.వి. కృష్ణ ఐఎఫ్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు

బి. భాస్కర్ ఏఐకేఎంఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి), యు. గనిరాజు, టి. ప్రకాష్ ఏఐకేఎం ఎస్ నాయకులు

వి. చిట్టిబాబు సిఎల్సి-ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు,ఎస్. కిరణ్ కుమార్ పిడిఎస్ యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

గుర్రం విజయ్ కుమార్ ఐఎఫ్టీయూ-న్యూ జాతీయ అధ్యక్షుడు, కట్టా విశ్వనాథం ఐఎఫ్టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, వి. భీమశంకర్ అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తదితరులు.

**ఐక్య పోరాటాలకు పిలుపు:** కార్మికుల సమస్యలు కేవలం వారి వ్యక్తిగతమైనవి కావు అని, అవి సామాజిక మరియు ఆర్థిక సమస్యలని చాంద్ బాషా స్పష్టం చేశారు. కార్మిక, రైతు, విద్యార్థి, ప్రజా సంఘాలన్నింటినీ కలుపుకొని ఐక్యంగా పోరాడినప్పుడే హక్కులను సాధించుకోగలమని తెలిపారు.

ఈ మహాసభలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి కార్మికులు, ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**పాల్గొన్న నాయకులు:**ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఐఎఫ్టీయూ నాయకులు మా బాషా, హరి, వంశీ, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## దేవనగర్ - పద్మావతి నగర్ మధ్య చాము కాలువపై త్వరలోనే నూతన బ్రిడ్జి నిర్మాణం:

### రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్



**నంద్యాల సిటీ బ్యూరో సెప్టెంబర్ 30 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలోని దేవనగర్ నుంచి పద్మావతి నగర్ ప్రాంతాలను కలుపుతూ వాల్మీకి దేవాలయం వద్ద ఉన్న చాము కాలువపై ప్రజల సౌకర్యార్థం నూతన బ్రిడ్జి నిర్మాణానికి త్వరలోనే చర్యలు చేపడతామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు . ఈరోజు సదరు ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి ఫరూక్ , బ్రిడ్జి ఆవశ్యకతపై స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ దేవనగర్, పద్మావతి నగర్ పరిసర ప్రాంతాల ప్రజలు రాకపోకల కోసం పడుతున్న ఇబ్బందులు తన దృష్టికి వచ్చాయని, ప్రజా ఆకాంక్షను గౌరవిస్తూ చాము కాలువపై ఆధునిక వంతెనను నిర్మించేందుకు ప్రణాళికలు రచిస్తున్నామని తెలిపారు. ఈ బ్రిడ్జి పూర్తయితే ఈ రెండు కాలనీల ప్రజలకు రాకపోకలు సులభతరమై, దూరం మరియు సమయం గణనీయంగా ఆదా అవుతాయన్నారు.సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు , నంద్యాల జిల్లా టీడీపీ ఆఫీస్ సెక్రటరీ రాజేష్ (బుజ్జి), నంద్యాల మార్కెట్ యార్డ్ డైరెక్టర్ స్వామి నాయక్, ఆర్కే హిదాయత్ ఖాన్, ఓబుల్ రెడ్డి మరియు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు కాలనీవాసులు పాల్గొన్నారు.



## వంతెనల పరిసరాల్లో పరిశుభ్రతకు రక్షణ

### నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

### రూ.52 లక్షలతో వంతెనల వద్ద రక్షణ వలయాలు



**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు నగరంలో నదులపై ఉన్న వంతెనల పరిసరాల్లో పరిశుభ్రతను కాపాడేందుకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని, వంతెనల వద్ద ప్రజలు చెత్త వేయకుండా, అపరిశుభ్రతకు తావులేకుండా రక్షణ వలయాలను ఏర్పాటు చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. బుధవారం ఆనంద్ టాకీస్ వద్ద హంద్రీ నదిపై ఏర్పాటు చేస్తున్న రక్షణ వలయాన్ని కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలోని ఆనంద్ టాకీస్ సమీపంలో, రాజ్ విహార్, జొహరాపురం ప్రాంతాల్లో హంద్రీ నదిపై, అశోక్ నగర్, కేవీ కళాశాల ప్రాంతాల్లో కేసీ కెనాల్పై ఉన్న వంతెనలకు రూ.52 లక్షలతో రక్షణ వలయాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ రక్షణ వలయాల ఏర్పాటుతో నదులు, కాలువలు పరిశుభ్రంగా ఉండటంతో పాటు వంతెనల వద్ద ప్రమాదాల నివారణకు దోహదపడుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా సెట్కూరు కార్యాలయం వద్ద ఉన్న అన్న క్యాంటీన్ను ఆకస్మిక తనిఖీ చేశారు. కెవిఆర్ కళాశాల, స్టాంటన్పురం, జొహరపురం ప్రాంతాల్లో గుర్రపు డెక్క తొలగింపు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో డీఈఈ కృష్ణలత, ఏఈ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## రబీకి 500 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరు

### 35 శాతం రాయితీపై రైతులకు పంపిణీ.. ఏఓ స్వాతి



**వెలుగోడు, సెప్టెంబర్ 30 (నంది పత్రిక):**రబీ 2026 సీజన్కు వెలుగోడు మండలానికి 500 క్వింటాళ్ల పప్పు శనగ విత్తనాలు మంజూరైనట్లు మండల వ్యవసాయ అధికారి స్వాతి తెలిపారు. రైతులకు 35 శాతం రాయితీపై విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

క్వింటా శనగ విత్తనాల పూర్తి ధర రూ.9,000 కాగా, 35 శాతం రాయితీ రూ.3,150 పోగా రైతు వాటాగా రూ.5,850 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. రైతుల సాగు విస్తీర్ణాన్ని బట్టి ఒక్కొక్కరికి కనిష్టంగా ఒక బస్తా నుంచి గరిష్టంగా 10 బస్తాల వరకు విత్తనాలు అందజేస్తామని చెప్పారు.అర్హత కలిగిన రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్బుక్తో సమీపంలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఓ స్వాతి కోరారు.సమతుల్య పోషక యాజమాన్యంతో అధిక దిగుబడులు వెలుగోడు గ్రామంలో 'ఆత్మనిర్భరత రైతుల అభివృద్ధిసమృద్ధి రైతు' అంశంపై రైతు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పప్పు గింజల జాతీయ మిషన్ 'ఆత్మనిర్భరత' కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ స్వాతి మాట్లాడుతూ నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి రైతులు సమతుల్య పోషక యాజమాన్యాన్ని పాటించాలని సూచించారు. పంటలకు అవసరమైన అన్ని రకాల పోషకాలను సరైన నిష్పత్తిలో, సరైన సమయంలో, సరైన పద్ధతిలో అందించడం ద్వారా నేల సారం దెబ్బతినకుండా చూడవచ్చని తెలిపారు.సమతుల్య పోషక యాజమాన్యంతో నేల ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు స్థిరమైన, అధిక దిగుబడులు సాధించవచ్చని ఆమె వివరించారు. రైతులు శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ వ్యవసాయ శాఖ సూచనలను వినియోగించుకోవాలని సూచించారు.

## “నంద్యాల టీడీపీ జిల్లా కార్యవర్గ సభ్యుల కీలక సమావేశం –

### రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సమగ్ర కార్యాచరణపై ఎన్ఎండి ఫిరోజ్ దిశానిర్దేశం“



**నంద్యాల సిటీ బ్యూరో సెప్టెంబర్ 30 ( నంది పత్రిక )** తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా కార్యాలయంలో బుధవారం టీడీపీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ అధ్యక్షతన జిల్లా కమిటీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ అనుసరించాల్సిన కార్యాచరణ, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, నాయకులుకార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికలకు పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని సూచించారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డు, ప్రతి ప్రాంతంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. నూతనంగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి స్వయంగా అందజేసి, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. చంద్రన్న నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రతి కుటుంబానికి సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందించేందుకు కృషి చేస్తోందని, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో పార్టీ శ్రేణులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. ఈ సమావేశంలో నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ కమిటీ సభ్యులు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## షుగర్ ఫ్రీ.. హై ప్రొటీన్.. మల్టీగ్రెయిన్: ఈ మాటల వెనుక అసలు మతలబు ఇదే

సూపర్ మార్కెట్కు వెళ్లగానే మన కంటికి ముందుగా కనిపించేది ప్యాకెట్ ముందు భాగమే. 'నేచురల్', 'మల్టీగ్రెయిన్', 'షుగర్ ఫ్రీ', 'హై ప్రొటీన్', 'ప్లాంట్ బేస్డ్'.. ఇలా రకరకాల పదాలు కనిపిస్తాయి. వాటిని చూసి ఇది ఆరోగ్యకరమైన ఆహారమేనని చాలామంది అనుకుంటారు. కానీ ప్యాకెట్పై కనిపించే మాటలకంటే.. వెనుక ఉన్న లేబుల్ అసలు విషయం చెబుతుంది. అందుకే ప్యాకెట్ కొనేముందు కొన్ని పదాల అసలు అర్థం తెలుసుకోవడం చాలా ముఖ్యం.

**'మల్టీగ్రెయిన్' అంటే** మల్టీగ్రెయిన్ అంటే ఒకటి కంటే ఎక్కువ రకాల ధాన్యాలు ఉన్నాయని అర్థం. అయితే అందులో ఉన్న ధాన్యాలన్నీ తప్పనిసరిగా సంపూర్ణ ధాన్యాలు కావాల్సిన అవసరం లేదు. అవి రిఫైన్డ్ ధాన్యాలు కూడా కావచ్చు. అందుకే పదార్థాల జాబితాలో మొదట 'హోల్ వీట్' లేదా 'హోల్ గ్రెయిన్' ఉందో చూడాలి.

**'నో యాడెడ్ షుగర్'..** 'నో యాడెడ్ షుగర్' అంటే తయారీ సమయంలో అదనంగా చక్కెర కలపలేదని అర్థం. అంతే తప్ప ఆ ఉత్పత్తిలో చక్కెర అసలు ఉండదని కాదు. పండ్లు లేదా పాలతో తయారైన ఉత్పత్తుల్లో సహజ చక్కెర ఉండొచ్చు.

## కేంద్రం కీలక నిర్ణయం... చిన్న పొదుపు పథకాలపై వడ్డీ రేట్లు యథాతథం

చిన్న మొత్తాల పొదుపు పథకాలపై పెట్టుబడి పెట్టే వారికి కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. 2026-27 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి (అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31, 2026 వరకు) వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దీంతో గత త్రైమాసికంలో అమలైన వడ్డీ రేట్లే మరో మూడు నెలల పాటు కొనసాగనున్నాయి. ఈ నిర్ణయంతో పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)పై వడ్డీ రేటు 7.1 శాతం వద్ద స్థిరంగా ఉండనుంది. ఇక సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్సీఎస్ఎస్), సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్వై) పథకాలపై అత్యధికంగా 8.2 శాతం వడ్డీ లభించనుంది. అదేవిధంగా, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్సీ)పై 7.7 శాతం, కిసాన్ వికాస్ పత్ర (కేవీపీ)పై 7.5 శాతం వడ్డీ రేటు కొనసాగుతాయి. వీటితో పాటు పోస్టాఫీస్ టైమ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లపై కూడా పాత వడ్డీ రేట్లే వర్తించనున్నాయి. ప్రభుత్వ సెక్యూరిటీల (+-ంవషం) రాబడులకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ప్రతి త్రైమాసికానికోసారి ఈ వడ్డీ రేట్లను సమీక్షిస్తుంది. అయితే, దీనిపై తుది నిర్ణయం తీసుకునే అధికారం ప్రభుత్వం వద్దే ఉంటుంది.

# రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు పార్లమెంట్ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ పిలుపు





**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూల్ పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ సమావేశము బుధవారం ఉదయం 11 గంటల నుండి జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం కర్నూల్ నందు పార్లమెంటు అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ అధ్యక్షతన నిర్వహించబడినది. సమావేశమునకు ముందుగా పార్టీ వ్యవస్థాపకులు కీర్తిశేషులు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు ఇప్పించిన అనంతరము సమావేశము ప్రారంభమైనది .ఈ సమావేశంకు శాసనసభ్యులు డాక్టర్ బి వి జయ నాగేశ్వర్ రెడ్డి, బొగ్గుల దస్త గిరి, మంత్రాలయం నియోజకవర్గం పార్టీఇంచార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి, కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు కార్పొరేషన్ చైర్మన్లు మిన్నప్ప,విక్రమ్ సింగ్ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ కే తుగ్గలి నాగేంద్ర, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కైప పద్మలత రెడ్డి డి జేమ్స్,తో పాటు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ కమిటీ సభ్యులు హాజరు కావడం జరిగినది.సమావేశంలో ప్రధానంగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ప్రతి నెల జిల్లా స్థాయి సమావేశంలో ఏర్పాటు చేయవలసిందిగా ఆదేశించి ఉన్నందున ఈ సమావేశము ఏర్పాటు చేయడం జరిగిందని పార్లమెంటు అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణ మ్మ వివరిస్తూ, పార్టీ ఆదేశాలను పాటిస్తూ ప్రతినెల సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందనీ తెలిపారు. సమావేశంలో నాయకులు మాట్లాడుతూ త్వరలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగనున్నా యని ఈ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ వైయస్సార్ పార్టీని పూర్తి స్థాయిలో ఓడించాలని పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో గొడ్డలి పార్టీకి చెందిన ఒక అరాచకశక్తి జగన్ రెడ్డితో తెలుగుదేశం జనసేన బీజేపీ కూటమి నాయకులు పోరాటం చేస్తున్నారని అనునిత్యము అసత్యాలతో ప్రజలను తప్పుదారి పట్టించేందుకు లేనిది ఉన్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని , జగన్ చేస్తున్నటువంటి తప్పుడు ప్రచారాన్నితిప్పికోడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టినటువంటి అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు కూలంక సంఘా వివరించి రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలియజేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ము సూపర్ సిక్స్ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేసిందని గతంలో వైసీపీ ప్రభుత్వంలో జగన్ మోహన్ రెడ్డి పెన్షన్ల విషయంలో 3000 పెంచడానికి మూడు పల్టీలు కొట్టాడని అయితే చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ ప్రకారము 4000, 6000, 10000 పెంచిమాట నిలుపు కున్నారని వివరించారు. మున్సిపాలిటీల పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలకు ఒక మున్సిపాలిటీకి 50 కోట్లు కేటాయిం చారని, ప్రధానమంత్రి మోడీ సహకారంతో పోలవరం అమరావతి భోగాపురం వెలిగొండ వంటి వాటిని త్వరిత గతిన పూర్తి చేయడానికి కృషి చేస్తున్నారని, రాష్ట్రంలో జరుగుతున్నటువంటి అభివృద్ధిని చూసి ఓర్వలేక జగన్మోహన్ రెడ్డి చంద్రబాబు నాయుడు పైన కూటమి ప్రభుత్వం పైన నిరాధారమైన ఆరోపణలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని వారి దుష్ప్రచారాలను ప్రజలకు వివరించి స్థానిక ఎన్నికల్లో గెలిపిదేయంగా ప్రతి ఒక్కరు పని చేయవలసిన అవసరం ఎంతగానో ఉందని అందువల్ల ప్రతి నియోజకవర్గంలో మంత్రివర్యులు, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్చా ర్జీలు మున్సిపల్ చైర్మన్లను, మేయర్ స్థానం, నగర పంచా యతీ స్థానాలతో పాటు జిల్లా పరిషత్ సభ్యులను ఎంపీటీసీ సభ్యులను గెలిపించుకొని పార్టీ అధినేత కి గిఫ్ట్ గ ఇవ్వాలని పిలుపునిచ్చారు. వైసిపి నేతలు వారు అధికా రంలో ఉండగా చేసిన తప్పులు ఒక్కొక్కటి బయటపడు తుంటే తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి డీఎస్పీ పైన లేనిపోని అసత్య ప్రచారం చేశారని, అయితే వారు చేసిన ఆరోపణ లలో ఏ ఒక్కటి కూడా నిజం లేదని తేటతెల మయింది. వారి ప్రభుత్వం హాయంలో జరిగినటువంటి కుంభకోణాలు బయట పడుతుంటే వారి వెన్నులో వణుకు పుట్టి కూటమి నాయకుల మధ్యన చిచ్చుపెట్టే ప్రయత్నం జగన్ చేస్తున్నాడని, మనం మనలో మనకు తగవులు పెట్టడానికి కుట్రలు చేస్తున్నా రని కనుక వారి కుట్రలను అధిగమించి తెలుగుదేశం పార్టీ నాయకులు అందరూ ఐకమత్యంతో సమిష్టిగా కృషిచేసి స్థానిక సంస్థల ఎన్నికలలో గెలుపు కోసం పాటుపడవలసిన దిగా విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశమునకు జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు సోమిశెట్టి శ్రీకాంత్ బి చంద్రశేఖర్ జి అశోక్ కుమార్ యాదవ్ అశోక్ యాదవ్, అధికార ప్రతినిధి వెంకట కృష్ణ నాయుడు కార్యనిర్వాహక కార్యదర్శి తప్ప కురువ మద్దిలేటి కార్యదర్శులు గడ్డం హైమావతి మీడియా కోఆర్డినేటర్ మల్లికార్జున గౌడ్, ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కురువ మల్లయ్య మొదలగు నాయకులు హాజరు కావడం జరిగినది.

# సర్వ నరసింహస్వామి ఆలయానికి హుండీ ఆదాయం రూ. 99,735..



**సిరివెళ్ల :(నంది పత్రిక):** సిరివెళ్ల మండల పరిధిలోని మహదేవపురం గ్రామ పొలిమేరలో వెలిసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ సర్వ నరసింహస్వామి ఆలయంపై భక్తులు తమ అంచెలంచల భక్తిని మరోసారి చాటుకున్నారు. బుధవారం నాడు జరిగిన హుండీ ఈ.వో. సాయిజయచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో ఆదాయ లెక్కింపులో భారీగా 99,735 ఆదాయం రావడం జరిగింది. ఆలయ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి ఆలయ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న రేచర్ల నాగేంద్రుడు ఆధ్వర్యంలో ఈ లెక్కింపు కార్యక్రమం పారదర్శకంగా, భక్తి శ్రద్ధలతో జరిగింది. చైర్మన్ నాగేంద్రుడు నాయకత్వంలో ఆలయం దినదినాభివృద్ధి చెందుతోందని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో ఆయన చూపుతున్న చొరవ అభినందనీయమని భక్తులు కొనియాడుతున్నారు. ఆయన హయాంలోనే ఆలయ ఆదాయం పెరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ నాగేంద్రుడు మాట్లాడుతూ, భక్తులు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఆలయ అభివృద్ధికి ప్రతి రూపాయిని సద్వినియోగం చేస్తామని, స్వామి వారి ఆశీస్సులతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రంగనాయకులు, పవను, కమిటీ సభ్యులు,ఆలయ సిబ్బంది, మరియు భక్తులు, తదితరులు, పాల్గొన్నారు.

# నన్నూరు గ్రామంలో ఘనంగా అంగన్వాడీల మహోత్సవం

### అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరిగెల మురళీకృష్ణ



**కర్నూలు సిటీ నందిపత్రిక** భారతీయ జనతా పార్టీ జాతీయ, రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా కర్నూలు జిల్లా పాణ్యం నియోజకవర్గం ఓర్వకల్ మండలం నన్నూరు గ్రామంలో అంగన్వాడీల మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి బీజేపీ అంగన్వాడీల జిల్లా కన్వీనర్, కోడుమూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరిగెల మురళీకృష్ణ,మాజీ జిల్లా అధ్యక్షులు జి.ఎస్. నాగరాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నన్నూరు గ్రామంలోని అంగన్వాడీ శికేంద్రం నం.3రి,శికేంద్రం ఐడి నం. 13101159రిను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న పోషకాహారం సక్రమంగా అందుతున్నదా? నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా? అనే విషయాలను అంగన్వాడీ సిబ్బంది, లబ్ధిదారులను అడిగి తెలుసు కున్నారు. అలాగే అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పోషకాహారం, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు, కేంద్రాల్లో ఉన్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీ లించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందుతున్న పౌష్టికాహారం, సంక్షేమ పథకాల అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించడమే అంగన్వాడీల మహోత్సవం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సక్రమంగా చేరేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్టీ మోర్చా కర్నూలు జిల్లా అధ్యక్షులు ఆవుల రమేష్, అంగన్వాడీ సిబ్బంది, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రష్యా సైన్యంలో చేరొద్దు.. అది చాలా ప్రమాదకరం

రష్యా సైన్యంలో చేరడం అత్యంత ప్రమాదకరమని, అటువంటి నిర్ణయాలు తీసుకోవద్దని భారత ప్రభుత్వం తన పౌరులను మరోసారి గట్టిగా హెచ్చరించింది. ఉక్రెయిన్‌తో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో, ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రాణాలను పణంగా పెట్టవద్దని సూచించింది. ఈ మేరకు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. గత రెండేళ్లుగా హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ, కొందరు భారతీయులు రష్యా సైన్యంలో చేరుతున్నట్లు నివేదికలు అందుతున్నాయని విదేశాంగ శాఖ పేర్కొంది. అధిక ఆదాయం వస్తుందన్న ఆశతో కొందరు స్వచ్ఛందంగా రష్యా సైన్యంలో చేరి, ఆ తర్వాత సమస్యలు ఎదురైనప్పుడు భారత ప్రభుత్వాన్ని ఆశ్రయిస్తున్నారని వివరించింది. ఇది తీవ్ర ఆందోళన కలిగించే ధోరణి అని, ఇలాంటి చర్యలను ప్రభుత్వం ఏమాత్రం ప్రోత్సహించబోదని స్పష్టం చేసింది.

# మంత్రి ఆరోపణలు అవాస్తవం

### పాత్రికేయుల సమావేశం లో మాజీ ఎమ్మెల్యే




**బనగానపల్లె సెప్టెంబర్ 30నంది పత్రిక** బనగానపల్లె లో షాదీఖానా ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తన మీద చేసిన ఆరోపణలు అవాస్తవమని బనగానపల్లె మాజీ శాసన సభ్యులు కాటసాని రామిరెడ్డి తెలిపారు . బుధవారం వైసీపీ కార్యాలయం లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ మొన్న బనగానపల్లె పట్టణం లోని షాదిఖానా ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి నా మీద కొన్ని అవాస్తవ ఆరోపణలు చేయడం జరిగింది అయితే 2018 లో బీసీ జనార్దన్ రెడ్డి శాసనసభ్యుడుగా ఉన్నప్పుడు జీవో 77 ద్వారా షాది ఖానా కు సంబంధించి కోటి రూపాయలు మంజూరు అయినట్లు చెప్పుకోవడం జరిగిందే కానీ అది స్థానిక ఎంపీడీవో కు సంబంధించి నిధులు జమ కాలేదు...ఈ మధ్య వైఎస్సార్సీపీ కార్యకర్తల సమావేశంలో ఈ విషయం గురించే నేను మాట్లాడడం జరిగింది.షాది ఖానా ప్రారంభోత్సవంలో మరి నువ్వు ఎందుకు ఎంపీడీవోకు సంబంధించిన ఖాతాలో కోటి రూపాయలు చూపించలేకపోయావు....అంటూ పాత్రికేయుల ముందు ఎంపీడీవోకు ఫోన్ చేయగా ఖాతాలో కోటి రూపాయలు నిధులు రాలేదంటూఎంపిడిఓ ఒప్పుకున్నారని తెలిపారు. మరి కోటి రూపాయలు నిధులు ఏమయ్యాయి మంత్రి బీసీ నువ్వే సమాధానం చెప్పాలి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నా మీద ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

# చిన్నారులు, గర్భిణీల ఆరోగ్యం కోసం విశేష కృషి చేస్తున్న ప్రధాని మోదీకి సామంచి శ్రీనివాస్ కృతజ్ఞతలు




**తిరుపతి బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 30 నంది పత్రిక** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్క రించుకుని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న "సేవా సంకల్ప అభియాన్"లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో "అంగన్‌వాడీ ఉత్సవ్ పోషణ్ అభియాన్" కార్యక్ర మాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్ర మంలో భాగంగా నేడు చింతకాయల వీధి, గాలి వీధి, మంచాల వీధి, పట్నాల వీధి, గిరి పురం-1,గిరిపురం2 సిబిఎన్ కాలనీ మరియు పూసల వీధి అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని మహిళ మోర్చా జిల్లా కార్యదర్శి ఆలకుంట అనిత అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులు, గర్భిణీలు మరియు బాలింతలకు అందిస్తున్న పోషకాహారం, ఆరోగ్య సేవలను పరిశీలించారు.బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు అనూష రామకృష్ణ ఈ సమావేశంలో గర్భవతులకు మంచి పౌష్టిక ఆహారంతో పాటు ప్రతి ఒక్కరికి చీర జాకెట్ పసుపు కుంకుమిచ్చి ఐదు మంది ముత్తయిదుల చేత దీవించడం జరిగింది. సామంచి శ్రీనివాస్ మాట్లాడుతూ, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణతో పాటు గర్భిణీలు, బాలింతల పోషణ మరియు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. దేశ భవిష్యత్తైన చిన్నారులు ఆరోగ్యంగా, పోషకాహారంతో పెరగాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతల ఆరోగ్యం మరియు పోషణకు ప్రాధాన్యతనిస్తూ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఈ సందర్భంగా సామంచి శ్రీనివాస్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో ఎస్సీ మోర్చామీడియా కన్వీనర్ హరి , బిజెపి సెంట్రల్ మండల అధ్యక్షులు దీపక్ యాదవ్, వెస్ట్ మండల అధ్యక్షులు శ్రీధర్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సవిత డాక్టర్. ప్రియదర్శిని మొదలగు బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.ఆశా వర్కర్లు,అంగన్‌వాడీ సిబ్బంది, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 30 నంది పత్రిక** ఆళ్లగడ్డ పట్టణంలోని కోయిలకుంట్ల రోడ్డులో గల గని గుంతలలో బుధవారం గుర్తు తెలయని వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఆళ్లగడ్డ పట్టణ సిఐ నాగరాజరావు తెలిపారు. పసుపు రంగు టీ షర్టు ధరించిన ఈ వ్యక్తి వయస్సు 35 సంవత్సరాలు ఉంటుందని ఆచూకీ తెలిసిన వారు పట్టణ సిఐ కార్యాలయంలో సంప్రదించి వివరాలు అందజేయాలని సీఐ నాగరాజురావు తెలిపారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# ప్రభుత్వ పాఠశాలల విద్యను బలోపేతం చేసేందుకు కృషి చేయండి..బిసి రాజారెడ్డి



**బనగానపల్లె సెప్టెంబర్ 30నందిపత్రిక** ప్రభుత్వ పాఠశాలల విద్యను బలోపేతం చేసేందుకు ఎన్నికైన విద్యాకమిటి చైర్మన్, వైస్ చైర్మన్ లు తోడ్పాటునందించాలని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు.బుధవారం బనగానపల్లె మండలం ఇల్లూరు కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గా నషిమూన్, ప్రాథమిక పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గా వలి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో గ్రామ మాజీ సర్పంచ్ రామిరెడ్డి ఆధ్వర్యంలో కొత్తగా ఎన్నికైన విద్యా కమిటీ చైర్మన్ లు మర్యాదపూర్వకంగా బిసి రాజారెడ్డిని కలిశారు ఈ సందర్భంగా బిసి రాజారెడ్డి మాట్లాడుతూ.. విద్యా కమిటీ చైర్మన్ లు ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులను సమన్వయం చేసుకొని ఆయా పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు ఖర్చు చేస్తూ విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పిస్తుందన్నారు. ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి కోసం కేటాయిస్తున్న నిధులు దుర్వినియోగం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత విద్యా కమిటీ చైర్మన్ లపై ఉంటుందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలో ఎక్కువ మంది విద్యార్థులు చేరేలా చూడాలన్నారు. విద్య ఎంత అభివృద్ధి చెందితే సమాజం అంత బాగుపడుతుందని అన్నారు కార్యక్రమంలో గోధుల సుదర్శన్ రెడ్డి, సురేష్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ బాల నాయుడు, చిలకల రాజు, కాసిం, కిట్టు, సుబ్బరామయ్య పాల్గొన్నారు.

# ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహిద్దాం

### అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు

### పోలీసులకు తుది పోలింగ్ కేంద్రాల జాబితా అందజేత

### 3 కేటగిరీలుగా విభజించి వివరాలు అందజేయాలని ఆదేశం



**కర్నూలు సిటీ నందిపత్రిక** త్వరలో జరగనున్న నగరపాలక సంస్థ సాధారణ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహిద్దామని, అందుకు అవసరమైన చర్యలను ఇప్పటి నుంచే చేపట్టాలని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం కౌన్సిల్ హాల్లో డీఎస్పీ కె.వి. రాఘవేంద్రతో పాటు నగర పరిధిలోని సీఐలు, ఎస్ఐలతో ఆయన సమావేశమయ్యారు. ఇటీవల విడుదల చేసిన తుది పోలింగ్ కేంద్రాల జాబితాను పోలీసు అధికారులకు అందజేశారు. పోలింగ్ కేంద్రాలను సాధారణ, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మకంగా మూడు కేటగిరీలుగా విభజించి వివరాలను అందజేయాలని సూచించారు. ఆయా వివరాలను ఎన్నికల సంఘానికి పంపిస్తామన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో 487 పోలింగ్ కేంద్రాల పరిధిలో 4,79,861 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వారీగా భద్రతా ఏర్పాట్లను ముందుగానే పరిశీలించి, అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, ర్యాంపులు, విద్యుత్ దీపాలు తదితర అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు పోలీసు శాఖ తరఫున అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో సీఐలు చంద్రబాబు నాయుడు, పి. శేషయ్య, బి.వి. విక్రమసింహా, జి. మారుతి శంకర్, ఎస్ఐలు మోహన్ కిషన్ రెడ్డి, యస్. నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# "గుండెపోటు ను అత్యవసరంగా గుర్తించి స్పందిస్తేనే ప్రాణాలు కాపాడగలరు".. అడిషనల్ డీఎంఈ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె చిట్టి నరసమ్మ



**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు మెడికల్ కాలేజీలో పుల్లారెడ్డి డెంటల్ కాలేజీ పిజిలకు సీసీఎల్ఎస్ శిక్షణ"... కార్డియాక్ అరెస్టును అత్యవసరంగా గుర్తించడం వెంటనే స్పందించి వైద్యం అందించగలిగితే ప్రాణాలు కాపాడ వచ్చునని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కర్నూల్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె చిట్టి నరసమ్మ అన్నారు. బుధవారం కర్నూలు మెడికల్ కాలేజీలోని అనస్థీషియ విభాగం ఆధ్వర్యంలో స్కిల్ ల్యాబ్ యందు పుల్లారెడ్డి డెంటల్ కాలేజీ పిజి లకు నిర్వహించిన రెండురోజుల సీసీఎల్ఎస్ (సి సి యల్ యస్ కంప్రెహేన్సివ్ కార్డిక్ లైఫ్ సపోర్ట్ ) పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ: "కార్డియాక్ అరెస్ట్ సమయంలో తొలి కొన్ని నిమిషాలు అత్యంత కీలకం. సరైన సమయంలో సరైన విధానంలో సిపిఆర్ , డీఫిబ్రిలేషన్ మరియు ఇతర అత్యవసర చర్యలు చేపట్టడం ద్వారా ఒక మనిషి ప్రాణాన్ని కాపాడే అవకాశం ఉంటుందని తెలిపారు.అందువల్ల ప్రతి వైద్యుడు ఆధునిక కార్డియాక్ లైఫ్ సపోర్ట్ విధానాలపై పూర్తి అవగాహన, ప్రాక్టికల్ నైపుణ్యం కలిగి ఉండాలి అని ఆమె తెలిపారు. ఈ విషయాలపై ఆధునిక మెలకువలు, ఆధునిక పరికరాల వినియోగం, తక్షణమే స్పందించాల్సిన టెక్నిక్స్ మొదలగు విషయాలను మేనికిన్ ద్వారా వైద్యులకు నేరుగా చూపిస్తూ దానికి సంబంధించిన టెక్నిక్స్ ను నేర్పించడం జరిగింది. ఈసీసీఎల్ శిక్షణ లు జిల్లా స్థాయిలో వైద్యులకు పీజీ లకు యూజీలకు, పారామెడికల్ విద్యార్థులకు, నర్సింగ సిబ్బందికి దశలవారీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనస్థీషియా విభాగపు అధిపతి సుధీర్, ప్రొఫెసర్ విశాల, ప్రొఫెసర్ రామ్ శివ నాయక్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణలత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు జయదేవ్, రాథోడ్, భారతి, సుమియా బేగం,రఘు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# వాట్సాప్‌లో టీనేజర్ల భద్రత.. కొత్తగా పేరెంటల్ కంట్రోల్ ఫీచర్లు

టీనేజర్ల భద్రతను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో ప్రముఖ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్ నూతన ఫీచర్లను ప్రవేశపెట్టింది. తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి ఆన్‌లైన్ భద్రతా ప్రమాణాలను నిర్దేశించుకోవడానికి ఈ 'పేరెంటల్ కంట్రోల్స్' దోహదపడతాయని మెటా యాజమాన్యంలోని వాట్సాప్ బుధవారం వెల్లడించింది. అయితే, ఈ ఫీచర్లు పూర్తిగా ఐచ్ఛికమేనని, వినియోగదారుల వ్యక్తిగత సంభాషణలకు ఎప్పటిలాగే పూర్తి స్థాయి భద్రత ఉంటుందని సంస్థ స్పష్టం చేసింది.ఈ నూతన సదుపాయాల ద్వారా టీనేజర్ల ప్రొఫైల్ ఫోటోను ఎవరు చూడాలి, వారిని గ్రూపుల్లో ఎవరు చేర్చుకోవాలి వంటి అంశాలను తల్లిదండ్రులు పర్యవేక్షించవచ్చు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే భర్తరఫ్ చేసి అరెస్టు చేయాలి

## కర్నూలు కలెక్టరేట్ వద్ద కాంగ్రెస్ ధర్నా



**కర్నూల్ సిటీ నందిపత్రిక** ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే భర్తరఫ్ చేసి అరెస్టు చేయాలని సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని భాష డిమాండ్ చేశారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సూచన మేరకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ మరియు కర్నూల్ సిటీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు షేక్ జిలాని భాష ఆధ్వర్యంలో మంగళవారం కర్నూలు జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిలాని భాష మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల సంఘంపై ఉందన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే భర్తరఫ్ చేసి, ఆయనపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ "ఓట్ చోరీ"గా ఆరోపిస్తున్న అంశాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు సమాధానం చెప్పాలని, నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 13.3 కోట్ల ఓటర్ల అంశంపై స్పష్టత ఇవ్వాలి. సార్ ప్రక్రియలో 13 కోట్లకు పైగా ఓటర్ల పేర్లు డ్రాఫ్ట్ జాబితాల నుంచి తొలగించబడినట్లు పలు నివేదికలు పేర్కొంటున్న నేపథ్యంలో, ప్రతి ఓటరు పేరు తొలగింపుకు కారణం ఏమిటో పారదర్శకంగా వెల్లడించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందని జిలానీ భాష తెలియజేశారు.

అనంతరం మాజీ ఎమ్మెల్సీ ఏఐసీసీ సభ్యులు ఎం సుధాకర్ బాబు మాట్లాడుతూ అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగించ కూడదని, అనర్హంగా తొలగించబడిన అర్హులైన ఓటర్ల పేర్లను తక్షణమే పునరుద్ధరించాలని కోరారు. ఎన్నికల జాబితాలపై వచ్చిన ఆరోపణలు, డిజిటల్ వ్యవస్థలో మార్పులు, ఓటర్ల పేర్ల తొలగింపు వంటి అంశాలపై స్వతంత్రంగా, పారదర్శకంగా, సమగ్రంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం ప్రస్తుతం ఓటర్ల జాబితా సాఫ్ట్‌వేర్‌పై సమీక్ష చేపట్టినట్లు కూడా నివేదికలు వెలువడ్డాయి. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం. అర్హుడైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడటం ఎన్నికల సంఘం బాధ్యత. ఓటర్ల జాబితాపై ప్రజలకు పూర్తి నమ్మకం కలిగేలా పారదర్శకమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల రాజ్యాంగ హక్కులను కాపాడే వరకు కాంగ్రెస్ పార్టీ ప్రజా పోరాటాన్ని కొనసాగిస్తుందని సుధాకర్ బాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, ఏఐసిసి సభ్యులు ఎం సుధాకర్ బాబు , మాజీ డిసిసి అధ్యక్షులు కే బాబురావు , కోఆర్డినేటర్లు ఎం కాశీం వలి, అనంతరత్నం మాదిగ, ఐ ఎన్ టి సి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్సి బజారన్న, ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ డివి సాంబశివుడు, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, ఆదివాసి కాంగ్రెస్ జిల్లా చైర్మన్ వై మారుతి రావు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మీసాల సుమలత, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనిధి రాయల్, ఐఎన్టీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం సుంకన్న, ఓబిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లికార్జున యాదవ్, ఐఎన్టియుసి సిటీ అధ్యక్షులు రేపల్లె ప్రతాప్, కాంగ్రెస్ నాయకులు సయ్యద్ నవీద్, ఇండ్లూరి లాజరస్, యు శేషయ్య, బి సుబ్రహ్మణ్యం, బండిరాజు, పాట్రిక్ డేవిడ్, ఆర్ విజయభాస్కర్, జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకురాలు కే భాగ్యలక్ష్మి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మొదట నీరు ఇచ్చాం ఇప్పుడు సంపద సృష్టిస్తాం





## ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ
## రాయలసీమను సస్యశ్యామలం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం
## ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 30, నంది పత్రిక** రాయలసీమ ప్రాంతాన్ని కరువు ప్రాంతం నుంచి ఉద్యానవన హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ తెలిపారు. బుధవారం చింతకుంట్ల ప్రాంతంలో ఆమె పర్యటించి, చెరువుల నీటి నిల్వలు, చెరువులను నింపుతున్న తీరును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మొదట నీరు ఇచ్చాం ఇప్పుడు సంపద సృష్టిస్తాం" అనే లక్ష్యంతో నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటూ రైతులకు శాశ్వత ప్రయోజనం కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. హంద్రీనీవా వంటి ప్రాజెక్టుల ద్వారా రాయలసీమకు నీటిని అందించడంతో పాటు, ప్రతి నీటి బొట్టును సమర్థవంతంగా వినియోగించేలా సూక్ష్మ సేద్యాన్ని ప్రోత్సహిస్తున్నాం అన్నారు. అలాగే రాష్ట్రంలో తాగునీటి సమస్య లేకుండా చేయాలన్న ఉద్దేశంతో ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. మన జిల్లాలో కేసీ కెనాల్, తెలుగుగంగ, కుందూ కింద మూడు ప్రధాన నీటి వనరులు ఉన్న నియోజకవర్గం ఆళ్లగడ్డ అన్నారు. మనం చివరి ప్రాంతంలో ఉండటం వల్ల నీటిని తీసుకురావడం, కాపాడుకోవడం చాలా పెద్ద సవాలు అన్నారు. కేసీ కెనాల్, తెలుగుగంగ, ఎంఐ కి సంబంధించిన అధికారులతో నిరంతరం మాట్లాడి, కష్టపడి ఈరోజు ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ప్రధాన చెరువుల్లో దాదాపు 80 శాతం నింపుకోగలిగామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి కిషోర్, కె సి కెనాల్ డిఈ సురేంద్ర, ఎఈ రంగారెడ్డి, ఇతర శాఖల అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ అభివృద్ధి లక్ష్యం





## రైతులు ఉద్యాన పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
## చిన్నటేకూరులో తోట పాఠశాల కార్యక్రమం
## టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షురాలు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

**కర్నూలు సిటీ నంది పత్రిక** కర్నూలు జిల్లా కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో తోట పాఠశాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక శాఖల అధికారులు రైతులకు ఆయా శాఖల ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమగ్ర ఉద్యాన అభివృద్ధి కార్యక్రమం (ఐ హెచ్ డి పి) ప్రాధాన్యతను వివరించారు. ఉద్యాన పంటల విస్తీర్ణం పెంపు, ఉత్పాదకత, నాణ్యత పెంపు, ఆధునిక సాగు పద్ధతుల ప్రోత్సాహం, నీటి వనరుల సమర్థ వినియోగం, రైతులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఉద్యాన రంగ అభివృద్ధికి ఐ హెచ్ డి పి దోహదపడుతుందని వివరించారు. ఉద్యాన పంటల్లో ఫార్మ్ పాండ్, డ్రిప్, ఇరిగేషన్, వీడ్ మ్యాట్ వంటి నీటి సంరక్షణ, తేమ పరిరక్షణ చర్యల ప్రాముఖ్యతను, వాటి ద్వారా కలిగే ప్రయోజనాలను, ప్రభుత్వ రాయితీ విధానాలను రైతులకు వివరించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో నీటి కొరతను అధిగమించేందుకు ఈ పద్ధతులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యాన రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అక్టోబర్ 2వ తేదీన మదనపల్లిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రారంభం కానుండటం ఉద్యాన రైతులకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నాణ్యమైన నాటుసామగ్రి, ఉత్పత్తుల సేకరణ, నిల్వ, ప్రాసెసింగ్, విలువ జోడింపు మార్కెటింగ్ వంటి అంశాల్లో రైతులకు మరిన్ని అవకాశాలు అందుబాటులోకి వచ్చేలా కృషి జరుగుతుందని తెలిపారు. కర్నూలు జిల్లాలోని ఉద్యాన రైతులు ఆధునిక సాగు పద్ధతులను అవలంబించి, ఐ హెచ్ డి పి తోపాటు ప్రభుత్వంలోని ఇతర ఉద్యాన పథకాలను సద్వినియోగం చేసుకొని అధిక దిగుబడులు, మెరుగైన నాణ్యత ఆదాయం సాధించాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో భాగంగా రైతులకు శనగ విత్తనాలు పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఎంపీడీవో శ్రీనివాసులు వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, ఉద్యాన అధికారి నరేష్ కుమార్ రెడ్డి, పశువైద్య అధికారి డా శ్రీకాంత్ రెడ్డి ఏపీ ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్ రామగిడ్డయ, ఉలిందకొండ సొసైటీ చైర్మన్ ఈవి రమణ, నాయకులు మధేశ్, రామాంజనేయులు, శేషగిరి, లక్ష్మన్న, రాజశేఖర్, మౌలాలి, జనసేన నాయకులు బజారన్న, మాజీ ఎంపీటీసీ మునిస్వామి, కొంగనపాడు వినోద్, వివిధ శాఖల గ్రామ అధికారులు, కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమను నిరాకరించిందని.. శంషాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిపై సహోద్యోగి దాడి

హైదరాబాద్‌లో ఘోరం జరిగింది. ప్రేమను నిరాకరించిందన్న నెపంతో ఓ యువకుడు, తన సహోద్యోగి అయిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిపై దాడికి తెగబడ్డాడు. శంషాబాద్ విమానాశ్రయం పరిధిలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఝార్ఖండ్‌కు చెందిన 25 ఏళ్ల యువతి మాదాపూర్‌లో నివసిస్తూ, నగరంలోని ఓ ప్రముఖ ఐటీ సంస్థలో మేనేజర్‌గా పనిచేస్తోంది. అదే సంస్థలో పనిచేసే ఆకాశ్ అనే యువకుడు గత ఏడాది కాలంగా ఆమెను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. నిందితుడి వేధింపులు భరించలేక బాధితురాలు గతంలోనే మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, అప్పట్లో అతను వెనక్కి తగ్గాడు.

ఈ నేపథ్యంలో, ఢిల్లీలోని బంధువుల ఇంటి నుంచి విమానంలో తిరిగి వస్తున్న ఆమెను శంషాబాద్ విమానాశ్రయం వద్ద ఆకాశ్ అడ్డగించాడు. ఆమెను బెదిరించి బలవంతంగా కారులో ఎక్కించుకుని హైదరాబాద్ వైపు తీసుకువెళ్లాడు. మార్గమధ్యంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో ఆగ్రహించిన ఆకాశ్, యువతిపై పిడిగుద్దులతో విచక్షణారహితంగా దాడి చేశాడు.

# అన్న క్యాంటీన్‌పై కమిషనర్ ప్రత్యేక దృష్టి.

## పేదలు,వృద్ధులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశం.



**నందికొట్కూరు సెప్టెంబర్ 30( నంది పత్రిక)** పేదలు,వృద్ధులకు తక్కువ ధరలో నాణ్యమైన భోజనం అందించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో మున్సిపల్ కమిషనర్ జి. వెంకటరామిరెడ్డి బుధవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలోని పగిడ్యాల రోడ్డులో ఉన్న అన్న క్యాంటీన్‌ను ఆయన పరిశీలించారు. తనిఖీలో భాగంగా క్యాంటీన్‌లో వడ్డిస్తున్న భోజనం నాణ్యత,రుచి,వేడి, ఆహార పదార్థాల నాణ్యతను కమిషనర్ స్వయంగా పరిశీలించారు. భోజనం చేస్తున్న వృద్ధులు,పేద ప్రజలతో మాట్లాడి వారికి అందుతున్న ఆహారంపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం క్యాంటీన్‌లోని రోజువారీ భోజన వివరాలు,బియ్యం, కూరగాయల నిల్వలు, బిల్లుల రిజిస్టర్లను పరిశీలించారు. వంటగది, భోజనం వడ్డించే ప్రదేశాలను పరిశీలించి పరిశుభ్రత ప్రమాణాలను పాటిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. సిబ్బంది మాస్కులు,గ్లౌజులు ధరించి విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పేద ప్రజలకు కేవలం రూ.5కే నాణ్యమైన,పౌష్టికాహారం అందించడమే అన్న క్యాంటీన్ లక్ష్యమన్నారు. ఆహార నాణ్యత,రుచి, పరిశుభ్రత విషయంలో ఎక్కడా రాజీపడరాదని సిబ్బందికి స్పష్టం చేశారు. క్యాంటీన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. కమిషనర్ ఆకస్మిక తనిఖీతో అన్న క్యాంటీన్ నిర్వహణపై సిబ్బందిలో మరింత బాధ్యత పెరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# వయోవృద్ధులను గౌరవించాలి.




**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 30 నంది పత్రిక** నేడు అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా ఆళ్ళగడ్డకు చెందిన ప్రముఖ చిత్రకారుడు విజయ్ ఓ చిత్రాన్ని చిత్రించారు. ఒక వృద్ధుడు చిన్న పిల్లకు మార్గ నిర్దేశము చేస్తున్నట్లుగా ఉన్న ఈ చిత్రం జీవితంపై ఎన్నో ఆశలు పెట్టుకొని ఎదుగు చున్న పిల్లలను, యువకులను ఆలోచింప చేస్తున్నది. తమ జీవిత చర మారక ములో ఉన్న పెద్దల మాటలను పెడచెవిన పెట్ట రాదని, వారి మాటలే జీవిత సత్యాలని నేటి యువ తరం గుర్తించాలి. లేనిచో తమ జీవిత ప్రయాణం లో ఒడుదుడుకులాశం ఎదురయ్యే ఒడుదుడుకులను తట్టుకొన లేక సమస్యల సుడి సంభం పాలు కాక తప్పదని విజయ్ ఈ సందర్భంగా తన అభి ప్రాయాన్ని వెలి బుచ్చారు.

# పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి పెద్దపీట

## నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు
## సఫాయి మిత్రల భద్రత, సంక్షేమ కార్యక్రమం
## మెడికవర్ ఆస్పత్రి సహకారంతో వైద్య పరీక్షలు



**కర్నూల్ సిటీ నందిపత్రిక** కర్నూలు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా సఫాయి మిత్రల భద్రత, సంక్షేమ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, కార్మికులకు అవసరమైన పనిముట్లు, హెల్త్ కిట్లు సమకూర్చామని తెలిపారు. అంతేకాకుండా వివిధ ప్రైవేట్ ఆస్పత్రుల సహకారంతో కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల శ్రమ వెలకట్టలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మెడికవర్ ఆస్పత్రి సహకారంతో పారిశుద్ధ్య కార్మికులకు బీపీ, జీఆర్‌బీఎస్, ఈసీజీ, పీఎఫ్‌టీ, 2డీ ఎకో, కంటి, దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, శానిటరీ సూపర్‌వైజర్ రమేష్ బాబు, ఇన్‌స్పెక్టర్లు, మెడికవర్ ఆస్పత్రి జీఎం వై. మహేశ్వర్ రెడ్డి, ఏజీఎం ఎస్. ఖాదర్ బాషా, పల్మనాలజీ వైద్యులు డాక్టర్ వినోద్ ఆచారి, న్యూరో ఫిజీషియన్ డాక్టర్ రఘునందిని, గైనకాలజీ వైద్యులు డాక్టర్ నిఖిల, ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ మంజునాథ్, మెడికల్ క్యాంప్ కోఆర్డినేటర్లు బాలన్న, బాల మద్దిలేటి, శేష నాయుడు, కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలి

### కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్



**కర్నూల్ సిటీ నందిపత్రిక** వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌ను కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. రాబోయే పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మక గ్రామాలు, అక్కడి పరిస్థితులు, గ్రౌండ్ లెవల్ పరిస్థితులపై వెల్దుర్తి ఎస్సైని అడిగి తెలుసుకున్నారు. రాబోయే పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలింగ్ కేంద్రాలు, పోలీస్ పికెట్లను నిరంతరం పర్యవేక్షిస్తూ, సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. రాబోయే పంచాయతీ ఎన్నికల బందోబస్తుకు పటిష్టమైన ప్రణాళిక సిద్ధం చేసుకుని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి ఎస్సై నరేష్ మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల కు యువత దూరంగా ఉండాలి






### మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

### గంజాయిని నిర్మూలించండి మన దేశ భవిష్యత్తును కాపాడండి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం ఆచంట బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 30 నంది పత్రిక** మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉంటూ, వాటి నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై సమాజాన్ని మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, అన్నారు .మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్తు దెబ్బతినడంతో పాటు కుటుంబాలు, సమాజం తీవ్రంగా నష్టపోతాయని ఆమె అన్నారు."గంజాయిని నిర్మూలించండి మన దేశ భవిష్యత్తును కాపాడండి, డ్రగ్స్ వద్దు జీవితమే ముద్దు అనే నినాదంతో యువతలో మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించేందుకు బుధవారం పెనుమంట్ర మండలం మార్టేరు సెంటర్ నుంచి ఆచంట ఏఎంసీ వరకు మార్టేరు యూత్ బాస్కెట్బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, స్థానిక శాసనసభ్యులు పితాని సత్యనారాయణ సారధ్యంలో నిర్వహించిన 8కె రన్ జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్థానిక శాసనసభ్యులు పితాని సత్యనారాయణ కలిసి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వారు యువతతో కలిసి 8కె రన్ లో పాల్గొని మాదకద్రవ్యాల నిర్మూలనపై యువత, ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబ వ్యవస్థకు సమాజానికి తీవ్ర నష్టం కలిగిస్తుందని అన్నారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు ఆకర్షితులు కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యా సంస్థలు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, పోలీసు మరియు ఇతర ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మత్తు పదార్థాలు యువతను ఏ విధంగా ఆకర్షించి వారి జీవితాలను నాశనం చేస్తున్నాయో విద్యార్థులకు నిరంతరం అవగాహన కల్పించవలసిన అవసరం ఉందన్నారు ఒత్తిడి తదితర కారణాలతో మత్తు పదార్థాలకు బానిసలు అయితే భవిష్యత్తులో తీవ్ర ప్రభావం ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. కళాశాలలోనూ తరచు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని కోరారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు, యువతకు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగానికి సంబంధించి సమాచారం తెలిసినప్పుడు ప్రజలు భయపడకుండా సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం అందించాలని ఆమె సూచించారు. సమాజంలో మాదకద్రవ్యాల ఆనవాళ్లు లేకుండా చేయడానికి ప్రజల సహకారం అత్యంత కీలకమని అన్నారు.డ్రగ్స్ వ్యతిరేక కార్యక్రమానికి వేలాదిమంది విద్యార్థులు తరలిరావడం ఆనందంగా ఉందని స్థానిక శాసనసభ్యులు సారధ్యంలో రన్ ఇంత విజయవంతంగా సక్సెస్ కావడం అభినందనీయమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు పితాని సత్యనారాయణ మాట్లాడుతూ మత్తు పదార్థాలను పూర్తిగా రూపుమాపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. గంజాయి, నల్లమందు తదితర మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, హోంమంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో పోలీసు, ఎక్సైజ్ శాఖలతో పాటు మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈగల్ విభాగం ద్వారా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. మాదకద్రవ్యాల నియంత్రణకు 1972 హెల్ప్లైన్ ద్వారా సమాచారం అందిస్తే ప్రత్యేక బృందాలు స్పందిస్తాయని అన్నారు.డ్రగ్స్‌ను పూర్తిగా రూపుమాపాలని మత్తుకు ఎవరు బానిస కాకూడదని ఒక సందేశం తో ప్రతి ఒక్కరి లో అవగాహన కల్పించుట కొరకు మార్టేరు నుంచి ఆచంట వరకు 8 కిలోమీటర్ల రన్ నిర్వహించటం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారని అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించి యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దాసిరాజు, డి.ఎస్.పి సుధాకర్, అడిషనల్ డి.ఎస్.పి విశ్వనాథ్, ఆచంట ఇ ఆర్ ఓ డా.కె సి హెచ్ అప్పారావు, జిల్లా గృహనిర్మాణ శాఖ అధికారి జి. పిచ్చియ్య,తాహసిల్దార్లు రాజరాజేశ్వరి, ఎన్ ఎస్ కుమార్, ఈగల్ ప్రత్యేక అధికారులు, ఏఎంసీ చైర్మన్ కేత సత్యవతి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఉప్పలపాటి సురేష్ బాబు, కర్రి అచ్యుత రామారెడ్డి, తమనంపూడి శ్రీనివాస్ రెడ్డి, చిర్ల బాలాజీ రెడ్డి, వెలగల సత్తిరెడ్డి, వెలగల నగేష్, కర్రి కృష్ణారెడ్డి, మై గాపుల రాము,తోలేటి రాంబాబు, గొల్లపల్లి శ్రీను, దొంగ శ్రీను,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.








## నాడు ఆచంట ఆరోగ్య కేంద్రానికి జిల్లా కలెక్టర్ చూపిన ప్రత్యేక చొరవ ఇచ్చిన మార్గదర్శకాలు

### నేడు సత్ఫలితాలు ఇచ్చాయి

**భీమవరం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 30 నంది పత్రిక** ఆచంట సామాజిక ఆరోగ్య కేంద్రంలో పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చూపిన ప్రత్యేక చొరవ, ఇచ్చిన మార్గదర్శకాలు సత్ఫలితాలను అందించాయి. గతంలో ఆసుపత్రిని స్వయంగా పరిశీలించిన కలెక్టర్, ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, రోగులకు మెరుగైన సౌకర్యాలు, పారిశుధ్య ప్రమాణాల పెంపుపై ప్రత్యేకంగా సూచనలు చేశారు.కలెక్టర్ సూచనలను స్ఫూర్తిగా తీసుకొని ఆసుపత్రి అధికారులు, సిబ్బంది సమన్వయంతో పలు అభివృద్ధి చర్యలు చేపట్టారు. స్వచ్ఛత కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ఆసుపత్రి పరిసరాలు, వార్డులు, మరుగుదొడ్లు, వ్యర్థాల నిర్వహణ, రోగులకు అందించే సౌకర్యాల్లో గణనీయమైన మార్పులు తీసుకువచ్చారు. కలెక్టర్ స్వయంగా ఆసుపత్రిని సందర్శించి పరిస్థితులను పరిశీలించడం, అవసరమైన మార్గదర్శకాలు ఇవ్వడం, వాటి అమలుపై దృష్టి సారించడం వల్లే ఆసుపత్రి పరిశుభ్రత ప్రమాణాలు మరింత మెరుగుపడటానికి అవకాశం ఏర్పడిందని ఆసుపత్రి అధికారులు, సిబ్బంది పేర్కొన్నాయి. ఆమె చొరవకు అనుగుణంగా చేపట్టిన సమష్టి కృషి ఫలితంగా ఆచంట సీహెచ్‌సీ రాష్ట్రస్థాయి స్వచ్ఛ ఆసుపత్రి అవార్డుకు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తమైంది. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకోనున్న నేపథ్యంలో, ఆచంట సామాజిక ఆరోగ్య కేంద్రం సాధించిన ఈ గుర్తింపు జిల్లాకు గర్వకారణంగా నిలుస్తుందని పేర్కొన్నారు. జిల్లాలోని ఇతర ఆసుపత్రులు కూడా ఆచంట సామాజిక ఆరోగ్య కేంద్రం ని స్ఫూర్తిగా తీసుకొని పారిశుధ్య నిర్వహణలో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.




## కాళీపట్నం భూముల సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో సెప్టెంబర్ 30 నంది పత్రిక**మొగల్తూరు మండలం కాళీపట్నం భూముల సర్వే పురోగతిపై జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి బుధవారం తహశీల్దార్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సర్వే పనుల పురోగతిని తహశీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. భూముల సర్వే ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, పూర్తి స్థాయి ఖచ్చితత్వంతో నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వే పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని, సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో మండల తహసిల్దార్ ఫరూక్ సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటర్నెట్ లేకుండానే మొబైల్‌లో లైవ్ టీవీ!

### 'డైరెక్ట్-టు-మొబైల్'తో సరికొత్త టెక్నాలజీ అమలుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు

మొబైల్ ఫోన్‌లో లైవ్ టీవీ ఛానల్స్ చూడటానికి ఇకపై ఇంటర్నెట్ డేటా లేదా వైఫై అవసరం లేదు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం 'డైరెక్ట్-టు-మొబైల్' అనే సరికొత్త టెక్నాలజీని వాణిజ్యపరంగా అందుబాటులోకి తెచ్చేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. ఈ టెక్నాలజీ ద్వారా సిమ్ కార్డు, డేటా కనెక్షన్ లేకపోయినా నేరుగా మొబైల్‌లోనే టీవీ ప్రసారాలను వీక్షించవచ్చు. బ్రాడ్‌కాస్టింగ్, బ్రాడ్‌బ్యాండ్ కలయికతో పనిచేసే సాంకేతికత. దీని ద్వారా ఎలాంటి ఇంటర్నెట్ కనెక్షన్ లేకుండానే లైవ్ టీవీ, వీడియోలు, ఇతర మల్టీమీడియా కంటెంట్‌ను నేరుగా మొబైల్స్‌కు ప్రసారం చేయవచ్చు. ముఖ్యంగా ఇంటర్నెట్ సిగ్నల్స్ బలహీనంగా ఉండే గిరిజన, అటవీ, కొండ ప్రాంతాలు, మారుమూల గ్రామాల్లోని ప్రజలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రసార భారతి, ఐఐటీ కాన్పూర్, తేజస్ నెట్‌వర్క్స్ (గతంలో సాంఖ్య ల్యాబ్స్) సంయుక్తంగా ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేశాయి. ఇప్పటికే దేశవ్యాప్తంగా 19కి పైగా నగరాల్లో ట్రయల్స్ విజయవంతంగా పూర్తయ్యాయి. వాణిజ్యపరమైన అమలు కోసం అక్టోబర్‌లో రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ జారీ చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 470-582 స్పెక్ట్రమ్ బ్యాండ్‌లో ఈ ప్రసారాలు జరుగుతాయని, దీనివల్ల సెల్యులార్ నెట్‌వర్క్‌లకు ఎలాంటి అంతరాయం ఉండదని పరిశోధకులు స్పష్టం చేశారు. అయితే, ఈ టెక్నాలజీ విస్తృత వినియోగానికి కొన్ని సవాళ్లు ఉన్నాయి. 'డైరెక్ట్-టు-మొబైల్' ప్రసారాలను స్వీకరించేందుకు ఫోన్లలో 3.0 ప్రమాణాలకు అనుగుణమైన హార్డ్‌వేర్ ఉండాలి. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న చాలా స్మార్ట్‌ఫోన్లు దీనికి సపోర్ట్ చేయవు. మరోవైపు, ఈ టెక్నాలజీ వల్ల తమ డేటా ఆదాయానికి గండి పడుతుందని టెలికాం కంపెనీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

## టిడ్కో బిల్డింగ్ ల సముదాయంలో మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పర్యటన



**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 30, నంది పత్రిక** ఆళ్లగడ్డ పట్టణంలోని టిట్కో బిల్డింగ్ల సముదాయం లో బుధవారం మాజీ ఎమ్మెల్యే గంగుల బిజెంద్రారెడ్డి పర్యటించారు. టిడ్కో బిల్డింగ్ లలో వున్న ప్రజల సమస్యలు ఆయన అడిగి తెలుసుకున్నారు. వెంటనే అధికారులతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి మాజీ ఎంపీపీ గజ్జల రాఘవేంద్ర రెడ్డి మాజీ వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కులూరు నరసింహారెడ్డి, మాజీ కౌన్సిలర్ సుధాకర్ రెడ్డి, మహాలక్ష్మి అధినేత రంగేశ్వర్ రెడ్డి, పలసాని మల్లికార్జునరెడ్డి, మాజీ కోఆప్షన్ నెంబర్ రమేష్ గౌడ్, మాదం చెన్నయ్య కిషోర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## నూజివీడు పట్టణ అభివృద్ధే ఆయన అజెండా - స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే ఆయన లక్ష్యం

### సొంత నగదుతో సుమారు 200 విద్యుత్ స్తంభాలు నిర్మిస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి




**ఏలూరు బ్యూరోచీఫ్ సెప్టెంబరు:30 నంది పత్రిక** నూజివీడు పట్టణంలో గత 20 సంవత్సరాలుగా కొన్ని వార్డులు, కొన్ని ఏరియాల్లో విద్యుత్ స్తంభాలు లేక చీకటిలో మగ్గుతున్నాయి. ఎన్నోసార్లు టెండర్లు వేసినా కాంట్రాక్టర్లు ముందుకు రాని పరిస్థితి.విషయం తెలుసుకున్న రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తమ సొంత నగదు వెచ్చించి 200 విద్యుత్ స్తంభాలు, కండక్టర్, ఇతర సామగ్రిలి కొనుగోలు చేసి నేడు పనులు ప్రారంభించారు.

**నేడు ప్రారంభమైన ప్రాంతాలు:** యానాదుల కాలనీ, గాంధీనగర్, గొడుగువారి గూడెం. వచ్చే 20 రోజుల్లో పనులు పూర్తి చేసి పట్టణాన్ని కొత్త వెలుగులతో నింపుతామనిలి మంత్రివర్యులు పత్రికా ముఖంగా తెలిపారు.

**స్థానికుల హర్షం:** ఎన్నో ఏళ్లుగా చీకటిలో బిక్కుబిక్కుమంటూ గడిపామని, వీధి లైట్లు లేక పాముల బెడద, కుక్కల బెడద, దొంగల భయంతో నిద్రలేని రాత్రులు గడిపామని, నేడు మంత్రి చొరవతో చీకట్లు పోయి వెలుగులు వస్తున్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.గత పాలకులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఇదిగో చేస్తాం, అదిగో చేస్తాం అంటూ కాలయాపన చేసి చీకట్లో నెట్టేశారని, దూరదృష్టి, మంచి మనసున్న మంత్రివర్యుల రాకతో పట్టణ రూపురేఖలే మారుతున్నాయని అన్నారు.

**పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి:** సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పార్కులు, సెంట్రల్ లైటింగ్, ఇండోర్ స్టేడియం, త్రాగునీటి సదుపాయాలు. 20 ఏళ్లుగా లేని విద్యుత్ స్తంభాలను సొంత నగదుతో నిర్మిస్తున్న మంత్రికి జీవితాంతం రుణపడి ఉంటామని పట్టణ ప్రజలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 1న అర్హులందరికీ ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ...

### జిల్లాలో 2,19,185 మంది లబ్ధిదారులకు రూ.95.38 కోట్లకు పింఛన్లు పంపిణీకి రంగం సిద్ధం ....

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 30 నంది పత్రిక** పశ్చిమ గోదావరి జిల్లాలో అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ సకాలంలో అందేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 1వ తేదీన జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని ఆమె అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ అక్టోబర్-2026 నెలకు గాను మొత్తం 2,19,185 మంది లబ్ధిదారులకు ₹95.38 కోట్ల ఆర్థిక సహాయాన్ని పంపిణీ చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. రేపు ఉదయం నుంచే లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి సంబంధిత సిబ్బంది ద్వారా అత్యంత పారదర్శకంగా పెన్షన్ల పంపిణీ ప్రక్రియను చేపడతామని పేర్కొన్నారు.

**నియోజకవర్గ వారీగా పింఛన్ల వివరాలు ఇలా ఉన్నాయి:**ఆచంట నియోజకవర్గంలో మొత్తం మొత్తం 27890 మంది లబ్ధిదారులకు రూ 12.08 కోట్లు భీమవరం నియోజవర్గంలో మొత్తం 29816 మంది లబ్ధిదారులకు రూ 13.02 కోట్లునరసాపురం నియోజకవర్గంలో మొత్తం 26413 మంది లబ్ధిదారులకు రూ 11.38 కోట్లుపాలకొల్లు నియోజకవర్గంలో మొత్తం 9871 మంది లబ్ధిదారులకు రూ 4.21 కోట్లు తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో మొత్తం 30089 మంది లబ్ధిదారులకు రూ 13.26 కోట్లుతణుకు నియోజకవర్గంలో మొత్తం 34472 మంది లబ్ధిదారులకు రూ 15.02 కోట్ల రూపాయలు ఉండి నియోజకవర్గంలో మొత్తం 33888 మంది లబ్ధిదారులకు రూ14.64 కోట్లు గణపవరం మండలంలో మొత్తం 8308 మంది లబ్ధిదారులకు రూ 3.70 కోట్లు వివిధ పెన్షన్ల ద్వారా లబ్ధిదారులకు అందజేయను ఉన్నారని కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలోని అన్ని మండలాలు, పట్టణ ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీ ప్రక్రియ సజావుగా జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. పంపిణీలో పారదర్శకత, సమర్థత పాటించాలని అధికారులను ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గౌరవప్రదంగా సేవలు అందించాలని సూచించారు. పింఛన్ల పంపిణీ బాధ్యతలు నిర్వహిస్తున్న సిబ్బంది లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరించి, మర్యాదపూర్వకంగా పింఛన్లు అందజేయాలని కలెక్టర్ సూచించారు. పంపిణీ సమయంలో ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పింఛన్ సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.



# అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల సేవలు వెలకట్టలేనివి





## కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ నరసాపురంలో ఘనంగా 'అంగన్‌వాడీ ఉత్సవం' అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఆయాలకు ఘన సన్మానం చేసిన కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ, ఎంపీ పాక సత్యనారాయణ, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్

**నరసాపురం, బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 30 నంది పత్రిక:** గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ కొనియాడారు. వారి వేతనాల పెంపు అంశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పెద్దల దృష్టికి తీసుకెళ్లి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప అభియాన్'లో భాగంగా నరసాపురంలోని తెలగ కళ్యాణ మండపంలో 'అంగన్‌వాడీ ఉత్సవం' ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, ఎంపీ పాక సత్యనారాయణతో కలిసి అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఆయాలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ విశ్వగురువుగా ఎదుగుతోందన్నారు. ప్రధాని జన్మదినాన్ని పురస్కరించుకుని నెలరోజుల పాటు దేశవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.దేశవ్యాప్తంగా సుమారు 22 లక్షల మంది అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు క్షేత్రస్థాయిలో అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. మాతా, శిశు మరణాలను తగ్గించడంతో పాటు గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి మాతృ వందన యోజన', 'పోషణ్ అభియాన్' వంటి పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రధానమంత్రి మాతృ వందన యోజన కింద తొలి కాన్పుకు రూ.5,000, రెండో కాన్పులో ఆడపిల్ల పుడితే రూ.6,000 ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న గుడ్లు, పాలు, బాలామృతం తదితర పౌష్టికాహారానికి అయ్యే ఖర్చులో కేంద్ర ప్రభుత్వం తన వాటాను భరిస్తోందన్నారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల కష్టానికి తగిన గౌరవం, ప్రోత్సాహం కల్పించేలా వారి వేతనాల పెంపు అంశాన్ని సంబంధిత పెద్దల దృష్టికి తీసుకెళ్తానని శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో పిల్లల పౌష్టికాహారానికి కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించలేదని విమర్శించారు. ఎన్డీఏ ప్రభుత్వం పేదల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తోందని, జన్‌ధన్ యోజన, ముద్రా యోజన, బీమా యోజన వంటి పథకాలు పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని తెలిపారు.భారతదేశ భవిష్యత్ తరాలు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా దృఢంగా ఉండాలనే లక్ష్యంతో 'సేవా సంకల్ప అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీ పాక సత్యనారాయణ తెలిపారు. నవ సమాజ నిర్మాణానికి పునాదిగా నిలుస్తున్న అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల సేవలకు ఎన్డీఏ ప్రభుత్వం తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. బాత్రూమ్‌లు, తాగునీరు, ఫ్యాన్లు తదితర సదుపాయాలు లేని కేంద్రాలను గుర్తించి, వాటికి సంబంధించిన సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో వేగవంతమైన అభివృద్ధి: ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నామని నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పనులు, నూతన పరిశ్రమల ఏర్పాటు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీవాణి, తోట గంగరాజు, జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, మహిళా మోర్చా అధ్యక్షురాలు గన్నబత్తుల సత్యవతి, డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళి, మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకిరామ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు, టీడీపీ నాయకులు కొవ్వలి రామ్మోహన్ నాయుడు, పలువురు ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, భారీ సంఖ్యలో అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.ఇది న్యూస్‌పేపర్‌కు పంపే ప్రెస్ నోట్‌గా ఉపయోగించడానికి అనువుగా ఉంటుంది.

# జిల్లాలో హెచ్.ఐ.వి, ఎయిడ్స్ నియంత్రణకు చర్యలు.

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి





**భీమవరం బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 30 నంది పత్రిక** జిల్లాలో హెచ్.ఐ.వి, ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులను గుర్తించి నియంత్రణకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నేషనల్ ఎయిడ్స్ అండ్ ఎస్టీడీ కంట్రోల్ ప్రోగ్రామ్" జిల్లా స్థాయి సమీక్ష సమావేశంబుధవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన నిర్వహించటం జరిగింది. హెచ్.ఐ.వి, ఎయిడ్స్, లైంగిక సంక్రమణ వ్యాధుల అదుపు, క్షయ, కుష్టు రోగాల నివారణ చర్యలు, తదితర కార్యక్రమాల పురోగతిపై 'దిశ' వ్యూహాత్మక ప్రణాళిక అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా ఇంచార్జ్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ యం.రవిబాబు, హాస్పిటల్ సర్వీసెస్ జిల్లా కోఆర్డినేటర్ సూర్యనారాయణ, జిల్లా జైలు అధికారులు, జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ కిషోర్ కుమార్, జిల్లా హెచ్ఐవి పాజిటివ్ నెట్వర్క్ ప్రతినిధులు, బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు, ఐ. సి. టి. సి ప్రతినిధులు, ఎ ఆర్ టి మెడికల్ ఆఫీసర్స్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో హెచ్.ఐ.వి పరీక్షలను తరచూ నిర్వహించాలని అన్నారు. హెచ్.ఐ.వి పాజిటివ్ తో గుర్తింపబడిన వారికి వెంటనే చికిత్స అందించాలని తెలిపారు. హెచ్ఐవి తో జీవిస్తున్న గర్భవతులకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ చేయాలని వైద్య అధికారులకు తెలిపారు. రాబోయే మూడు నెలల్లో హెచ్ఐవి వ్యాధిగ్రస్తులను గుర్తించాలని తెలిపారు. ట్రాన్స్ జెండర్స్ అందరూ హెచ్ఐవి పై అవగాహన కలిగి ఉండి హెచ్ఐవి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. జిల్లాలో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు తెలిపారు. ట్రాన్సజెండర్స్ అందరికీ స్వయం ఉపాధి కి సంబంధించిన పథకంలో భాగస్వామ్యం కల్పించాలని జిల్లా క్వార్టెర్లి బౌలింగ్ శాఖ సూపర్డెంట్ కు తెలిపారు. నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లా క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ పి కిరణ్, సి ఎస్ ఒ సాక్షి గోపాలరావు, సి పి ఒ కాళంగి రవికుమార్, పాల్గొన్నారు.



# ఎస్సీ, ఎస్టీ దాడుల కేసుల విచారణ వేగవంతం చేయాలి

### జిల్లాలో మతసామరస్యాన్ని కాపాడాలి.
### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.

**భీమవరం, బ్యూరో చీఫ్ సెప్టెంబర్30 నంది పత్రిక** జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాలపై జరిగే దాడులకు సంబంధించిన కేసుల విచారణను వేగవంతం చేసి బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. జిల్లాలో అన్ని వర్గాల ప్రజలు మతసామరస్యంతో జీవించాలని పిలుపునిచ్చారు. భీమవరం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (డీవీఎంసీ) సమావేశంలో కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు, విచారణలో జాప్యానికి తావులేకుండా చూడాలని, ముఖ్యంగా ఎఫ్ఐఆర్ నమోదు, చార్జ్‌షీట్ దాఖలు దశల్లో వేగవంతమైన చర్యలు తీసుకోవాలని డీఎస్పీలను ఆదేశించారు. జూన్ 1 నుంచి సెప్టెంబర్ 15, 2026 వరకు జిల్లాలో 12 అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని తెలిపారు. వీటిలో నరసాపురం సబ్‌డివిజన్‌లో 6, భీమవరం సబ్‌డివిజన్‌లో 1, తాడేపల్లిగూడెం సబ్‌డివిజన్‌లో 5 కేసులు నమోదైనట్లు వివరించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని కమిటీ సభ్యులు సూచించారు. బడి బయట ఉన్న విద్యార్థుల జాబితాలను కమిటీ సభ్యులకు అందజేయాలని తెలిపారు.అనంతరం జరిగిన మాన్యువల్ స్కావెంజర్స్ సమావేశంలో జిల్లాలో మాన్యువల్ స్కావెంజర్లు లేరని కలెక్టర్ తెలిపారు. పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వం అందిస్తున్న రక్షణ పరికరాలను తప్పనిసరిగా వినియోగించేలా మున్సిపల్ కమిషనర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు.సమావేశంలో తాడేపల్లిగూడెం ఆర్ డి ఒ యం. సూర్యారావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎన్.వి అరుణకుమారి, డీవీఎంసీ సభ్యులు కె.చిన్నపెద్దిరాజు, కె.రాజశేఖర్, ఎన్జీవో ప్రతినిధి వి.ఆశాజ్యోతి వివిధ సమస్యలను ప్రస్తావించారు. నరసాపురం సబ్‌డివిజన్‌లో అధిక సంఖ్యలో కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ప్రత్యేక దృష్టి అవసరమని సూచించారు.ఈ సమావేశంలో తాడేపల్లి గూడెం ఆర్ డి ఒ యం. సూర్యారావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎన్.వి అరుణకుమారి, డీవీఎంసీ సభ్యులు కె.చిన్నపెద్దిరాజు, కె.రాజశేఖర్, ఎన్జీవో ప్రతినిధి వి.ఆశాజ్యోతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ఆళ్లగడ్డ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ను సందర్శించిన ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి

### వెబ్సైట్ ద్వారా ఎక్కడ నుంచి అయినా దరఖాస్తు చేసుకోవచ్చు ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి



**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 30 నంది పత్రిక** రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ఆదేశాల మేరకు బుధవారం ఎక్సైజ్ శాఖ జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి ఆళ్లగడ్డ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. ఈ సందర్భంగా జాయింట్ కమిషనర్ ఆళ్లగడ్డ ఎక్సైజ్ శాఖ పరిధిలోని మద్యం దుకాణాల గురించి సీఐ విజయకుమార్ ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ఆదేశాల మేరకు తాను కర్నూలు, నంద్యాలలోని మద్యం దుకాణాలను పరిశీలించడం జరుగుతోందన్నారు. అందులో భాగంగా ఆళ్లగడ్డకు రావడం జరిగిందని ఇక్కడ మొత్తం 20 మద్యం దుకాణాలు ఉండగా 16 డిస్పోజల్ అయ్యాయన్నారు. మిగిలిన నాలుగు దుకాణాలకు టెండర్ దరఖాస్తులను కోరడం జరిగిందన్నారు. గురువారం అర్ధరాత్రి తో గడువు ముగుస్తోందన్నారు. ఆసక్తి కలవారు వెబ్సైట్ ద్వారా గాని, నేరుగా తమ కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సిరివెళ్లలో రెండు, రుద్రవరంలో ఒకటి, ఆళ్లగడ్డ రూరల్ లో ఒకటి మద్యం దుకాణాలకు టెండర్లను పిలవడం జరిగింది అన్నారు. పారదర్శకంగా ఈ మద్యం టెండర్ల ప్రక్రియ జరుగుతుందని, ఎలాంటి రాజకీయ ఒత్తులు ఉండవని ఆమె తెలిపారు. వెబ్సైట్ ద్వారా ఎక్కడి నుంచి అయినా దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు. ప్రతి మద్యం దుకాణానికి 10 దరఖాస్తులు ఉంటేనే పరిగణలోకి తీసుకోవాలని టెండర్లు ఖరారు చేయాలని పై అధికారులు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సూపర్డెంట్ రవికుమార్, సీఐ విజయ్ కుమార్, ఎస్సై సరస్వతి సిబ్బంది పాల్గొన్నారు.



# పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్ రూ.4.47 కోట్లతో పలు అభివృద్ధి పనులు శంకుస్థాపన

**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగరంలో పలు అభివృద్ధి పనులకు పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్ బుధవారం శంకుస్థాపన చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో 17వ వార్డు చాణక్యపురి కాలనీలో రూ.2.86 కోట్లతో 1000 కిలోలీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణం, చాణక్యపురి కాలనీ నుంచి లక్ష్మీ గార్డెన్స్ మీదుగా జోహరాపురం మెయిన్ రోడ్డు వరకు 160 మి.మీ. హెచ్‌డీపీఈ పైప్‌లైన్ ఏర్పాటు, జోహరాపురంలో వివిధ ప్రాంతాల్లో 160 మి.మీ., 110 మి.మీ. హెచ్‌డీపీఈ పైప్‌లైన్లు, సంప్ నుంచి కె.సి. కెనాల్ బ్రిడ్జి వరకు 315 మి.మీ. హెచ్‌డీపీఈ పైప్‌లైన్ ఏర్పాటు పనులకు చాణక్యపురి కాలనీలో పూజలు నిర్వహించి పైలాన్‌ను ఆవిష్కరించారు.అదేవిధంగా ఎన్‌క్యాప్ నిధులతో రూ.82 లక్షల విలువైన పనులకు కర్నూలు మెడికల్ కాలేజ్ సమీపంలో శంకుస్థాపన చేశారు. అమీలియా ఆసుపత్రి నుంచి ఉల్చాల జంక్షన్ వరకు పేవ్‌మెంట్ విస్తరణ, మెడికల్ కాలేజ్ గేట్ నుంచి షాషా మసీదు వరకు కాలిబాట నిర్మాణం, సుంకేసుల రోడ్డులో హిందూ శ్మశానవాటిక నుంచి విజయనగర్ కాలనీ వరకు పేవ్‌మెంట్ విస్తరణ పనులు చేపట్టనున్నారు. మొత్తం రూ.4.47 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కర్నూలు నగరంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం పలు అభివృద్ధి పనులను చేపడుతోందని మంత్రి టి.జి. భరత్ తెలిపారు. తాగునీటి సౌకర్యం, రహదారులు, కాలిబాటలు, పైప్‌లైన్ వ్యవస్థను అభివృద్ధి చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, సూపరింటెండెంట్ ఇంజనీర్ రమణమూర్తి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రఘు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మనోహర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు పరమేష్ యాదవ్, గున్న మార్క్, రామాంజనేయులు, పద్మలత రెడ్డి, నాయకులు అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.



### వరుసగా మూడో రోజూ నష్టాల్లో మార్కెట్లు

దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో బలహీన సంకేతాలు, ముడి చమురు ధరలు మళ్లీ పెరగడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. అమెరికా-ఇరాన్ చర్చల్లో పురోగతి ఉంటుందన్న ఆశలు తగ్గడం కూడా మార్కెట్లపై ప్రభావం చూపింది. బుధవారం సెన్సెక్స్ 48.78 పాయింట్లు నష్టపోయి 72,480.29 వద్ద ముగిసింది. నిఫ్టీ 95.75 పాయింట్లు పడిపోయి 22,620.45 వద్ద స్థిరపడింది. నిఫ్టీకి 22,600-22,550 స్థాయి తక్షణ మద్దతుగా ఉంటుందని మార్కెట్ నిపుణులు తెలిపారు. 22,500 కంటే దిగువన నిలకడగా ట్రేడైతే 22,300 స్థాయికి పడిపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. 22,800 వద్ద తక్షణ నిరోధం ఉందని చెప్పారు. హెల్త్‌కేర్, ఫార్మా షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీలో అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్, మ్యాక్స్ హెల్త్‌కేర్ ఇన్‌స్టిట్యూట్, బీఎస్‌ఈ తదితర షేర్లు నష్టపోయిన వాటిలో ఉన్నాయి. అయితే విస్తృత మార్కెట్‌లో కొంత స్థిరత్వం కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.02 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ సూచీ 0.27 శాతం లాభపడ్డాయి. రియల్టీ, ప్రైవేట్ బ్యాంక్, మీడియా రంగ సూచీలు లాభాల్లో ముగిశాయి. హెల్త్‌కేర్, ఫార్మా, కన్జ్యూమర్ డ్యూరబుల్స్, మెటల్ రంగాలు వెనుకబడ్డాయి. చమురు ధరలు పెరగడంతో ద్రవ్యోల్బణంపై ఆందోళనలు మళ్లీ పెరిగాయని నిపుణులు తెలిపారు.

# చంద్రన్న సంకల్పం.. 'పేదలకు పట్టాభిషేకం'

దశాబ్దాలుగా సొంతింటి హక్కుల కోసం ఎదురుచూస్తున్న పేదల జీవితాల్లో సరికొత్త వెలుగులను కూటమి ప్రభుత్వం నింపుతున్నది. వారి కళ్లలో ఆనందబాష్పాలను నింపుతూ, వారి కలలను సాకారం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా విశాఖపట్నంలో 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమాన్ని నిర్వహించి 28,445 మంది పేదలకు పట్టాలతో పాటు ఆస్తి యాజమాన్య బదిలీ పత్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబు అందించారు. అదే స్ఫూర్తితో ఈ నెల 30న విజయవాడ నగరంలోని 24,057 పేద కుటుంబాలకు పట్టాభిషేకం చేయనుండడం అపూర్వ ఘట్టం.విజయవాడలో ప్రతి ఎన్నికలోనూ ప్రధాన అజెండాగా మారుతున్న ఇళ్ల పట్టాల సమస్యకు కూటమి సర్కార్ చరమగీతం పాడి సరికొత్త చరిత్రను సృష్టించింది. దశాబ్దాల క్రితం అందించిన ఎన్టీఆర్ పట్టాలకు చట్టబద్ధత కల్పిస్తూ, వాటిపై లబ్ధిదారులకు పూర్తి యాజమాన్య హక్కులను కట్టబెడుతోంది. ఈ కార్యక్రమం ద్వారా సుమారు రూ.9,800 కోట్ల విలువైన 617 ఎకరాల భూమిపై పేద, మధ్య తరగతి కుటుంబాలకు అధికారం లభించనుంది. దీనివల్ల ఒక్కో కుటుంబానికి సుమారు రూ.40 లక్షల నుంచి రూ.45 లక్షల వరకు లబ్ధి చేకూరనుంది. వీరంతా బడుగు బలహీనవర్గాల వారే కావడం విశేషం. ఈ పట్టాల పంపిణీ ద్వారా ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు, కృష్ణా జిల్లాలోని గన్నవరం సహా మొత్తం 8 నియోజకవర్గాల్లోని 15 మండలాల ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. సామాజిక వర్గాలవారీగా చూస్తే బీసీలు 12,093; ఓసీలు 6,130; ఎస్సీలు 4,546; ముస్లిం బీసీలు 955; ఎస్టీలు 333 కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నాయి. గత ప్రభుత్వంలో కేవలం హామీలకే పరిమితమైన విజయవాడ ఇళ్ల స్థలాల సమస్యకు చంద్రబాబు నాయుడు పక్కా వ్యూహంతో ముగింపు పలికారు. ఈ నెల 30న జరగబోయే భారీ బహిరంగ సభలో లబ్ధిదారులకు శాశ్వత ఇళ్ల పట్టాలను సీఎం చంద్రబాబు అందజేయనున్నారు. దశాబ్దాలుగా ఎంతోమంది ముఖ్యమంత్రులు మారినా, ఎన్నో ఎన్నికలు వచ్చినా పరిష్కారం కాని ఈ సమస్యను కూటమి ప్రభుత్వం కేవలం కొద్ది నెలల పాలనలోనే పరిష్కరించటం విశేషం. తాము నివసిస్తున్న స్థలాలపై తమకు హక్కులు లేక, ఎప్పుడు ఏ ముప్పు వస్తుందోనని భయపడుతూ బతికిన విజయవాడ పేద ప్రజలకు ఇది నిజంగా పండుగ.గతంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం సెంటు భూమి పేరుతో ఊళ్లకు మైళ్ల దూరంలో, కొండల్లో, గుట్టల్లో, లోతట్టు ప్రాంతాల్లో కేవలం 'కాగితాలు' ఇచ్చి చేతులు దులుపుకుంది. కానీ చంద్రబాబు నాయుడు మాత్రం పేదలు దశాబ్దాలుగా ఎక్కడైతే నివాసం ఉంటున్నారో, ఆ విలువైన నగర ప్రాంతాల్లోనే వారికి సంపూర్ణ యాజమాన్య హక్కులతో కూడిన శాశ్వత పట్టాలను ఇస్తూ పేదల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. 40 ఏళ్ల క్రితమే పేదవాడికి పక్కా ఇల్లు ఉండాలనే ఆలోచనతో స్వర్గీయ ఎన్టీఆర్ పేదల ఇళ్ల పట్టాలకు శ్రీకారం చుట్టారు. అదే స్ఫూర్తితో ఇప్పుడు కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ప్రజలు ఇచ్చిన అధికారంతో రాష్ట్ర పునర్నిర్మాణానికి చంద్రబాబు ఒక్కో ఇటుకా పేరుస్తున్నారు.

విధ్వంసం నుంచి వికాసం వైపు.. భయం నుంచి భరోసా వైపు.. నిరాశ నుంచి కొత్త ఆశల వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నారు. ఇది పట్టాల పంపిణీ మాత్రమే కాదు.. పేదల ఆత్మగౌరవానికి పట్టాభిషేకం. పేదల హక్కులకు, పిల్లల భవిష్యత్తుకు పట్టాభిషేకం.

# డ్రాగన్ తో చర్చలు సఫలీకృతం అయ్యేనా!?

భారత్ తో డ్రాగన్ మళ్లీ కలిసేందుకు సిద్ధమైంది. గత విద్వేషాలకు స్వస్తి పలుకుతూ భారత్ తో సుస్థిర బంధం ఏర్పరుచుకోవడానికి చైనా తహతహ లాడుతోంది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్, తదనంతర పరిణామాలతో భారత్ విమానయాన సంస్థలకు పాకిస్తాన్ తన గగనతలాన్ని మూసేసింది. దీంతో పాకిస్తాన్ మీదుగా వెళ్లాల్సిన భారత విమానాలు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఐరోపా, ఉత్తర అమెరికా వైపు వెళ్లే విమానాలు ఇతర మార్గాల్లో వెళ్తున్నాయి. దీనివల్ల ప్రయాణ సమయం, నిర్వహణ ఖర్చు పెరగడం వల్ల విమానయాన సంస్థలపై ఆర్థిక భారం పడుతోంది. ఈ నేపథ్యంలో భారత్ గత ఏడాది కాలంగా ప్రత్యామ్నాయ మార్గాల్ని అన్వేషిస్తోంది. ఇందులో భాగంగా చైనాలోని హోటాన్ మీదుగా విమానాలు నడిపేందుకు అనుమతివ్వాలని డ్రాగన్ ను కోరుతోంది.అయితే ఇన్నాళ్లూ భారత్ చేసిన ఈ ప్రతిపాదనపై చైనా స్పందించడం లేదు. కానీ తాజాగా బ్రిక్స్ సదస్సు సందర్భంగా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ భారత్‌లో పర్యటించినప్పుడు.. ప్రధాని మోడీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా చైనా అధికారులతో భారత అధికారులు చర్చలు జరుపుతున్నారు. భారత విమానయాన సంస్థలకు ప్రత్యామ్నాయ మార్గంగా జిన్‌జియాంగ్ గగనతలాన్ని ఇచ్చేందుకు భారత్.. చైనాతో చర్చలు జరుపుతోందని అధికారులు తెలిపారు. ప్రత్యామ్నాయ మార్గాలపై విదేశాంగ మంత్రిత్వ శాఖ చైనా ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతోందని వారు స్పష్టం చేశారు.జిన్‌పింగ్ ఢిల్లీ పర్యటనకు ముందు, చైనా సదరన్ ఎయిర్‌లైన్స్, ఆరు సంవత్సరాలుగా నిలిపివేసిన మార్గాన్ని పునరుద్ధరిస్తూ.. సెప్టెంబర్ 21 నుండి గ్వాంగ్‌జౌ-న్యూఢిల్లీ మధ్య ప్రత్యక్ష విమాన సర్వీసులను తిరిగి ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. కోవిడ్ మహమ్మారి, భారత్-చైనా సరిహద్దు వెంబడి నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. ఇరు దేశాల మధ్య ప్రత్యక్ష విమాన సంబంధాలను పునరుద్ధరించే ప్రయత్నంలో ఇదొక భాగం. భారత్-చైనా మధ్య పునఃప్రారంభించిన తొలి భారతీయ విమానయాన సంస్థ ఇండిగో. గత అక్టోబర్‌లో కోల్‌కతా-గ్వాంగ్‌జౌ మధ్య ఇండిగో సర్వీసులను పునఃప్రారంభించింది. నవంబర్‌లో ఢిల్లీ-గ్వాంగ్‌జౌ మధ్య కూడా భారత్-చైనా ప్రత్యక్ష విమాన సర్వీసులను తిరిగి ప్రారంభించింది. ఆ తర్వాత ఎయిర్ ఇండియా ఫిబ్రవరి 1న ఢిల్లీ-షాంఘై సర్వీసులను నడిపింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు చైనా మీదుగా ఇతర దేశాలకు వెళ్లేందుకు భారత్ అనుమతులు కోరుతోంది. మరోవైపు భారత్- చైనా మధ్య సంబంధాలు గతంతో పోలిస్తే నేడు మెరుగ్గా ఉన్నాయని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అభిప్రాయపడ్డారు. సరిహద్దు సమస్యలు పరిష్కారం కావడంతో ఇరు దేశాల సంబంధాలు సాధారణ స్థితికి చేరుకుంటున్నాయని అన్నారు. సోమవారం న్యూయార్క్‌లో 'ఆసియా సొసైటీ'లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న జైశంకర్ ఈ మేరకు స్పందించారు. "గతంతో పోలిస్తే ప్రస్తుతం సంబంధాలు మెరుగ్గా ఉన్నాయా అని నన్ను అడిగితే, 'అవును' అని అంటాను. 2024తో పోలిస్తే అవి మరింత మెరుగ్గా ఉన్నాయి." అన్నారు. 2020లో భారత్- చైనా మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు తలెత్తిన తర్వాత రెండు దేశాల మధ్య సాధారణ సంబంధాలు నిలిచిపోయాయని జైశంకర్ చెప్పారు. వాణిజ్యం కొనసాగినప్పటికీ, అధికారిక రాకపోకలు, వీసా జారీ, విమాన సర్వీసులు మాత్రం ప్రభావితమయ్యాయని వివరించారు. ఈ క్రమంలోనే సరిహద్దు ఉద్రిక్తతలు పరిష్కారం కాగానే, సంబంధాలు మెరుగుపడటం సహజమని అన్నారు. మేము ఒక అత్యంత ప్రాథమిక సూత్రానికి వచ్చాం. సరిహద్దు పరిస్థితే మన సంబంధాల స్థితిని నిర్ణయిస్తుంది. సరిహద్దులో ఉద్రిక్తతలు కొనసాగుతుండగా, సంబంధాలు మాత్రం సాధారణంగా ఉండాలని ఆశించడం సాధ్యం కాదు. సరిహద్దు పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుంటున్న కొద్దీ, మన సంబంధాలు కూడా సాధారణ స్థితికి వస్తాయి. సంబంధాలు సాధారణ స్థితికి రావడం వల్ల మన ఇద్దరికీ ప్రయోజనం చేకూరుతుంది. ఒక నిర్దిష్ట సమస్యపై మాత్రమే పూర్తిగా దృష్టి సారించి, తద్వారా నష్టపోయే పరిస్థితిని నేను కోరుకోను. నాకు అనుకూలమైన పరిష్కారం దొరికితే, దానినే ఎంచుకోవడానికి నేను ప్రాధాన్యం ఇస్తానని అన్నారు. మన మధ్య సంబంధాల్లో ప్రతిష్టంభన లేదా క్షీణత అనేది వాస్తవానికి మనలో ఎవరికీ ప్రయోజనం చేకూర్చదు. పైగా దీనివల్ల మూడో పక్షాలే లాభపడతాయి. ఇదే విషయాన్ని భారత్? చాలా కాలంగా చైనాకు చెబుతోంది. అలాగే, 'ఇతరులకు ప్రయోజనం చేకూర్చే సమస్యలో మనం చిక్కుకుపోకూడదు' అనే అత్యంత ప్రాథమిక దౌత్య సూత్రాన్ని కూడా మేము నిలకడగా పాటించాం. ఏ కారణం చేతనో, చైనా పక్షం దీనిని అంగీకరించడానికి కొంత సమయం పట్టింది. అయితే, ఆ సుదీర్ఘ ప్రతిష్టంభన మన ప్రయోజనాలకు ఏమాత్రం ఉపయోగపడలేదని నా అభిప్రాయం. అది వారికి కూడా ఏ విధంగానూ మేలు చేయలేదు. మన సంబంధాల్లో మెరుగుదల అనేది కేవలం చైనాతోనే కాకుండా, ప్రపంచ దేశాలతో మనకున్న సంబంధాల్లోనూ మన స్థానాన్ని బలోపేతం చేస్తుందని నేను భావిస్తున్నాను." అని జైశంకర్? అన్నారు. ఇటీవల కాలంలో ఇరు దేశాల సంబంధాల్లో సానుకూల మార్పులు కనిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే బ్రిక్స్ ( సదస్సు కోసం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భారత్‌లో పర్యటించడం వంటి పరిణామాలు జరిగాయి. మరోవైపు సీమాంతర ఉగ్రవాదమే భారత్‌కు ఉన్న ప్రధాన ఆందోళన అని విదేశాంగమంత్రి గా.జైశంకర్ అన్నారు. దశాబ్దాలుగా పొరుగు దేశం ఉద్దేశపూర్వకంగా ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తోందని పాకిస్థాన్‌ను ఉద్దేశించి తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రపంచంలో మరే దేశం కూడా భారత్‌లా ఉగ్రవాద బాధితురాలిగా లేదన్నారు. కీలకమైన ఈ ఆందోళనలను భాగస్వామ్య దేశాలు అర్థం చేసుకోకపోతే ద్వైపాక్షిక సంబంధాలపై కచ్చితంగా ప్రతికూల ప్రభావం పడుతుందని జైశంకర్ హెచ్చరించారు. మరోవైపు భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం ఖరారైతే ఇరు దేశాల సంబంధాలు మరింత మెరుగుపడతాయని జైశంకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ట్రంప్ హయాంలో అమెరికా-పాకిస్థాన్ మధ్య బంధం బలపడుతున్న నేపథ్యంలో జైశంకర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఏదిఏమైనా ఇరు దేశాల మధ్య చర్చలు ఫలించి గగనతలంపై విమానాల రాకపోకలు మళ్లీ పునఃప్రారంభం కావాలి. ఇరు దేశాల మధ్య నెలకొన్న ఇతర సమస్యలపై కూడా అధికారులు దృష్టి సారించి సామరస్యంగా పరిష్కరించుకోవాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

# ఏభయ్యేళ్ల శ్రీవిశాఖ గ్రామీణ బ్యాంక్

గ్రామీణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలను అందించేందుకు కమర్షియల్ బ్యాంక్ నైపుణ్యాలు, కో ఆపరేటివ్ బ్యాంక్ రూరల్ స్వభావం కలగలిసిన, తక్కువ వ్యయ నిర్మాణంతో 30 సెప్టెంబర్, 1976న ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల చట్టం (ఆర్ఆర్‌బీ చట్టం1976) ప్రకారం శ్రీవిశాఖ గ్రామీణ బ్యాంక్ ఏర్పడింది. అప్పటికి రహదారులెరుగని గ్రామాలు, కొండకోనలు, అడవుల మధ్యన ఉన్న గూడేలు... సన్న, చిన్నకారు వ్యవసాయదారులు.. వ్యవసాయ ఆధార వృత్తిజీవులు.. చేతివృత్తుల కళాకారులు.. ఆర్థిక సహకారం కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపార వ్యవస్థల మధ్య నలుగుతున్న గ్రామీణుల దగ్గరకు శ్రీవిశాఖ గ్రామీణ బ్యాంక్ సిబ్బంది అడుగుపెట్టారు. అందులో నేనొకడిని. బ్యాంక్‌కు అవసరమైన భవంతి గానీ, సిబ్బంది నివసించడానికి సరైన గృహాలు గానీ లేని రోజులవి. రవాణా సౌకర్యాలు లేని ప్రాంతాలకు ప్రైవేట్ వాహనాల్లో బ్యాంక్ సరంజామా తీసుకువెళ్లడం, సిబ్బంది కాలి నడకన బ్యాంక్‌కు చేరడం, కాస్త స్తోమత గలవారి ఇంటిలో ఓ గదిలో నివాసం ఉండడం, పెళ్లిళ్లు కాని యువకులే ఎక్కువ కాబట్టి బ్యాంకే ఏకైక స్థావరం, కార్యస్థానం.ఇప్పటిలా నెట్ బ్యాంకింగ్ కాదు, అంతా కాగితాధార కార్యాచరణే. ఇప్పుడు కంప్యూటర్‌తో చేసే పనులన్నీ అప్పుడు చేత్తో చేసేవాళ్లు. చాలావరకూ... బ్యాంక్ మొహం ఎరుగని కష్టమర్లు, అక్షరాస్యత లేని జనాలు. వీరి మధ్య బ్యాంక్ ప్రధాన కర్తవ్యాలైన డిపాజిట్ల సేకరణ, రుణ పంపిణీలను శక్తికి మించి శ్రీవిశాఖ సిబ్బంది సాగించారు. ప్రభుత్వాలు ప్రకటించే సబ్సిడీ పథకాలపై ఒక్కోచోట గ్రామ పెత్తందార్లు, లిటిగెంట్ ప్రభుత్వ ఉద్యోగులతో సమన్వయం చేసుకొని అనేక ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించారు. గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, చేతివృత్తుల వారు, గ్రామీణ పారిశ్రామికవేత్తలకు తక్కువ వడ్డీకే రుణ సదుపాయాలు అందించి, వారిని ఆర్థికంగా ఆదుకోవడంలో శ్రీవిశాఖ కీలకపాత్ర పోషించింది. గ్రామీణ ప్రాంతాలలో బ్యాంకింగ్ సౌకర్యాలు లేని చోట బ్రాంచీలను ఏర్పాటు చేసి, పొదుపు సంస్కృతిని నేర్పింది. రైతులకు ప్రాధాన్యం ఇచ్చి సకాలంలో పంట రుణాలు అందించింది. స్వయం ఉపాధి పథకాలు ఎన్నో ప్రవేశపెట్టింది. ముఖ్యంగా గ్రామీణ మహిళలు, స్వయం సహాయక సంఘాలు, కుటీర పరిశ్రమలకు తక్కువ వడ్డీతో ఆర్థిక సహాయం చేయడం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో కూడా అధిక భాగస్వామ్యం శ్రీవిశాఖదే.కాలక్రమంలో ప్రభుత్వాల విధానాల్లో భాగంగా శ్రీవిశాఖ గ్రామీణ బ్యాంక్‌తో నాగార్జున, సంగమేశ్వర, మంజీర, కాకతీయ గ్రామీణ బ్యాంకులు విలీనమై ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ) 2006లో ఏర్పడింది. తర్వాత కేంద్ర ప్రభుత్వం 'వన్ స్టేట్‌వన్ ఆర్ఆర్‌బీ' (ఒక రాష్ట్రానికి ఒకే గ్రామీణ బ్యాంక్) విధానాన్ని తీసుకురావడంతో, మే 1, 2025 నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని నాలుగు ప్రధాన గ్రామీణ బ్యాంకులను (చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్, ఏపీజీవీబీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాఖలు) విలీనం చేసి సరికొత్తగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ (ఏపీజీబీ)ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇది యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నడుస్తోంది.బ్యాంక్‌లో మెసెంజర్ సిబ్బందిని టెంపరరీగా నియమించటం, రోజు కూలీ ఇవ్వడం... ఇలాంటి ఆర్థిక సమస్యలే గాక, సర్వీస్ రూల్స్, ప్రమోషన్లకు సంబంధించి న్యాయబద్ధ పద్ధతి లేకపోవడం వంటి అనేక సమస్యలపై పోరాటం చేయడమే గాక, ప్రజలకు నష్టదాయకమైన రూల్స్‌ను యాజమాన్యం పెడితే, వ్యతిరేకించటం శ్రీవిశాఖ సిబ్బంది కర్తవ్యాలయ్యాయి. ఈనాడు సాంకేతికంగా, బ్యాంకింగ్ పరంగా బ్యాంక్ అభివృద్ధి అయినట్టే సిబ్బంది కూడా తమకు రావలసిన న్యాయబద్ధమైనవన్నీ పొందారు. అలనాడు శ్రీవిశాఖ గ్రామీణ బ్యాంక్ సిబ్బందిగా జీవితాలను ఆరంభించిన వారిలో కొందరు మరణించారు. జీవించి ఉన్నవారు తమ ఏభయ్యేళ్ల అనుభవాలను, అనుభూతులను కలబోసుకోవడానికి బ్యాంక్ స్థాపన దినమైన సెప్టెంబర్ 30న విశాఖపట్నంలో సమావేశమవుతున్నారు. ఇది ఏభయ్యేళ్ల గుండె చప్పుళ్ల సంబరం.



## కర్నూలు జిల్లా పార్టీ కార్యాలయంలో పార్లమెంటరీ స్థాయి సమావేశం

### టీడీపీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కైపా పద్మలతారెడ్డి



**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ ఆధ్వర్యంలో నెలవారీ పార్లమెంటరీ స్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశంలో ఎమ్మిగనూరు శాసనసభ్యులు జయనాగేశ్వర్ రెడ్డి , మంత్రాలయం ఇన్‌చార్జ్ రాఘవేంద్ర రెడ్డి , తుగ్గలి నాగేంద్ర , కెడీసీసీబీ చైర్మన్ సోమిశెట్టి , కొడుమూరు శాసనసభ్యులు బొగులు దస్తగిరి , కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.సమావేశంలో పార్టీకి సంబంధించిన ముఖ్యమైన అంశాలు, కార్యకర్తల సమస్యలు, ప్రజా సమస్యలు మరియు భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించడం జరిగింది. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని పలు అజెండాలను ఏకగ్రీవంగా నిర్ణయించి, అనంతరం ఆ అంశాలను మై టీడీపీ యాప్ ద్వారా రాష్ట్ర పార్టీ కార్యాలయానికి పంపించడం జరిగింది. ఈ సందర్భంగా కైపా పద్మలత రెడ్డి మాట్లాడుతూ, పార్టీ నాయకులు, కార్యకర్తల సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నత నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని, రాబోయే కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు నాయకులు మరియు కార్యకర్తలు కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

## రష్యా సైన్యంలో చేరొద్దు.. అది చాలా ప్రమాదకరం

రష్యా సైన్యంలో చేరడం అత్యంత ప్రమాదకరమని, అటువంటి నిర్ణయాలు తీసుకోవద్దని భారత ప్రభుత్వం తన పౌరులను మరోసారి గట్టిగా హెచ్చరించింది. ఉక్రెయిన్‌తో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో, ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రాణాలను పణంగా పెట్టవద్దని సూచించింది. ఈ మేరకు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. గత రెండేళ్లుగా హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ, కొందరు భారతీయులు రష్యా సైన్యంలో చేరుతున్నట్లు నివేదికలు అందుతున్నాయని విదేశాంగ శాఖ పేర్కొంది. అధిక ఆదాయం వస్తుందన్న ఆశతో కొందరు స్వచ్ఛందంగా రష్యా సైన్యంలో చేరి, ఆ తర్వాత సమస్యలు ఎదురైనప్పుడు భారత ప్రభుత్వాన్ని ఆశ్రయిస్తున్నారని వివరించింది. ఇది తీవ్ర ఆందోళన కలిగించే ధోరణి అని, ఇలాంటి చర్యలను ప్రభుత్వం ఏమాత్రం ప్రోత్సహించబోదని స్పష్టం చేసింది. తాత్కాలిక ఆర్థిక ప్రయోజనాల కోసం కొందరు భారతీయులు తమ భారత పౌరసత్వాన్ని వదులుకుని, రష్యా పాస్‌పోర్ట్ పొంది మరీ అక్కడి సైన్యంలో చేరుతున్న ఉదంతాలు తమ దృష్టికి వచ్చాయని విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ఇటువంటి చర్యల వల్ల తలెత్తే ప్రాణాపాయ పరిస్థితులను పౌరులు గమనించాలని హితవు పలికింది. అనధికారిక ఏజెంట్లు, కొన్ని సంస్థలు సైతం అక్రమంగా రిక్రూట్‌మెంట్లు చేస్తున్నాయని, ఇటువంటి ఉద్యోగ ఆఫర్ల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని పౌరులకు విజ్ఞప్తి చేసింది. రష్యా సైన్యంలో ఉన్న భారతీయుల భద్రతతో పాటు, వారిని త్వరగా స్వదేశానికి రప్పించేందుకు రష్యా ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. ఇప్పటివరకు 139 మంది భారతీయులను సురక్షితంగా వెనక్కి రప్పించామని, మిగిలిన సుమారు రెండు డజన్ల మందిని కూడా రప్పించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని విదేశాంగ శాఖ వెల్లడించింది.

## భారత్‌లోని ప్రతి ముస్లిం పూర్వీకులు రాముడు, కృష్ణుడే

యోగా గురు బాబా రాందేవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారతదేశంలోని ముస్లింలందరూ మతం మారినవారేనని, శ్రీరాముడు, శ్రీకృష్ణులను తమ పూర్వీకులుగా గుర్తించాలని వ్యాఖ్యానించారు. బుధవారం మధురలో ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో ఏ రాజకీయ పార్టీ కూడా ముస్లింలకు స్వతంత్ర రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని ఆశించడం లేదని, వారిని కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయంటూ మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలపై రాందేవ్ స్పందించారు. "మన ప్రాచీన రుషులు, శ్రీరామకృష్ణులు తమ పూర్వీకులేనని ముస్లిం సోదరులందరూ గుర్తించాలి. తమ మూలాలతో అనుసంధానమైతే వారు ఎన్నటికీ బలహీనంగా భావించరు" అని రాందేవ్ పేర్కొన్నారు. హిందూ-ముస్లింలు ఐక్యంగా ఉంటేనే దేశం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. ఇదే తరహా వ్యాఖ్యలను గతంలో బీజేపీ మైనారిటీ మోర్చా జాతీయ అధ్యక్షుడు జమాల్ సిద్దిఖీ, ఉత్తరప్రదేశ్ మంత్రి ఆనంద్ స్వరూప్ శుక్లా కూడా చేసిన సందర్భాలు ఉన్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన 'శివుడు పేదల దేవుడు, రాముడు ధనికుల దేవుడు' అనే వ్యాఖ్యలపై కూడా రాందేవ్ స్పందించారు. సనాతన ధర్మంలో కులం, వర్గం పేరుతో కొందరు విభేదాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. రాముడు, కృష్ణుడు, శివుడు, హనుమంతుడు అందరూ ఒక్కటేనని, దేవుడి పేరుతో గందరగోళం సృష్టించవద్దని విజ్ఞప్తి చేశారు.

## ఐసీఐసీఐ బ్యాంకు సేవల్లో సాంకేతిక అంతరాయం

ప్రముఖ ప్రైవేటు రంగ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్ సేవల్లో సాంకేతిక అంతరాయం ఏర్పడింది. దీనివల్ల బ్యాంకు ఖాతాదారులు, ప్రధానంగా మొబైల్ యాప్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లోని కస్టమర్లు ఈ సమస్యపై సోషల్ మీడియా వేదికగా తమ అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం నుంచి ఈ సాంకేతిక సమస్య తలెత్తినట్లు సమాచారం. మొబైల్ యాప్‌లోకి లాగిన్ అవ్వడానికి ప్రయత్నిస్తే, 'కస్టమర్ కేర్‌ను సంప్రదించండి' అనే సందేశం కనిపిస్తోందని పలువురు యూజర్లు పేర్కొంటున్నారు. మొబైల్ బ్యాంకింగ్, లాగిన్ వంటి కీలక సేవలు నిలిచిపోవడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. సాంకేతిక సమస్యలను పర్యవేక్షించే డౌన్‌డిటెక్టర్ సైతం ఐసీఐసీఐ బ్యాంకు సేవలపై ఫిర్యాదులు భారీగా పెరిగాయని ధ్రువీకరించింది. అయితే, పెద్ద సంఖ్యలో ఖాతాదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, ఈ అంతరాయంపై ఐసీఐసీఐ బ్యాంక్ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. సమస్యకు గల కారణాలు, సేవలు ఎప్పుడు పునరుద్ధరిస్తారనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతానికి ఈ సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రత్యామ్నాయ బ్యాంకింగ్ మార్గాలను ఎంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## జగన్, మమత, పవార్ కాంగ్రెస్‌లోకి తిరిగి రావాలి

వైసీపీ అధినేత జగన్ తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి చేరే అవకాశాలున్నాయంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేపుతున్నాయి. జగన్, మమతా బెనర్జీ, శరద్ పవార్ వంటి కాంగ్రెస్ పార్టీ మాజీ నేతలు తిరిగి సొంత గూటికి రావాలని ఆయన పిలుపునిచ్చారు. వారంతా పార్టీలోకి వస్తే అందరికంటే తానే ఎక్కువ సంతోషిస్తానని అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్ 2026లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డితో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్న భట్టి... జగన్‌తో నేరుగా పనిచేయకపోయినా, పాత నేతలంతా తిరిగి వస్తే దేశాన్ని, పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేసినవారవుతారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నేతలను కులం కోణంలో చూడకూడదని, తామిద్దరం ఐక్యంగా, సమష్టి నిర్ణయాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నామని వివరించారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వంపై భట్టి తీవ్ర విమర్శలు చేశారు. తాము చెల్లించే ప్రతి రూపాయి పన్నుకు బదులుగా తెలంగాణకు కేవలం 43 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోందని మండిపడ్డారు. ఇదే సమయంలో, ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, ఇది బీజేపీకి లబ్ధి చేకూర్చేలా ఉందని ఆరోపిస్తూ... చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలను ఆయన సమర్థించుకున్నారు. ఇవి ఉచితాలు కావని, పేదలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చి, వారి కొనుగోలు శక్తిని పెంచడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే చర్యలని స్పష్టం చేశారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com